**ముహూర్తం**

శ్రీ వికారినామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, శుక్లపక్షం; తిథి: త్రయోదశి రా.10.19 వరకు; నక్షత్రం:పూర్వాభాద్ర (శనివారం) తె.5.10 వరకు; అమృతకాలం: రా.8.11 నుండి 9.59 వరకు; వర్జ్యం: ఉ.9.25 నుండి 11:13 వరకు; దుర్ముహూర్తం: ఉ.8.32 నుండి 9.18 వరకు, మ.12.26 నుండి 1.13 వరకు; రాహుకాలం: ఉ.10.34 నుండి మ.12.02 వరకు; యమగండం: మ.2.58 నుండి సా.4.26 వరకు;

Estd. 1938

# ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!








సంపుటి:58 • సంచిక: 172 • శుక్రవారం 11 అక్టోబర్ 2019 • హైదరాబాద్ * పేజీలు:10+4 • వెల: 5.00 • Published from:Hyderabad|Karimnagar|Nizamabad|Suryapet| Vijayawada|Guntur|Rajahmundry| Visakhapatnam| Tirupati|Kurnool |Anantapur|Nellore


# పల్లెవించిన ప్రగతి

ఫలించిన 30 రోజుల ప్రణాళిక.. బ్రహ్మాండంగా అమలు చేశారు

ఇదే స్ఫూర్తితో కొత్త కార్యక్రమాలు చేపడదాం • విద్యుత్‌శాఖ పనితీరు అద్భుతం.. అగ్రస్థానం ఆ శాఖదే • పంచాయతీలకు పుష్కలంగా నిధులు

**పంచాయతీ ఉద్యోగులకు జీవిత బీమా**




## ప్లాస్టిక్‌పై నిషేధం

"తెలంగాణలో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధిస్తాం. పర్యావరణాన్ని విపరీతంగా దెబ్బతీస్తూ జీవకోటి మనుగడకే ముప్పుగా మారింది. ప్లాస్టిక్ నిషేధంపై త్వరలోనే మంత్రివర్గ సమావేశంలో చర్చించి తగు నిర్ణయం ప్రకటిస్తాం. ప్లాస్టిక్ ఉత్పత్తి, అమ్మకాలను నిషేధించేందుకు సంబంధించిన విధివిధానాలను సిద్ధంచేయండి.

- కలెక్టర్ల సదస్సులో సీఎం కేసీఆర్




నెలనెలా రూ. 399 కోట్లిచ్చి తీరుతాం

నరేగా నిధులతో మొక్కల పెంపకం, చెత్త తొలగింపు

పరిశుభ్ర ఇంటికి ఉత్తమ గృహ పురస్కారం

గ్రామాల్లో మార్పుకోసమే ఈ తపనంతా

అడిగినన్ని నిధులు.. ఇక అధికారులదే బాధ్యత

మంత్రులు, కలెక్టర్లు, పీఆర్ అధికారులతో సీఎం కేసీఆర్ సుదీర్ఘ సమీక్ష.. కీలక నిర్ణయాలు ప్రకటన

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** గ్రామాల్లో పచ్చదనం - పరిశుభ్రత మెరుగుపరచడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన 30 రోజుల ప్రత్యేక కార్యాచరణ (పల్లె ప్రగతి) విజయవంతమైందని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో పల్లెప్రగతి సందర్భంగా నిర్వహించిన 'పవర్‌వీక్' కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించి విద్యుత్ సంబంధిత సమస్యలు పరిష్కరించడంలో ఆ శాఖ అంకితభావంతో పనిచేసిందని, అగ్రగామిగా నిలిచిందని కితాబిచ్చారు. ప్రగతిభవన్‌లో గురువారం పల్లెప్రగతిపై మంత్రులు, కలెక్టర్లు, డీపీవోలు, డీఎల్పీవోలు, ముఖ్యకార్యదర్శులతో సుదీర్ఘ సమావేశం నిర్వహించారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన ఈ సమావేశం సాయంత్రందాకా కొనసాగింది. పల్లెప్రగతి కార్యక్రమాన్ని విజయవంతం చేసిన మంత్రులు, కలెక్టర్లు, జిల్లా పంచాయతీ, డివిజనల్ పంచాయతీ, మండల పంచాయతీ, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లను సీఎం అభినందించారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సదస్సుకు హాజరైన కలెక్టర్లు తమ అనుభవాలను సీఎం కేసీఆర్‌కు వివరించారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు "సమష్టి ప్రణాళిక, సమష్టి కార్యాచరణ, సమష్టి అభివృద్ధి" అనే ఆశయాలతో కార్యక్రమం నిర్వహించామని కలెక్టర్లు చెప్పారు. ఆయా జిల్లాల్లో నెలకొన్న ప్రత్యేక పరిస్థితులను వారు ఈ సందర్భంగా సీఎంకు వివరించారు. పల్లెప్రగతి కార్యక్రమంతో మంచి ఫలితాలు వచ్చాయని, మన గ్రామాన్ని మనమే పరిశుభ్రంగా తీర్చిదిద్దుకోవాలన్న అవగాహన పల్లెప్రగతి సందర్భంగా ప్రజల్లో వచ్చిందని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించడానికి భవిష్యత్తులోనూ ఈ తరహా కార్యక్రమాలు ప్రభుత్వం నిర్వహిస్తుందని చెప్పారు. గ్రామాలు బాగుపడాలనే ఉద్దేశంతో గ్రామ కార్యదర్శుల నుంచి జిల్లా పంచాయతీ అధికారి వరకు అన్ని ఖాళీలను భర్తీ చేశామని సీఎం గుర్తుచేశారు. గ్రామ పంచాయతీలకు ఎట్టి పరిస్థితుల్లోనూ నిధుల కొరత రానివ్వమని పునరుద్ఘాటించారు. గతంలో హామీనిచ్చిన విధంగా గ్రామ పంచాయతీలకు క్రమం తప్పకుండా ప్రతినెలా రూ.339 కోట్ల ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వం విడుదల చేస్తుందని కేసీఆర్ చెప్పారు. గ్రామ పంచాయతీలకు సమకూరే సొంత ఆదాయానికి ఈ నిధులు అదనమని అన్నారు. మొక్కలు పెంపకం, చెత్త తొలగింపు పనులకు నరేగా నిధులను వాడుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీలకు అవసరమైన సిబ్బందిని నియమించామని, నిధులను కూడా అవసరమైన మేర విడుదల చేశామని గుర్తుచేశారు. ఇప్పటికైనా గ్రామాల్లో మార్పు జరగాలన్నది ప్రభుత్వ లక్ష్యమని ఆయన అన్నారు. జిల్లా పంచాయతీ అధికారులు ప్రధాన బాధ్యత తీసుకుని నిధులను సక్రమంగా వినియోగించుకోవాలని తద్వారా గ్రామాల్లో మార్పు రావాలని కేసీఆర్ అభిలషించారు. గ్రామస్థాయిలో రూపొందించిన వార్షిక, పంచవర్ష ప్రణాళికలకు అనుగుణంగా 3వ పేజీలో...

## దసరా ఘనత చాటేందుకే అలయ్.. బలయ్



8

# కోడ్ ముగియగానే కోర్కెలు తీరుస్తా!

ఉద్యోగ సంఘాలతో భేటీ అవుతా • 30 రోజుల ప్రణాళికలో బాగా పనిచేశారు • త్వరలో డీఏ పైనా ప్రకటన

ప్రగతిభవన్‌లో ఉద్యోగ జేఏసీ నేతలతో సీఎం కేసీఆర్

3



# ఆర్టీసీ సమ్మె సరే స్పష్టత ఏదీ?

ఆర్టీసీ పరిరక్షణ.. ప్రభుత్వంలో సంస్థ విలీనం

ఇదెలా పరిష్కారమవుతుందో కార్మికులే చెప్పాలి




**(హైదరాబాద్, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)**

సమ్మె చేస్తున్న టీఎస్ఆర్టీసీ కార్మికుల డిమాండ్లలో స్పష్టత లోపించింది. ఓ వైపు ఆర్టీసీ పరిరక్షణే ధ్యేయంగా వీరు పేర్కొంటున్నారు. మరోవైపు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. విలీనం వల్ల కార్మికులు ప్రభుత్వోద్యోగులౌతారు. అయితే ఆ తర్వాత ప్రభుత్వం ఆర్టీసీకి సంబంధించి తీసుకునే ఏ నిర్ణయాన్ని ప్రశ్నించే అధికారం వీరికి ఉండదు. ఆంధ్రప్రదేశ్‌లో ఆర్టీసీ కార్మికులు తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం విలీనం వైపు మొగ్గుచూపారు. కానీ తెలంగాణ కార్మికులు ఆర్టీసీని కాపాడుకుంటూనే విలీనాన్ని డిమాండ్ చేస్తున్నారు. దీంతో ఇదే విధంగా పరిష్కారమౌతుందన్న సందిగ్ధం నెలకొంది. టీఎస్ఆర్టీసీ సమ్మె పరిష్కార విధానాలపై తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఆసక్తి కనిపిస్తోంది. సమ్మెపై తన విధానాన్ని ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. ఆర్టీసీని పరిరక్షించుకుంటూనే ప్రైవేటీకరణకు వెళ్తామంటూ సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. ఆర్టీసీకి ఉన్న అన్ని వెసులుబాట్లు కొనసాగిస్తామన్నారు. ప్రజలకిస్తున్న రాయితీల్ని ప్రభుత్వం ఆర్థికంగా భరిస్తుందన్నారు. 50శాతం ఆర్టీసీలో, మరో 50శాతం ప్రైవేటు రంగంలో బస్సుల్ని నిర్వహిస్తామన్నారు. తద్వారా ఆరోగ్యకరమైన 2వ పేజీలో...



## సాహిత్యంలో ఇద్దరికి నోబెల్

9

**నేడు చైనా అధ్యక్షుని రాక**

# వివాదమా వాణిజ్యమా?

మహాబలిపురంలో మోడీతో భేటీ

కాశ్మీర్ సమస్య లేవనెత్తుతారా?

వాణిజ్య బంధమే ప్రధానమా?

జిన్‌పింగ్ పర్యటనపై ప్రపంచ దేశాల్లో ఆసక్తి



**(న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)**

చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్ రెండ్రోజుల భారత పర్యటన నిమిత్తం శుక్రవారం మధ్యాహ్నం చెన్నై చేరుకుంటున్నారు. చెన్నై సమీపంలోని మహాబలిపురంలో భారత ప్రధాని నరేంద్రమోడి, జిన్‌పింగ్‌ల మధ్య అనధికార చర్చలు జరగనున్నాయి. ఈ చర్చలు కేవలం ఇరు దేశాల మధ్య సంబంధ బాంధవ్యాల్ని మెరుగుపర్చుకోవడానికే. వీటిలో ఎలాంటి ఒప్పందాలుండవు. ఇరు దేశాధినేతల సంయుక్త ప్రకటనలుండవు. డోక్లామ్ ప్రతిష్టంభన సామరస్య పరిష్కార అనంతరం భారత ప్రధాని మోడి చైనాలో పర్యటించి ఇలాంటి అనధికార సమావేశంలో పాల్గొన్నారు. చైనాలోని వుహాన్‌లో జిన్‌పింగ్‌తో మోడీ జరిపిన భేటీ అనంతరం ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు కొంతమేర సడలాయి. అయితే ఆర్టికల్ 370రద్దు, లడఖ్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించిన అనంతరం చోటుచేసుకున్న ద్వైపాక్షిక సంబంధాల నేపథ్యంలో జిన్‌పింగ్ భారత పర్యటన ఇరుదేశాల్లోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఆసక్తి రేకెత్తిస్తోంది. జిన్‌పింగ్ భారత యాత్రకు ముందే పాక్ అధ్యక్షుడు ఇమ్రాన్‌ఖాన్ చైనాలో పర్యటించడం జిన్‌పింగ్‌తో సుదీర్ఘంగా సమావేశాలు జరపడం, కాశ్మీర్ అంశంలో తలదూర్చేలా ఒత్తిడి తేవడం, ఈ అంశాల్ని భారత అంతర్గత వ్యవహారంగా కాకుండా పాక్- భారత్‌ల మధ్య ద్వైపాక్షిక అంశంగా అంతర్జాతీయ వేదికలపై ప్రస్తావించాలంటూ కోరిన నేపథ్యంలో జిన్‌పింగ్ భారత పర్యటన మరింత ప్రాధాన్యత సంతరించుకుంది.

వాస్తవానికి ఈ యాత్ర గురించి చివరి నిమిషం వరకు చైనా గోప్యత పాటించింది. దీంతో భారత్ కూడా చైనా అధ్యక్షుడి పర్యటనకు సంబంధించి చివరినిమిషం వరకు స్పష్టమైన సమాచారాన్ని విడుదల చేయలేక పోయింది. పాక్ అధ్యక్షుడు చైనా పర్యటన నేపథ్యంలో చివరి వరకు జిన్‌పింగ్ భారత పర్యటనపై సందిగ్ధత కొనసాగుతూనే ఉంది. ఈ సమయంలో భారత పర్యటన ఖరారుపై ప్రకటన చేసిన చైనా, అదే సమయంలో పాక్‌తో కలసి విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో భారత్‌ను ఇరుకున పెట్టే ప్రయత్నం చేసింది. కాశ్మీర్ అంశాన్ని తాము సునిశితంగా పరిశీలిస్తున్నామంటూ ఈ ప్రకటన పేర్కొంది. పైగా ఐక్యరాజ్య సమితి నిబంధనావళి, 2వ పేజీలో...




# 15న నీటి లెక్క తేలుద్దాం!




కేటాయింపుల కంటే ఎక్కువ నీటిని ఏపీ వాడేసుకుంది • తెలంగాణ ఇంజనీర్ల ఆరోపణ... ఏపీ అభ్యంతరం • తెలంగాణ 79 టీఎంసీలు, ఏపీ 150 టీఎంసీలు కావాలంటూ ప్రతిపాదనలు.. నేడు బోర్డు ప్రకటన

8

# వివాదమా వాణిజ్యమా?





(మొదటిపేజీ తరువాయి)

ద్వైపాక్షిక ఒప్పందాలు, భద్రతామండలి తీర్మానాలకు అనుగుణంగా కాశ్మీర్ సమస్యను భారత్, పాక్‌లు పరిష్కరించుకోవాలంటూ కూడా ఈ ప్రకటనలో చైనా సూచించింది. కాశ్మీర్ అంశం, దక్షిణాసియాలో ఆందోళనకర వాతావరణం రేకెత్తించే పరిస్థితిని తాము అనుమతించబోమంటూ పరోక్షంగా భారత్‌ను హెచ్చరించింది.

డోక్లామ్ సమస్యనాటి పరిస్థితులతో పోలిస్తే ప్రస్తుతం భారత, చైనాల మధ్య ఏమాత్రం సుహృద్భావ వాతావరణం లేదు. చైనా భారత్‌పై మరింతగా పగ పెంచుకుంటోంది. దక్షిణాసియాలో తన ఏకఛత్రాదిపత్యానికి ప్రధాన శత్రువుగా భారత్‌ను పరిగణిస్తోంది. మరోవైపు పాకిస్థాన్‌ను చైనా చేరదీస్తోంది. పాక్ ఆర్థిక దురావస్థను తనకనుకూలంగా మార్చుకుంటోంది. ఆ దేశంలోని భూ భాగాన్ని అనధికారికంగా ఆక్రమించుకుంటోంది. అక్కడ తన సైనిక స్థావరాల్ని ఏర్పాటు చేసుకుంటోంది. పాకిస్థాన్ భూభాగం నుంచి భారత్ తలపై తుపాకుల్ని గురిపెట్టించుతోంది. అంచెలంచెలుగా పాక్‌ను తన అధీనంలోకి తీసుకునేందుకు వ్యూహాలు అమలు చేస్తోంది. అప్పులిచ్చి ఆ దేశాన్ని తమ కంబంధ హస్తాల్లోకి లాక్కుంటోంది. ఇదంతా పాక్‌పై ప్రేమతో కాదు.. భారత్‌పై అక్కసుతోనే చైనా చేస్తోందన్న విషయం అంతర్జాతీయ సమాజం ఎప్పుడో గుర్తించింది. 370వ అధికరణం రద్దు అనంతరం గడప గడపకు తిరిగి తమకు మద్దతు కోసం ప్రయత్నించిన ఇమ్రాన్‌ఖాన్‌కు ఒక్క చైనా మాత్రమే అభయహస్తమిచ్చింది. ఐక్యరాజ్య సమితి భద్రతామండలి సర్వసభ్య సమావేశంలో చైనా మాత్రమే ఈ అంశంపై పాక్‌కు అనుకూలంగా వ్యాఖ్యలు చేసింది. అలాగే కాశ్మీర్ సమస్యను సజీవంగా ఉంచేందుకు నానా పాట్లు పడుతోంది. తాజాగా కాశ్మీర్ ప్రజలపై భారత సైనికులు దమనకాండకు పాల్పడుతున్నారని, అక్కడ మనవహక్కులు మంటగలిసిపోయాయని చైనా కొత్త వాదనను తెరపైకి తెచ్చింది. ఆ ప్రాంతంలో రిఫరెండెం నిర్వహించాలని కూడా ప్రతిపాదించింది.




చెన్నై:జిన్‌పింగ్‌కు స్వాగతం పలుకుతూ ఆయన పేరును సూచించేలా విద్యార్థుల వరుస క్రమం

ఓ వైపు చైనా ప్రభుత్వం తమ దేశంలో మానవహక్కుల కోసం ఉద్యమిస్తున్న వారిపై ఉక్కుపాదం మోపింది. ఉద్యమాన్ని క్రూరాతిక్రూరంగా అణిచేస్తోంది. హాంకాంగ్‌లో ప్రజాస్వామ్య ప్రదర్శనకారుల్ని నిర్దాక్షిణ్యంగా నలిపేస్తోంది. టిబెట్‌లో మానవహక్కుల్ని ఘోరంగా ఉల్లంఘిస్తోంది. దక్షిణచైనా ప్రాంతంలోని మైనారిటీలను బానిసలుగా చూస్తోంది. తమ దేశ అంతర్గత వ్యవహారాల్లోకి ఇతరుల జోక్యాన్ని ఏమాత్రం అనుమతించని చైనా తాను మాత్రం భారత అంతర్గత వ్యవహారంలో తరచూ వేలెట్టేందుకు ప్రయత్నిస్తోంది. అది కూడా పాక్‌కు మద్దతుగా భారత్‌పై ఒత్తిడి తెచ్చేయత్నం చేస్తోంది.

ఏడాది క్రితం నాటి పరిస్థితులతో పోలిస్తే ఇప్పుడు చైనా కూడా ఆర్థిక మందగమనాన్ని ఎదుర్కొంటోంది. ముఖ్యంగా అమెరికాతో చైనా వాణిజ్య బంధం బెడిసికొట్టింది. ఏటా వంద బిలియన్ డాలర్లకు పైగా వాణిజ్య లోటు ఏర్పడింది. చైనాతో బంధం వీగిపోవడంతో అమెరికా ఇప్పుడు భారత్‌ను తన విశ్వసనీయ వ్యాపార భాగస్వామిగా పరిగణించేందుకు సిద్దపడుతోంది. భారత్ - అమెరికాల మధ్య వాణిజ్య బంధాన్ని పటిష్టపర్చుకునేందుకు ట్రంప్ ప్రభుత్వం ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఇటీవల మోడి అమెరికా పర్యటన సందర్భంగా భారత్ పట్ల మారిన చైనా వైఖరి స్పష్టమైంది. ఈ దశలో జిన్‌పింగ్‌కు భారత్ అధిక ప్రాధాన్యత నివ్వడం తిరిగి అమెరికా- భారత్ ద్వైపాక్షిక సంబంధాలపై ప్రభావం చూపే అవకాశముంటుందని నిపుణులు భావిస్తున్నారు. గతంలో ఇండో చీని భాయిభాయి అన్న పరిస్థితులు ఉన్నప్పటికీ ప్రస్తుతం రెండు దేశాలు ఆర్థికంగా అత్యంత వేగంగా ముందు కెళ్తున్న దశలో భారత్‌ను చైనా ఎప్పుడూ ప్రత్యర్థిగానే తప్ప విశ్వసనీయ మిత్రుడిగా పరిగణించే అవకాశాలైతే ఉండవని విశ్లేషిస్తున్నారు.

### సరిహద్దు చర్చలు

భారత్ అక్సాయిచిన్ అంశాన్ని తిరిగి లేవనెత్తుతుందన్న ఆందోళన కూడా చైనాలో లేకపోలేదు. సరిహద్దుల్లో శాంతి, ప్రశాంతత, పరిరక్షణకు సంయుక్త ప్రయత్నం అవసరమంటూ బీజింగ్ విడుదల చేసిన ప్రకటన దీన్ని సూచిస్తోంది. ఆసియాలో బలమైన రెండు శక్తులు సరిహద్దు వివాదాన్ని ద్వైపాక్షిక చర్చల ద్వారా శాంతియుతంగా పరిష్కరించుకోవాల్సిన అవసరాన్ని చైనా రాయబారి సన్‌విడాన్ మీడియా ముందు వినిపించారు. పైగా భారత్ - చైనా సరిహద్దు సమస్య అత్యంత సున్నితం, సంక్లిష్టమైందిగా ఆయన పేర్కొన్నారు. మోడి, జిన్‌పింగ్‌ల అనధికార శిఖరాగ్ర సమావేశంలో సరిహద్దు సమస్యపై కూడా చర్చలు సాగే అవకాశాలు స్పష్టమౌతున్నాయి. ఈ సమావేశానికి ముందే కార్యదర్శుల స్థాయిలో దీనిపై చర్చలు సాగిస్తారని సమాచారం. భారత్, చైనాల మధ్య 3488 కిలోమీటర్ల సరిహద్దు ఉంది. దీని వెంబడి ఉన్న అరుణాచల్‌ప్రదేశ్‌ను చైనా ఇప్పటికీ తన భూభాగంగానే పేర్కొంటోంది. ఆ దేశ రేఖాచిత్రాల్లో అరుణాచల్ ప్రదేశ్‌ను కూడా కలిపి ప్రచురిస్తోంది. డోక్లామ్ సరిహద్దు వివాదానికి సంబంధించి 73రోజుల సుదీర్ఘ చర్చలు కొనసాగాయి. శాంతియుతంగానే దీనికి తాత్కాలిక పరిష్కారం లభించింది. అదే రీతిలో అరుణాచల్‌ప్రదేశ్, అక్సాయిచిన్ ప్రాంతాలకు సంబంధించిన పరిష్కారంపై కూడా ఇరుదేశాలు దృష్టిపెట్టాల్సిన అవసరముంది. ఏ విధంగా చూసినా ప్రస్తుతం భారత్‌దే పైచేయిగా ఉంది. అమెరికాతో వాణిజ్య పోరు మొదలయ్యాక భారతే చైనాకు అతిపెద్ద కొనుగోలుదారుగా అవతరించింది. ఈ అవకాశాన్ని భారత ప్రభుత్వం తమకనుకూలంగా మలచుకోవాలని పరిశీలకులు సూచిస్తున్నారు.

## క్షీణించిన డ్రాగన్ పరపతి

21వ శతాబ్దంలో ప్రపంచంలో తమ భాగస్వామ్యం మరింత విస్తృతం కావాలన్న లక్ష్యానికి అనుగుణంగా భారత్ తన వ్యూహాల్ని అమలు చేస్తోంది. వీటికి అమెరికాతో పాటు రష్యా నుంచి సహకారం అందుతోంది. ఇప్పటికే చైనాను అమెరికా నెమ్మదిగా దూరం పెడుతోంది. చైనాపై ఆధారపడ్డాన్ని మరింతగా తగ్గించుకునే ప్రయత్నాలకు రష్యా శ్రీకారం చుట్టింది. అమెరికా, భారత్, రష్యాల మధ్య వాణిజ్య సహకారం రోజు రోజుకు దృఢమౌతోంది. ఫార్ ఈస్ట్ విధానాన్ని ప్రారంభించిన రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆదిలో చైనాపై అధికంగా ఆధారపడ్డారు. రాన్రాను తమ లోపాల్ని గుర్తించిన పుతిన్ సవరించుకునే ప్రయత్నం మొదలెట్టారు. అంతర్జాతీయ ఆర్థిక కేంద్రాలుగా చైనా, భారత్‌లు రూపుదిద్దుకుంటున్నాయి. ఇవే బలమైన మార్కెట్లు, ఉత్పాదక వ్యవస్థలుగా ఆవిర్భవిస్తున్నాయి. చైనాకు ప్రత్యామ్నాయంగా భారత్‌తో మైత్రిబంధాన్ని పెంచుకోవడం ఇరుదేశాలకు మేలైనదన్న నిర్ణయానికి రష్యా వచ్చింది. దక్షిణాసియాలో భారత్ బలపడితే చైనా దీర్ఘకాలిక వ్యూహాలకు, ప్రయోజనాలకు ఖచ్చితంగా సవాలే. ఇప్పటికే మాస్కో, బీజింగ్‌ల మధ్య బంధం బలహీనపడుతోంది. ఈ పరిస్థితుల్లో చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్ భారత పర్యటనపై అమెరికా, రష్యాలు కూడా ఆసక్తిగా గమనిస్తున్నాయి. మరోవైపు చైనాకు టిబెట్, తైవాన్‌లు ఎడతెగని సమస్యలుగా పరిణమించాయి. ఈ సమస్యల్ని ఆ దేశం సమర్థవంతంగా పరిష్కరించుకోలేక పోతోంది. దీన్ని చైనా దుర్బలత్వంగా ఇప్పటికే అంతర్జాతీయ సమాజం పరిగణిస్తోంది. ఇలాంటి సమయంలో ఆర్టికల్ 370 రద్దుకు సంబంధించి భారత్ ద్వైపాక్షిక ఒప్పందాల్ని ఉల్లంఘించిందంటూ పాకిస్థాన్ ఐక్యరాజ్య సమితిలో చేసిన వాదనకు మద్దతివ్వడం ద్వారా చైనా మరింతగా తన పరపతిని పోగొట్టుకుంది. అలాగే భద్రతామండలిలో ఈ అంశాన్ని చర్చించాలన్న పాక్‌కు మద్దతిచ్చిన ఏకైక దేశంగా చైనా నిల్చింది. ఎలాంటి అధికారిక ప్రకటన లేకుండా భద్రతామండలి సర్వసభ్య సమావేశం ముగిసిపోవడంతో చైనాకిస్తున్న విలువ స్పష్టమైపోయింది.

## భారత్‌లో పర్యటించిన చైనా ప్రముఖులు

- 1958 భారత గణతంత్ర దినోత్సవ ముఖ్యఅతిథిగా చైనా కమ్యూనిస్ట్ విప్లవ నాయకుడు, రాజకీయవేత్త, పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ వ్యవస్థాపకుల్లో ఒకరైన మార్షన్ యె జియాంగ్‌ఇంగ్ హాజరయ్యారు.
- 2010 డిసెంబర్ 15న చైనా ప్రీమియర్ వెన్ జియాబావో భారత్‌ను సందర్శించారు. ఇరు ప్రభుత్వాల మధ్య పలు ఆర్థిక అంశాలపై చర్చించారు.
- 2012 మార్చి 29న చైనా అధ్యక్షుడు హుజింటావో భారత్‌లో జరిగిన బ్రిక్స్ సమావేశానికి హాజరయ్యారు.
- 2013 మే 19 నుంచి 22 వరకు చైనా ప్రీమియర్ లీ కెక్వియాంగ్ భారత్‌లో పర్యటించారు.
- 2014 సెప్టెంబర్ 17 నుంచి 19 వరకు చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్ భారత్‌లో పర్యటన జరిపారు.
- 2015 నవంబర్ 3 నుంచి 7 వరకు చైనా ఉపాధ్యక్షుడు లీ యువాన్‌చావో భారత్‌లో అధికార పర్యటన నిర్వహించారు.
- 2016 అక్టోబర్ 15 నుంచి 16 వరకు అధ్యక్షుడు షి జిన్‌పింగ్ 8వ బ్రిక్స్ సమావేశంలో పాల్గొనేందుకు భారత్‌కొచ్చారు.

## 80 బిలియన్ డాలర్ల వాణిజ్యం

చైనా- భారత్‌ల మధ్య వాణిజ్యం సుమారు 80బిలియన్ డాలర్లకు చేరుకుంది. అయితే భారత్ నుంచి ఎగుమతులతో పోలిస్తే చైనా నుంచి దిగుమతులు దాదాపు మూడు రెట్లు అధికంగా ఉంటున్నాయి. చైనా, హాంకాంగ్‌ల నుంచి మొబైల్ ఫోన్‌ల విడిభాగాల దిగుమతులు ఏటేటా పెరుగుతున్నాయి. భారత్‌కు చెందిన ఐటీ, ఫార్మా ఉత్పత్తుల్ని చైనాలో అనుమతించాలంటూ దీర్ఘకాలంగా ప్రభుత్వం డిమాండ్ చేస్తున్నా చైనా స్పందించడం లేదు. ఇరుదేశాల మధ్య వాణిజ్య లోటు అనూహ్యంగా పెరుగుతోంది. భారత వాణిజ్య మంత్రిత్వశాఖ గణాంకాల మేరకు 2017 ఆర్థిక సంవత్సరంలో ద్వైపాక్షిక వాణిజ్యం 84.44బిలియన్ డాలర్లకు చేరింది. ఇందులో భారత వాణిజ్య లోటు 52బి.డాలర్లుగా ఉంది. 2018 ఆర్థిక సంవత్సరంలో చైనాకు ఎగుమతులు 31శాతం పెరిగా యి. 13.33బి.డాలర్లకు చేరుకున్నాయి. దిగుమతుల్లో కూడా 24.64శాతం వృద్ధి నమోదైంది. 76.38బిలియన్ డాలర్లకు దిగుమతులు పెరిగాయి. దీంతో గతేడాది కూడా వాణిజ్య లోటు 63బి.డాలర్లుగా నమోదైంది. దీంతో చైనాకు భారత్ అతిపెద్ద మార్కెట్ అన్న విషయం తేటతెల్లమైంది. దీన్ని మెరుగుపర్చేందుకు గత రెండేళ్లుగా చైనా పలు రకాల ప్రయత్నాలు చేస్తోంది. చైనా నుంచి కాకుండా హంకాంగ్ లోని తన సంస్థల ద్వారా భారత్‌కు ఎగుమతులు నిర్వహి స్తోంది. భారత్ ఉత్పత్తులకు చైనా తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదు. ప్రపంచంలోనే మెరుగైన ఔషధాల్ని భారత్ తయారు చేస్తోంది. ఐటీ రంగంలోనూ అగ్రగామిగా ఉంది. భారత ఎగుమతుల విలువలో ఐటీ ఉత్పత్తులు 21శాతానికి చేరుకున్నాయి. ప్రపంచం మొత్తం భారతీయ ఐటీ మేధావుల్ని, ఉత్పత్తుల్ని తలకెత్తుకుంటోంది. కానీ చైనా మాత్రం అనుమతించడం లేదు. వాణిజ్య లోటు తగ్గింపునకు ఐటీ, ఔషధ ఉత్పత్తుల్ని చైనాలోకి అనుమతించే విధంగా ఒత్తిడి తేవాల్సిన అవసరముంది.

# వీగర్లపై డ్రాగన్

## ముస్లిం మైనారిటీల్లోని ప్రత్యేక జాతిని అంతం చేస్తున్న చైనా

- కాశ్మీర్‌పై సన్నాయినొక్కులు.. స్వదేశంలో మానవహక్కులు అణచివేత
- షింజియాంగ్ ప్రత్యేక శిబిరాలలో మతవిశ్వాసాల మార్పిడి ప్రయత్నం
- వేర్పాటువాదం నెపంతో దమనకాండ

కాశ్మీర్‌లో పరిస్థితులను గమనిస్తూనే ఉన్నాం.. మౌలిక అంశాలలో సర్వకాల మిత్రుడు పాకిస్తాన్‌కే మా మద్దతు ఉంటుందని సెలవిచ్చిన చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, ఆ రాష్ట్రంలో తీవ్రస్థాయిలో మానవహక్కుల హననం జరుగుతోందంటూ గగ్గోలు పెడుతున్న పాకిస్తాన్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్, చైనాలో వీగర్ ముస్లిం మైనారిటీల అణచివేతపై నోరువిప్పడం లేదు. తీవ్ర అణచివేత, మానవ హననాన్నిఎదుర్కొంటున్న ప్రత్యేక వీగర్ జాతి ముస్లింలు బాధలు ఎంత భయంకరంగా ఉన్నాయో ఇప్పుడిప్పుడే ప్రపంచం దృష్టికి వస్తున్నాయి.

అత్యాధునిక సాంకేతికత సాయంతో, ఏకంగా ఆ జాతికి చెందినవారి డీఎన్ఏలనే సేకరించి మానసిక, శారీరక చిత్రహింసలకు గురి చేస్తోంది. మతవిశ్వాసాల మార్పిడికి చైనా తీవ్ర ప్రయత్నం చేస్తోంది. ఇప్పుడు ప్రపంచానికి నీతులు చెబుతోంది. షింజియాంగ్‌లో దారుణపరిస్థితుల గురించి తెలిసినా పాకిస్తాన్ మౌనం వహిస్తోంది. వేర్పాటువాదం అణచివేత పేరుతో చైనా ఎన్ని దారుణాలకు పాల్పడుతున్నదో తెలిస్తే ప్రపంచం నివ్వెరపోక తప్పదు. అసలు, అక్కడ వీగర్ ముస్లిం మైనారిటీల పరిస్థితి ఏమిటి, చైనా ఎందుకు వారిపట్ల కర్కశంగా వ్యవహరిస్తోందన్నది తెలుసుకుంటే డ్రాగన్ అసలు రూపం వికృతంగా కనిపిస్తుంది. దానికి తానతందాన అంటున్న పాకిస్తాన్ కపట నాటకం వెలుగుచూస్తుంది.



### వీగర్లు ఎవరు?

చైనాలోని షింజియాంగ్ ప్రాంతంలో ఉన్న ముస్లిం మైనారిటీలను వీగర్లంటారు. ప్రత్యేక జాతిగా భావించే వీరి సంస్కృతి, సంప్రదాయాలు విభిన్నంగా ఉంటాయి. టర్కిష్‌కు దగ్గరి పోలికలతో వీరి భాష ఉంటుంది. మధ్య, తూర్పు ఆసియా దేశాలతో అనుబంధం ఉన్నట్లు ఆధారాలున్నాయి. వీగర్లలో ముస్లింలు మెజార్టీగా ఉన్నారు. మరికొన్ని వర్గాలూ ఈ జాతిలో మిళితమై ఉన్నాయి. వీరు ముస్లింలే అయినా మిగతా దేశాల ముస్లింలకు భిన్నంగా ఉంటారు. వీరికంటూ ఎన్నో ప్రత్యేకతలున్నాయి. చైనీయులకు భిన్నంగా వీరి రూపు రేఖలు, మత సంప్రదాయాలు, సంస్కృతి ఉంటాయి.

### షింజియాంగ్... అసలు సమస్య

చైనాలో పశ్చిమంగా ఉన్న అతి విశాలమైన ప్రావిన్స్ భారత్, అఫ్గానిస్తాన్, కజకిస్తాన్, మంగోలియా సహా అనేక దేశాలు సరిహద్దులు టిబెట్ మాదిరిగా దీనికీ స్వతంత్ర ప్రతిపత్తి, స్వయంపాలన అవకాశం ఇచ్చారు. కానీ అది నామమాత్రం... వ్యవసాయం, చిన్నపాటి వ్యాపారాలు ప్రధాన వృత్తి. దాదాపు 2.6 కోట్ల జనాభాలో అత్యధికులు వీగర్ మైనారిటీ ముస్లింలు. 1949 వరకు ఈ ప్రాంతం వీగర్ల ఆధిపత్యంలోనే ఉంది. ఆ తరువాత చైనా పూర్తిగా తన ఆధీనంలోకి తీసుకుంది. ప్రస్తుతం అక్కడ ఐరాస లెక్కల ప్రకారం కనీసం 1.11 కోట్ల మంది వీగర్లున్నారు

తమ సంస్కృతిని, సంప్రదాయాలను, జాతిని తుడిచిపెట్టేస్తున్నారనేది వీగర్ల ఆందోళన. చైనీయుల్లోని హన్ తెగకు చెందినవారిని ఇక్కడికి తరలించి తమ ఆధిపత్యాన్ని తగ్గిస్తున్నారనే ఆరోపణ ఉంది. వేలాది మందిని సామూహిక వలసల పేరుతో తీసుకొచ్చి దించుతున్నారనే ఆగ్రహం వారిలో ఉంది. దీంతో హన్-వీగర్ వర్గాల మధ్య తరచూ ఘర్షణలు, మారణ కాండ జరుగుతూ ఉంటుంది. ఐరాస మానవ హక్కుల కమిటీ అక్కడి పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేసింది. 2018 ఆగస్టు నాటికి 10 లక్షలమంది చైనా నిర్బంధంలో ఉండగా.. వందల కుటుంబాలు గల్లంతయ్యాయి.

### దారుణ దమనకాండ

వీగర్ల అణచివేతకు చైనా అత్యంత దారుణమైన, అమానవీయమైన పద్ధతులు అవలంబిస్తోంది. షింజింయాంగ్ సహా దేశంలో వీగర్ మైనారిటీ వర్గాలకు చెందిన ప్రతి ఒక్కరి డేటా సేకరించింది. డీఎన్ఏలు, బయోమెట్రిక్ ఆధారాలు సేకరించింది. వారున్న ప్రతీ ఇంటికీ క్యూఆర్ కోడ్ ఇచ్చింది. టర్కీ, కజికిస్తాన్, అఫ్గానిస్తాన్ సహా 26 ముస్లిం దేశాలపై నిఘావేసింది. ఆ దేశాలవారితో ఇక్కడి వీగర్లు వాట్సాప్ చేసినా చైనాకు తెలిసిపోయేలా సాంకేతికతను వాడుతోంది. ఎప్పుడు కావాలంటే అప్పుడు వారిళ్లను తనిఖీలు చేస్తోంది. ఫేసియల్ రికగ్నిషన్ సాంకేతికత ద్వారా వారి కదలికలను గమనిస్తోంది. ప్రత్యేక రహస్య శిబిరాలు నిర్వహిస్తూ వీగర్లను అక్కడకు తరిలిస్తోంది. మాండరిన్ చైనీ భాష బలవంతంగా రుద్దుతూ.. చైనా అధ్యక్షుడిపై విశ్వాసం ఉంచాలని నేర్పుతోంది. మతవిశ్వాసాలను, సంస్కృతిని మార్చుకోవాలని శిక్షణ ఇస్తూ.. విననివారు గల్లంతవుతున్నారు. వందలాది కుటుంబాల ఆచూకీయే లేదు. సంఖ్యా పరంగా వీరి ఆధిక్యాన్ని అరికట్టేందుకు వ్యూహాత్మకంగా వెడుతోంది. చైనాలోని హన్ తెగలవారిని ఇక్కడికి తరలిస్తోంది.



### చైనా ఎందుకిలా చేస్తోంది?

షింజియాంగ్‌ను విడగొట్టి స్వాంతంత్ర్యం కోసం వీగర్లు ప్రయత్నిస్తున్నారన్నది అనుమానం. వీగర్లవల్ల తీవ్రవాదం, ఉగ్రవాదం, వేర్పాటువాదం సమస్య తలెత్తిందని ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఇస్లామిస్ట్ ఉగ్రవాద సంస్థలతో వీగర్ వేర్పాటువాద వర్గాలు కలసి పనిచేస్తున్నాయని ఆగ్రహంగా ఉంది. 2009లో రాజధాని ఉరుంఖిలో ఉగ్రవాదుల దాడిలో 200 మంది చనిపోగా.. అత్యధికులు హన్ తెగకు చెందిన చైనీయులు ఉన్నారు. 2013లో ప్రఖ్యాత తియానన్మెన్ స్క్వేర్‌లో సందర్శకులపైకి కారుదాడి జరిగింది. 2014 జులైలో పోలీస్‌స్టేషన్‌పై దాడి జరిగింది. 96మంది చనిపోయారు. 2017 ఫిబ్రవరిలో కత్తితో ఉగ్రవాదుల దాడి చేయగా ఐదుగురి మృతి చెందారు. అప్పటి నుంచి అణచివేత ఉధృతం చేసిన చైనా.. దమనకాండ కేవలం దుష్ప్రచారమేనని వాదన వినిపిస్తోంది. ప్రత్యేక శిబిరాల్లోకి తరలిస్తున్నది వారి సంక్షేమం కోసమేనని చైనా చెబుతోంది.

### ప్రపంచం ఏమంటోంది?

పాకిస్తాన్‌ను ఉగ్రవాదుల స్వర్గధామంగా ప్రపంచం ప్రకటిస్తున్నా చైనా వెనకేసుకొస్తోంది. కానీ స్వల్పస్థాయిలో తీవ్రవాద సమస్య ఉన్న వీగర్లపై కక్షతో జాతినే అంతం చేస్తోంది. దీనిపై ఇప్పుడిప్పులే ప్రపంచ దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఐరాస మానవహక్కుల కమిటీ నిర్మొహమాటంగా వీగర్ల అణచివేతను తప్పుబడుతోంది. షింజియాంగ్‌లో ఐరాస మానవహక్కుల బృందం పర్యటనకు అవకాశం ఇవ్వాలని ఈమధ్యే కోరింది. యూఎన్ మానవహక్కుల కమిటీ చీఫ్ మిషెల్లి బేక్‌లెట్ డిమాండ్‌తో చైనా ముఖం జేవురించింది. అణచివేతకు సహకరిస్తున్న వ్యక్తులు, సంస్థలపై ఆంక్షలు విధించాలని యుఎస్ సేనేటర్ల బృందం కోరింది. 2018 మేలో ఇంగ్లండ్ ప్రధాని థెరిసా మే చైనా సందర్శించారు. వీగర్ల అణచివేతపై దేశాధ్యక్షుడి సమక్షంలోనే ఆందోళన వ్యక్తం చేశారు. రెండేళ్ల క్రితం షింజియాంగ్‌లో బీబీసీ బృందం పర్యటన అక్కడి దారుణాలను కళ్లకు కట్టేలా కథనాలు ప్రసారం చేసింది. ఈయో జోక్యం కోరుతూ అనేక దేశాల్లోని వీగర్ల ఆందోళనఈ ఏడాది ఫిబ్రవరిలో స్పందించిన టర్కీ, వీగర్ మార్పిడి కేంద్రాలను మూసివేయాలని హెచ్చరించగా..శిబిరాలనుంచి వారిని సమాజంలోకి పంపేశామని చైనా చెప్పింది.

## పర్యాటకానికి ప్రచారం

**చెన్నై:** జిన్‌పింగ్ లాంటి అగ్రనేతకు ఆతిథ్యమిచ్చేందుకు మహాబలిపురాన్ని ఎంచు కోవడం వెనుక మోడీకి ప్రత్యేకమైన సంకల్పం ఉంది. భారతీయ పర్యాటక రంగానికి ప్రపంచస్థాయి ప్రచారం తీసుకురావాలన్నదే ఆయన ప్రధాని ఉద్దేశం. ఈ మేరకే మహాబలిపురం వేదిక భారతీయ సాంస్కృతిక, వారసత్వ సంప్రదాయాలను ప్రపంచానికి చాటాలని మోడీ నిశ్చయించారు. భారత్‌లోని పర్యాటక ప్రాంతాలకు విదేశీనేతల పర్యటనలను ఉపయోగించు కోవడమే ఆయన లక్ష్యంగా ఉంది. భారత పర్యాటకరంగ ప్రచార నినాదం ఇంక్రిడబుల్ ఇండియాను ఆయన స్వయంగా భుజానెత్తుకున్నారు. గతంలో విదేశాల అధినేతలకు ఢిల్లీలో ఆతిథ్యమివ్వడం సంప్రదాయంగా ఉండేది. అయితే ఈ విధానాన్ని మోడీ పక్కనపెట్టారు. ఢిల్లీకి వెలుపల ఇతర దేశాధినేతలకు ఆతిథ్యమిస్తున్నారు. రాష్ట్రాల వారీగా అక్కడ ఉన్న భారతీయ సాంస్కృతిక వారసత్వ సంపద అందాలను ప్రపంచానికి తెలియజేయడానికి ప్రయత్నిస్తున్నారని స్పష్టమవుతోంది. ఐదేళ్ల పాలనలో దౌత్యపరమైన పురోభివృద్ధిని సాధించిన మోడీ పలు దేశాల అగ్రనేతలను భారత్‌లో పర్యటనకు ఆహ్వానించారు.

# ఆర్టీసీ సమ్మె సరే స్పష్టత ఏదీ?

(మొదటిపేజీ తరువాయి)

పోటీ ఏర్పాటు చేస్తామన్నారు. ఆర్‌టీసీ కార్మికులు ఇందుకు అంగీకరించడం లేదు. తొలుత జీతభత్యాల కోసం సమ్మె ప్రారంభించినా ఇప్పుడు వారి ప్రధాన డిమాండ్ మారింది. జీతభత్యాల కంటే సంస్థను పరిరక్షించుకోవడమే ముఖ్యంగా తయారైంది. ప్రైవేటీకరణను తామెట్టి పరిస్థితుల్లో అంగీకరించేదిలేదంటూ ఆర్‌టీసీ కార్మిక సంఘాలు గంటాపథంగా చెబుతున్నాయి. అయితే కేసీఆర్ ఆలోచన ఇందుకు భిన్నంగా కనిపిస్తోంది. ఆర్‌టీసీని ఒక లాభదాయక సంస్థగా రూపుమార్చాలని ఆయన తపిస్తున్నారు. ప్రస్తుతం ఆర్‌టీసీ ఏటేటా నష్టాల్లో కూరుకుపోతోంది. ఏ ఏడాది కూడా అది లాభనష్టాల రహితంగా రూపుదిద్దుకోవడంలేదు. కానీ లాభాలబాటపట్టే అన్ని అవకాశాలు ఆర్‌టీసీకి ఉన్నాయి. సింగరేణికాలరీస్ తరహాలో ఈ సంస్థను కూడా లాభాల్లో పరుగులు తీయించి ఏటేటా కార్మికులకు బోనస్ అందించాలన్న ఆకాంక్షను సీఎం కేసీఆర్ వెలిబుచ్చారు. వాస్తవానికి కేసీఆర్ సీఎం అయ్యాక అందుబాటులో ఉన్న అన్ని వనరుల్ని సమీకరిస్తున్నారు. నిధులు పెంచి రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా రూపుదిద్దాలన్న ఆకాంక్షను నెరవేర్చుకుంటున్నారు. ఇప్పటికే ఇసుకపై ఏటా రూ. 9 వేల కోట్ల వరకు ఆదాయాన్ని రాబడుతున్నారు. అలాంటిది ఆర్‌టీసీని పూర్తిగా ప్రైవేటుపరం చేసి స్టేజ్ కారియర్‌లకు అనుమతిస్తే ఏటా కనీసం రూ. 10 వేల కోట్లు ఖజానాకు జమౌతుంది. అయితే కేసీఆర్ ఆలోచన మాత్రం ఇందుకు భిన్నంగా ఉంది. ఆరోగ్యకరమైన పోటీపెట్టడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించడంతో పాటు ఆర్‌టీసీని మరింత పటిష్టపర్చి సంస్థకు లాభాలు తేవాలన్న దృక్పథం ఆయనలో వ్యక్తమౌతోంది.

పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో ఆర్‌టీసీని ప్రభుత్వంలో విలీనం చేసినంతమాత్రానా తెలంగాణలో కూడా చేయాలనేంలేదు. ఆ మాటకొస్తే ప్రభుత్వంలో విలీనం వల్ల ఆర్‌టీసీ కార్మికులంతా ప్రభుత్వోద్యోగులౌతారు. దీంతో వారంతా కార్మికులుగా పొందే పలు హక్కులు కోల్పోతారు. ఉద్యమించగలిగే యూనియన్లు ఉండవు. సమ్మెలు, బంద్‌లు నిర్వహించే అధికారం కోల్పోతారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా అంచెల వారీ ప్రైవేటీకరణకు ప్రభుత్వం యోచిస్తోంది. ఇప్పుడు ఉద్యోగులుగా మారిన ఆర్‌టీసీ కార్మికుల్లో సగానిపైగా రానున్న ఐదేళ్ళలో పదవీ విరమణ చేస్తారు. ఆ మేరకు కొత్తగా ప్రైవేటు వ్యక్తులు, బస్సుల్ని సంస్థలో ప్రవేశపెట్టడం ద్వారా అంచెలంచెలుగా అంతర్గత పోటీ పెంచాలన్న ఆలోచన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలోనూ వ్యక్తమౌతోంది.





ప్రగతి భవన్‌లో కలెక్టర్ల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్




# పల్లెవించిన ప్రగతి

(మొదటిపేజీ తరువాయి)

పనులు జరగాలని ఆయన కోరారు.

సీఎం కేసీఆర్ ప్రసంగంలో మరికొన్ని కీలకాంశాలు

✓30 రోజుల పల్లె ప్రగతి కార్యాచరణలో భాగంగా నిర్దేశించిన పనులు చాలా వరకు జరిగాయి.

✓ శ్మశాన వాటికలు, డంప్ యార్డుల, నర్సరీల ఏర్పాటుకు చాలా గ్రామాల్లో స్థలాల గుర్తింపు పూర్తి. మిగతాచోట్ల కూడా త్వరలో పూర్తి.

✓ఏ శాఖ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూమి లభ్యమైతే సామాజిక అవసరాలకు వాడుకొవచ్చు

✓వార్షిక, పంచవర్ష ప్రణాళికలు, గ్రీన్‌ప్లాన్ రెడీ. అందుకు అనుగుణంగా పనులు జరగాలి.

✓మొక్కలకు నీళ్ళు పోయడానికి, చెత్త సేకరణకు పంచాయతీలు ట్రాక్టర్లు కొనుగోలు చేయాలి. ప్రతి ట్రాక్టర్‌కు ట్యాంకర్, ట్రాలీ, ఫ్రంట్ బ్లేడ్ ఉండాలి.

✓ఈ పనులను పర్యవేక్షించే అధికారులకు క్రమం తప్పకుండా అలవెన్స్‌లు చెల్లించాలి.

✓ప్రతి గ్రామంలో విధిగా నర్సరీలు. వాటి చుట్టూ కంచె తప్పనిసరి

**ప్రగతి ఫలాలు ఇవీ**

✓రాష్ట్రంలోని 12,748 గ్రామాల్లో అక్కడున్న సమస్యల గుర్తింపు. అధికారులు పాదయాత్రలు నిర్వహించి గ్రామ వార్షిక ప్రణాళికలు సిద్ధం చేశారు.మరో మూడు గ్రామాల్లో ప్రణాళికలను రూపొందించాల్సి ఉంది.

✓గ్రామసభల ద్వారా స్టాండింగ్ కమిటీలను ఏర్పాటు. ఈ కమిటీల్లో మొత్తం 8,20,727 మంది సభ్యులుగా ఎంపిక. వీరిలో 4,03,758 మహిళలు. ✓ఇళ్ళు, ఖాళీ స్థలాల్లో శిథిలాల తొలగింపు,పారిశుద్ధ్య పనుల నిర్వ హణకు 1,24,837 ప్రదేశాల గుర్తింపు. 1,09,784చోట్ల పనులు పూర్తి.

✓పిచ్చిమొక్కలు, సర్కారు తుమ్మ తొలగించేందుకు2,77,657ప్రదేశాల గుర్తింపు. వీటిలో 2,67,535చోట్ల పనులను పూర్తి

✓పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టేందుకు 1,07,288ఖాళీ ప్లాట్లు, కమ్యూనిటీ స్థలాల గుర్తింపు... 99,770 చోట్ల పూర్తి

✓నిరుపయోగంగా ఉన్న 22,167 బావుల్లో 16,380 పూడ్చివేత. అలాగే నిరుపయోగంగా ఉన్న 11,065 బోరుబావుల్లో 9,888 పూడ్చివేత

✓గ్రామాల్లో 68,862 పల్లపు ప్రాంతాలలో 64,540చోట్ల చదును

✓62,723 చోట్ల రోడ్లు, గుంతల్లో నీరు నిల్వ. వీటిలో58,856 చోట్ల మరమ్మతులు

✓రాష్ట్రవ్యాప్తంగా 1,30,775 ప్రదేశాలు అపరిశుభ్రం. వీటిలో 1,25,791 చోట్ల బ్లీచింగ్ పౌడర్,సున్నంచల్లి పరిశుభ్రత

✓82,804 ప్రభుత్వ కార్యాలయాలు, మార్కెట్లు, పాఠశాలలు, ఆసుపత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలలో అపరిశుభ్రత వీటిలో 80,420 సంస్థలలో, 29,25,390 మందితో శ్రమదానం, పరిశుభ్రత.

✓ఇప్పటి వరకు 10,870 గ్రామ పంచాయతీల్లో వైకుంఠ ధామాలు ఏర్పాటు. మరో 1,881 గ్రామ పంచాయతీల్లో వీటిని ఏర్పాటు చేయాల్సి ఉంది.

✓డంప్ యార్డుల ఏర్పాటుకు 11,211 పంచాయతీల్లో స్థలాల గుర్తింపు. మరో 1540గ్రామాల్లో స్థలాలకోసం అన్వేషణ

✓మొత్తం 12,751 గ్రామపంచాయతీల్లో 12,750 గ్రామాలుహరితహారంప్రణాళికలను సిద్ధం చేశాయి. వీటిలో 12,292 పంచాయతీల్లో నర్సరీల ఏర్పాటు ✓ఈ 30 రోజులలో వివిధ పంచాయతీలలో నాటినమొక్కలు.... 732.14 లక్షలు. ✓గ్రామాల్లోకి వచ్చే కోతులను అడవి బా ట పట్టించేందుకు ఉద్దేశించిన మంకీ ఫుడ్ కోర్టులను 1,063 ఎకరాల్లో ఏర్పాటు చేశాం.

## ప్రగతిలో విద్యుత్‌శాఖ నెంబర్‌వన్

● కార్యాచరణ ముగిసినప్పటికీ ఇంకా పనిచేస్తున్నారు ● ఉమ్మడి రాష్ట్రంలో ఇంత పెద్ద ప్రయత్నం ఎప్పుడూ జరగలేదు ● అధికారులు, ఉద్యోగులు, కార్మికులను అభినందించిన ముఖ్యమంత్రి కేసీఆర్

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** రాష్ట్రంలో అమలు చేసిన 30 రోజుల పల్లెప్రగతి కార్యక్రమంలో విద్యుత్‌శాఖ అగ్రగామిగా నిలిచింది. పల్లెప్రగతి కార్యక్రమం ముగిసినప్పటికీ గ్రామాల్లో ఇంకా విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది తమకు సంబంధించిన పనులను నిర్వహిస్తూనే ఉన్నారని సీఎం కేసీఆర్ చెప్పారు. పల్లెప్రగతిలో విద్యుత్‌శాఖ నెంబర్ వన్ స్థానాన్ని ఆక్రమించడంపట్ల కేసీఆర్ ఆ శాఖాధికారులను, సిబ్బందిని అభినందించారు. 1985 సంవత్సరంలో తాను ఎమ్మెల్యేగా పనిచేశానని అప్పటి నుంచి గ్రామాల్లో విద్యుత్ సంబంధ సమస్యలు ఉంటున్నాయని గుర్తుచేశారు. ఈ సమస్యలను పరిష్కరించడానికి ఇప్పటిదాకా ఎటువంటి ప్రయత్నం జరగలేదని పల్లెప్రగతిలో భాగంగా ఇంత పెద్ద ప్రయత్నం జరగడం శుభ పరిణా మమని చెప్పారు. గ్రామాల్లో తిరుగుతూ విద్యుత్ సంబంధ సమస్యలను ఆ శాఖ అధికారులు, సిబ్బంది పరిష్కరించారని కేసీఆర్ గుర్తుచేశారు. నిర్దేశించిన పనుల్లో ఇప్పటికే 60 శాతానికిపైగా పనులను విద్యుత్‌శాఖ పూర్తిచేసిందని మిగతా పనులను పరిష్కరించేందుకు ఇప్పటికే గ్రామాల్లో విద్యుత్‌శాఖ సిబ్బంది, అధికారులు విధులు నిర్వహించడం గొప్ప విషయమని కొనియాడారు.

## విద్యుత్‌శాఖ చేసిన పనులివీ

✓30 రోజుల పల్లెప్రగతి కార్యాచరణ ప్రణాళికలో భాగంగా విద్యుత్‌శాఖ గ్రామాల వారీగా పవర్‌వీక్ నిర్వహించింది.

✓వంగిన, తుప్పుపట్టిన విద్యుత్ స్తంభాలు 1,67,154 గుర్తించాం. వంగిన వాటిని సరిచేశాం. తుప్పుపట్టిన వాటి స్థానాల్లో కొత్త స్తంభాలను ఏర్పాటు చేశాం. రెండు స్తంభాల మధ్య దూరం ఉండడంవల్ల విద్యుత్ వైర్లు వేలాడకుండా మధ్యలో మరో స్తంభాన్ని ఏర్పాటు చేశాం.

✓గ్రామాల్లో వీధి విద్యుద్దీపాల నిర్వహణకు 6,834 కిలోమీటర్ల మేర కొత్త వైర్లను ఏర్పాటు చేశాం.

✓గ్రామాల్లో వీధి విద్యుద్దీపాలకు ఏర్పాటు చేసిన 7,527 విద్యుత్ మీటర్లు పాడైపోవడంతో వాటిని తొలగించి కొత్త వాటిని ఏర్పాటు చేశాం. వీధి విద్యుద్దీపాల నిర్వహణకు కొత్తగా 2,54,424 విద్యుత్ మీటర్లను బిగించాం.

✓ఏజెన్సీ ప్రాంతాలతో పాటు ఇతర గిరిజన తండాలు, గూడెలు ఉన్న ప్రాంతాల్లో త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం కల్పించాం. గిరిజనులు నివసించే ప్రాంతాల్లో విద్యుత్ సమస్య పరిష్కరించేందుకు ముగ్గురు సీనియర్ ఐఏఎస్ అధికారులతో కమిటీ నియమించాం. సోమేష్ కుమార్, రఘునందన్‌రావు, అజయ్ మిశ్రా ఈ కమిటీలో సభ్యులు.

## పంచాయతీ సిబ్బందికి...
# ఎస్‌కే డే జీవిత బీమా

● ఉద్యోగులు మృతిచెందితే రూ. 2లక్షల బీమా ● నరేగా నిధులతో ప్రతి ఇంట్లో సోక్‌పిట్స్ ● ఇకపై పల్లెప్రగతి ఏటా మూడుసార్లు ● పరిశుభ్ర ఇంటికి ఉత్తమ గృహం అవార్డు ● ముఖ్యమంత్రి కేసీఆర్ వెల్లడి ● పల్లె ప్రగతిపై సుదీర్ఘ సమీక్ష

**హైదరాబాద్, ఆంధ్రప్రభ** : రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల్లో పనిచేసే సిబ్బంది కోసం పూర్తి ప్రభుత్వ ఖర్చుతో ఎస్‌కే డే జీవిత బీమా పథకాన్ని అమలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. అన్ని గ్రామ పంచాయితీల్లో పనిచేసే ఉద్యోగులు ఎవరైనా మరణిస్తే వారి కుటుంబానికి రూ.2 లక్షల బీమా సొమ్ము అందేలా పథకం ఉంటుందని వివరించారు. రైతుల కోసం అమలు చేస్తున్న రైతుబీమా మాదిరిగానే ఎస్‌కే డే బీమా కూడా ఉంటుందని వెల్లడించారు. దేశంలో పంచాయితీరాజ్ ఉద్యమానికి ఆద్యుడైన ఎస్‌కే డేకు నివాళిగా ఈ జీవిత బీమాకు ఆయన పేరు పెడుతున్నట్లు సీఎం చెప్పారు.

రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో ప్రతీ ఇంటిలో నరేగా నిధులతో సోక్‌పిట్స్ నిర్మించాలని సీఎం ఆదేశించారు. దీనిని చాలా ముఖ్యమైనదిగా భావించాలన్నారు. సోక్‌పిట్స్ వల్ల ఇంటిలోని వ్యర్థం, మురికినీరు అక్కడే అంతర్ధానమై, గ్రామంలో దోమలు, ఈగలు వ్యాపించకుండా ఉంటాయన్నారు. అంటు వ్యాధులు ప్రబలే అవకాశాలు తగ్గుతాయన్నారు. సిద్దిపేట, పెద్దపల్లి జిల్లాలను ఆదర్శంగా తీసుకొని సోక్‌పిట్స్ నిర్మించాలని కోరారు. సోక్‌పిట్స్ నిర్మా ణం కోసం అవసరమయ్యే నిధులను విడుదల చేయాలని కోరారు. 30 రోజుల ప్రణాళిక అమలుపై నిర్వహించిన సమా వేశం పది గంటలు కొనసాగి, రాత్రి 9 గంటలకు ముగిసింది. భోజనానంతర సమావేశంలో ముఖ్యమంత్రి పలు విషయాలు ప్రకటించారు.

**పల్లె ప్రగతి ఏటా మూడుసార్లు**

ఇకపై పల్లె ప్రగతి కార్యక్రమాన్ని ప్రతియేటా మూడుసార్లు నిర్వహించాలని నిర్ణయించినట్లు సీఎం చెప్పారు. ప్రతీ ఏడాది జూన్, సెప్టెంబర్, జనవరి మాసాల్లో పది రోజుల చొప్పున పల్లె ప్రగతి నిర్వహించాలన్నారు. పల్లెప్రగతి మాదిరిగానే 20 రోజులపాటు పట్టణ ప్రగతి కార్యక్రమం నిర్వహించాలని, దీనికోసం మార్గదర్శకాలు తయారు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు.

పచ్చదనం-పరిశుభ్రత పెంచే కార్యక్రమంలో భాగంగా తన ఇంటిని, పరిసరాలను పచ్చగా, శుభ్రంగా ఉంచుకునే వారి ఇండ్లకు ఉత్తమ గృహం అవార్డు ఇవ్వనున్నట్లు సీఎం ప్రకటించారు.

**బీఆర్ఎస్, ఎల్ఆర్ఎస్‌పై త్వరలో నిర్ణయం**

గ్రామాల్లో బిల్డింగ్ రెగ్యులరైజేషన్ స్కీమ్, ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్ అమలు సాధ్యాసాధ్యాలను పంచా యితీ రాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నాయకత్వంలోని కమిటీ పరిశీలించాలని సీఎం చెప్పారు. కమిటీ నివేదిక ఇచ్చిన తర్వాత బీఆర్ఎస్, ఎల్ఆర్ఎస్‌పై నిర్ణయం తీసుకుంటామని సీఎం చెప్పారు.

30 రోజుల కార్యక్రమంలో భాగంగా గ్రామంలో వేలాడే తీగలను సరిచేసినట్లే, గ్రామ అవతల, వ్యవసాయ భూముల్లో, రోడ్లపైన, రోడ్ల పక్కన వేలాడే తీగలను సరిచేసే కార్యక్రమం తీసుకోవాలని విద్యుత్ శాఖను సీఎం కోరారు.

ప్రతీ గ్రామం సరిహద్దులను నిర్ణయిస్తూ, గ్రామ కంఠాన్ని ఖరారు చేయాలని సీఎం ఆదేశించారు. గ్రామంలోని రహదారులను గ్రామ పంచాయితీ పేర రిజిస్టర్ చేయాలన్నారు.

**సమావేశంలో ముఖ్యాంశాలు**

● ఈ ఏడాది 75 లక్షల టన్నుల ధా న్యం ఉత్పత్తి అయ్యే అవకాశముంది. పౌర సరఫరాలశాఖ ద్వారా ధాన్యాన్ని సేకరించాలి. ఇందుకోసం అవసరమైనన్ని సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేయడానికి కలెక్టర్లకు పూర్తి అధికారం ఉంది. అందరూ ఒకేసారి సరుకును మార్కెట్‌కు తేకుండా, నియంత్రిత పద్ధతిలో సేకరణ జరగాలి.

● గ్రామకంఠంలోని ఆస్తులు, స్థలా లు, ఇళ్ళు ఏదో ఒక పద్ధతి ప్రకారం రికార్డు కావాలి. ఏదో ఒక రకమైన టైటిల్ ఆస్తి స్వంతదారులకు ఉండాలి. దీనికి ఏం చేయాలో ఆలోచన జరగాలి. ఇతర రాష్ట్రాల్లో, ఇతర దేశాల్లో ఉన్న అత్యుత్తమ విధానాలను అధ్యయనం చేయాలి. పంచాయితీరాజ్ కార్యదర్శి ఈ అధ్యయనం చేయాలి. మనం తీసుకున్న నిర్ణయం దేశానికే ఒక మోడల్ కావాలి.

● గ్రామాల్లో లేఔట్ ఎలా ఉండాలి, ఏం చేయాలి అనే దాని గురించి పంచాయితీరాజ్‌శాఖ మంత్రి అధ్యక్షతన నియమించిన కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయం తీసుకుని ప్రభుత్వానికి తెలియజేయాలి.

● గ్రామాల్లోగానీ, పట్టణాల్లోగానీ ఇళ్ళ మీద నుంచిపోతున్న విద్యుత్ తీగలు ఎక్కడెక్కడ ఎన్ని ఉన్నాయో గుర్తించాలని ఆదేశించారు.

● ఆ వైర్లను ఎలా తొలగించాలి? దానికయ్యే వ్యయమెంత? అనే నివేదిక తయారు చేయాలి. తుప్పుపట్టిన కరెంట్ స్తంభాలను మార్చి, ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చూడాలి. పల్లె ప్రగతి కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకొని కరెంట్ వైరింగ్ సమస్యలను పరిష్కరించాలి.

● రాష్ట్రంలోని మొత్తం లంబాడీ తండాల్లో అటవీ భూముల్లో ఎన్ని, అటవీయేతర భూముల్లో ఎన్ని ఉన్నాయో గుర్తించాలి. ఉన్న తండాలు, గోండు గూడేలు, కోయ గూడేలు, స్వంత జాగాల్లో ఎన్ని ఉన్నాయో కలెక్టర్లు లెక్కలు తీయాలి.

● గ్రామ పంచాయితీలో నిర్ణయాలు, నిధుల వినియోగం ఏకస్వామ్య ఉండకూడదు. గ్రామ పంచాయితీలో సమిష్టిగా నిర్ణయాలు జరగాలి.

● గ్రామాల్లో ఏర్పాటుచేసే డంప్ యార్డులపై షెడ్లు ఏర్పాటు చేయాలి. షెడ్లు లేకుంటే వర్షపునీరు చేరి కాలుష్యం వ్యాప్తి చెందే ప్రమాదముంది.

● గ్రామాల్లో నిర్వహించిన పల్లె ప్రగతి మాదిరిగానే త్వరలోనే పట్టణ ప్రగతి కార్యక్రమం నిర్వహించాలి. గ్రా మాలకు ఇచ్చినట్లే మునిసిపల్ ఎన్నికల తర్వాత పట్టణాలకూ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేస్తాం.

● పట్టణ పరిపాలనను మరింత పటిష్ట పరిచేవిధంగా సెంటర్ ఆఫ్ అర్బన్ ఎక్సలెన్సీ ప్రారంభించాలి.

● గ్రామాల అభివృద్ధికి అవసరమైన విధానాల రూపకల్పనకు, అమలుకు, పర్యవేక్షణ, శిక్షణ కోసం తెలంగాణ స్టేట్ అకాడమీ ఫర్ రూరల్ డవలప్‌మెంట్‌ను బలోపేతం చేయాలి.

● గ్రామాలు, పట్టణాల్లో స్మృతి వనాలు ఏర్పాటు చేయాలి. ఎవరైనా పుడితే వారి పేరుమీద మొక్కను నాటాలి, ఎవరైనా చనిపోతే వారి జ్ఞాపిక కోసం చెట్టు పెట్టాలి.

● గ్రామాల్లో వీధిలైట్ల కోసం మీటర్ల బిగింపు వందశాతం పూర్తయిన వెంటనే మీటరు రీడింగుకు అనుగుణంగా ప్రతినెలా విద్యుత్ బిల్లును విధిగా చెల్లించాలి.

● మంకీ ఫుడ్‌కోర్టుల కోసం అవసరమైన పండ్ల మొక్కలను అటవీశాఖ సరఫరా చేయాలి. అటవీ భూములు ఎక్కువగా లేనిచోట నదులు, ఉప నదులు, కాలువలు, వాగులు, చెరువుల ఒడ్డున కోతులు తినడానికి ఉపయోగపడే పండ్ల చెట్లు పెంచాలి.



## సీఎంగారు.. యాగానికి రండి!

### 13నుంచి నిర్వహించనున్న సహస్ర చండీయాగానికి కేసీఆర్‌ను ఆహ్వానించిన మాజీ ఎంపీ పొంగులేటి

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావును ఈనెల 13నుండి 17వరకు తాను నిర్వహిస్తున్న సహస్రచండీయాగం కార్యక్రమానికి రావాల్సిందిగా ఖమ్మం మాజీఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆహ్వానించారు. గురువారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసిన పొంగులేటి ఖమ్మం జిల్లా కల్లూరుమండలం తన స్వగ్రామం నారాయణపురంలో నిర్వహిస్తున్న సహస్రచండీయాగాన్ని దర్శించాలని విజ్ఞప్తిచేశారు. మునిసిపల్ శాఖామంత్రి కేటీరామారావును కూడా పొంగులేటి ఆహ్వానించారు. యాగం ముగిసిన తర్వాత 18న హైదరాబాద్‌లో తన కుమారుని వివాహ నిశ్చితార్థం జరుగుతుందని, దానికి కూడా హాజరుకావాలని సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లను కోరారు.

# కోడ్ ముగియగానే కోర్కెలు తీరుస్తా!

● ఉద్యోగ సంఘాలతో భేటీ అవుతా ● 30 రోజుల ప్రణాళికతో బాగా పనిచేశారు ● ప్రగతిభవన్‌లో ఉద్యోగ జేఏసీ నేతలో సీఎం కేసీఆర్

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** తెలంగాణ రాష్ట్ర ప్రభు త్వ ఉద్యోగులపై ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రసం శలు గుప్పించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు నిర్వి రామంగా 30 రోజులపాటు తీవ్రంగా శ్రమించారని సీఎం కేసీఆర్ అభినందించారు. అక్టోబర్ 21 తర్వాత ఎన్నికల కోడ్ ముగియగానే ఉద్యోగ సంఘాల నేత లను పిలిపించుకుని మాట్లాడి సమస్యలన్నింటినీ పరి ష్కరిస్తానని హామీ నిచ్చారు. మీ సమస్యలు నాకు తెలు సు, త్వరలో కోడ్ ముగియగానే సానుకూలంగా దశల వారీగా పరిష్కరించుకుందాం అని సీఎం కేసీఆర్ నేరు గా ఉద్యోగ సంఘాల నేతలనుద్దేశించి వ్యాఖ్యా నిం చారు. తెలంగాణ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి(జేఏసీ) అధ్యక్షుడు కారెం రవీందర్‌రెడ్డి, సెక్రటరీ జనరల్ వంకాయలపాటి మమత, తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి ఏ.సత్యనారాయణ, జ్ఞానేశ్వర్ తదితరులు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలో గురువారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిశారు. 30 రోజుల ప్రణాళిక విజయవంతంగా ముగిసిన నేపథ్యంలో ఉద్యోగ సంఘాల నేతలు సీఎం కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. సీఎం కేసీఆర్ ఉద్యోగ సంఘాల నేతలతో భేటీ వెనుక భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆర్టీసీ కార్మికుల సమ్మె నేపథ్యంలో సీఎం కేసీఆర్ వ్యూహాత్మక అడుగులు వేశారని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తుండగా, మరోవైపు ఉద్యోగ జేఏసీ సమస్యలను తీర్చి ఆర్టీసీ జేఏసీ ఆందోళనలో భాగస్వాములు కాకుండా చేసేందుకు సీఎం కేసీఆర్ వ్యూహాత్మకంగా వ్యవహరించారని కొన్నివర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో ఎన్నికల కోడ్ ముగియగానే కరవు భత్యంతోపాటు ఇతర సమస్యలను తీర్చే దిశగా ఉద్యోగ సంఘాలకు హామీనిచ్చినట్లు తెలిసింది.

## జిల్లాకు రూ.2కోట్లు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధి, పారిశుధ్య నిర్వహణ, మొక్కల పెంపకం తదితర పనులకు జిల్లాకు రూ.2 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. అత్యవసర పనులకు నిధులను ఖర్చు పెట్టడానికి వీలుగా ప్రతి జిల్లా కలెక్టర్‌కు రూ.2 కోట్ల నిధులను ఇవ్వనున్నట్టు సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఈ రూ.2 కోట్ల నిధులను ఆయా జిల్లాల కలెక్టర్లు తమ విచక్షణతో వినియోగించుకోవచ్చని సీఎం చెప్పారు. తెలంగాణలో పచ్చదనం పెంచడమే లక్ష్యంగా చేపట్టిన తెలంగాణకు హరితహారం కార్యక్రమాన్ని మరింత వ్యూహాత్మకంగా ముందుకు తీసుకుపోవాలని సీఎం సూచించారు. అడవులు తక్కువగా ఉన్న కరీంనగర్, జనగామ, యాదాద్రి, సూర్యాపేట, వరంగల్ అర్బన్, గద్వాల, నారాయణపేట తదితర జిల్లాల్లో అడవులను పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని ఆయన కోరారు. పల్లెప్రగతి సమీక్షలో కలెక్టర్లకు అడవులు పెంచే అంశంపై దిశానిర్దేశం చేశారు.



### సిద్ధమవుతున్న తెరాస జిల్లా కార్యాలయాలు

## సిద్దిపేట, మేడ్చల్ రెడీ

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** టీఆర్ఎస్ జిల్లా కార్యాలయాలు రెడీ అవుతున్నాయి. ఈ దసరాకే కార్యాలయాలన్నీ ప్రారంభించాలని భావించినా ఓవైపు హుజూర్‌నగర్ ఉప ఎన్నిక, మరోవైపు ఆర్టీసి కార్మికుల సమ్మె, ఇంకోవైపు భారీ వర్షాల నేపథ్యంలో ప్రారంభోత్సవాలను వాయిదావేశారు. ఇప్పటివరకు సిద్దిపేట, మేడ్చల్ జిల్లా కార్యాలయాలు దాదాపు పూర్తికాగా, వర్షాల కారణంగా చాలాజిల్లాల్లో పనులు అనుకున్నంత వేగంగా సాగలేదు. ఒక్కో జిల్లా కార్యాలయానికి రూ.60లక్షల చొప్పున అధినేత కేసీఆర్ నిధులు కేటాయించగా, పనులు చకచకాసాగాయి. సిరిసిల్ల, వరంగల్ లాంటి జిల్లాల్లో వర్షాల కారణంగా పనులు ముందుకు సాగలేదు. ఈనెల 24తో హుజూర్‌నగర్ సందడి ముగియనుండగా, 28న దీపావళి. ఆ తర్వాత మంచి ముహూర్తాలు ఉన్నందున కార్తీకమాసానికి మెజారిటీ జిల్లాల్లో పనులు పూర్తిచేసి జిల్లా కార్యాలయాల ప్రారంభోత్సవాలు పెట్టుకోవాలని భావిస్తున్నారు. కనీసం పదిజిల్లాల్లో నవంబర్‌లో కార్యాలయాలు ప్రారంభం కానున్నాయి.

# ప్లాస్టిక్ నిషేధంపై రంగంలోకి అటవీ, పర్యావరణ శాఖలు

### రేపు సీఎంకు నివేదిక




**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ప్లాస్టిక్‌పై ప్రభుత్వం యుద్ధాన్ని ప్రకటించడంతో అటవీ, పర్యావరణశాఖ రంగంలోకి దిగింది. సీఎం కేసీఆర్ ఇచ్చిన ఆదేశంతో రంగంలోకి దిగిన సంబంధిత శాఖల అధికారులు రాష్ట్రంలో ప్లాస్టిక్ నిషేధానికి సంబంధించిన విధి విధానాలపై కసరత్తు చేస్తున్నారు. వీలైనంత త్వరగా ఈ అధ్యయనాన్ని పూర్తిచేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది. రాష్ట్రంలో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌పై నిషేధం విధించాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఏయే రాష్ట్రాల్లో ప్లాస్టిక్‌ను ఎలా నిషేధించింది.. ఆయా రాష్ట్రాల్లో ఏ తరహా విధానాలను అమలు చేస్తున్నది, ప్లాస్టిక్ నిషేధంపై కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలేంటి, మార్గదర్శకాలు ఏ విధంగా ఉన్నాయి అనే అంశాలపై తివారీ నేతృత్వంలోని కమిటీ అధ్యయనం చేయనుంది. ఒకసారి వాడిన ప్లాస్టిక్‌ను తిరిగి వాడొద్దని ప్రధాని నరేంద్రమోడీ ప్రజలకు సూచిస్తున్న సంగతి తెలిసిందే. ఇలా చేయడంవల్ల కాలుష్యం మరింత పెరుగుతుందని ప్రధాని అభిప్రాయపడు తున్నారు. 50 మైక్రాన్స్‌లోపు ఉన్న ప్లాస్టిక్‌పై ఇప్పటికే నిషేధం అమల్లో ఉందని 50 మైక్రాన్లలోపు మందం ప్లాస్టిక్‌తో ప్రజలకు మరింత ప్రమాదమని భావిస్తున్నారు. రాష్ట్రంలో ప్లాస్టిక్‌పై నిషేధాన్ని ఎలా విధించాలి, ఎన్ని మైక్రాన్ల మేరకు ప్లాస్టిక్‌ను అనుమతించాలి, అసలు ప్లాస్టిక్ వాడకాన్ని అనుమతించాలా, వద్దా? ఎటువంటి విధి విధానాలు అవసరం తదితర అంశాలపై అధికారులు అధ్యయనం చేయనున్నారు. శనివారం సాయంత్రం వరకు ప్లాస్టిక్ నిషేధంపై మార్గదర్శకాలను రూపొందించి ప్రభుత్వానికి నివేదిక అందజేయాలని అటవీ, పర్యావరణశాఖ అధికారులు నిర్ణయించారు. వచ్చే మంత్రివర్గ సమావేశంలో ప్లాస్టిక్ నిషేధంపై చర్చించి ఆ తర్వాత ఆదేశాలు జారీచేయనున్నారు.

ఇదిలా ఉండగా 50 మైక్రాన్లలోపు మందం ఉండే ప్లాస్టిక్ కవర్లను, ఇతర ఉత్పత్తులను తయారు చేస్తున్న మూడు కంపెనీలపై జీహెచ్ఎంసీ అధికారులు గురువారం దాడిచేసి ఆ పరిశ్రమలను మూసివేయించారు. 50 మైక్రాన్లలోపు మందం ఉన్న ప్లాస్టిక్‌పై ఇప్పటికే నిషేధం విధించినా కొన్ని సంస్థలు యదేచ్ఛగా వీటిని తయారు చేస్తున్నాయని ఫిర్యాదులందడంతో నగర శివార్లలోని కాటేదాన్ పారిశ్రామికవాడలోని సంస్థలపై ఆకస్మిక దాడులు నిర్వహించి వాటిని మూసివేయడంతో పాటు సంబంధితులపై కేసులు నమోదు చేశారు. ప్లాస్టిక్‌పై నిషేధం విధిస్తున్నట్టు సీఎం కేసీఆర్ ప్రకటించడంతో శుక్రవారం నుంచి ఈ దాడులను మరింత ముమ్మరం చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## ప్లాస్టిక్ నిషేధంపై సూచనలివ్వండి

● కేటీఆర్ ట్వీట్



**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ప్లాస్టిక్ నిషేదంపై ముఖ్యమంత్రి కేసీఆర్ గొప్ప నిర్ణయం తీసుకున్నారని, దీనిని పకడ్బందీగా అమలుచేసి పర్యావరణ హిత చర్యలు తీసుకునేందుకు సలహాలు, సూచనలు అందివ్వాలని మునిసిపల్ శాఖామంత్రి కేటీరామారావు గురువారం ట్విట్టర్ ద్వారా కోరారు.

## ముగ్గురు కలెక్టర్లను అభినందించిన కేసీఆర్

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** గ్రామాల అభివృద్ధి, పారిశుధ్య నిర్వహణ పనుల్లో చురుకైన పాత్ర పోషించి కేంద్ర ప్రభుత్వం నుంచి అవార్డులు స్వీకరించిన పెద్దపల్లి, సంగారెడ్డి, భూపాలపల్లి జిల్లాల కలెక్టర్లు దేవసేన, హనుమంతరావు, వెంకటేశ్వర్లను సీఎం కేసీఆర్ అభినందించారు. ప్రగతి భవన్‌లో గురువారం జరిగిన పల్లెప్రగతి సమీక్షా సమావేశం సందర్భంగా ఈ ముగ్గురు కలెక్టర్లకు కేసీఆర్ జ్ఞాపికలను అందజేసి సత్కరించారు.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

శుక్రవారం 11 అక్టోబర్ 2019

## మైత్రితో మేలు..కయ్యంతో కీడు!

ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పొరుగు దేశాలతో సంబంధాలను మెరుగు పర్చుకునేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారు. ఆయన మొదటి సారి ప్రమాణం చేసినప్పుడు సార్క్ దేశాల అధిపతులను ఆహ్వానించారు.ఆ సుహృద్భావాన్ని సార్క్ దేశాల్లో పాకిస్తాన్ మినహా పొరుగుదేశాలన్నీ కాపాడుకుంటున్నాయి.సార్క్ లో సభ్యత్వాన్ని కలిగిన బంగ్లాదేశ్ స్వతంత్ర దేశంగా ఆవిర్భవించిన నాటి నుంచి మనకు మిత్ర దేశం.ఆ మాటకు వస్తే బంగ్లాదేశ్ అవతరణలో మన మద్దతు ఎంతో ఉంది.బంగ్లాదేశ్ యుద్ధం సమయంలో భారత పౌరులు సినిమా టికెట్ల పై అదనపు భారాన్ని మోయాల్సి వచ్చింది. బంగ్లాదేశ్, పాకిస్తాన్ లు భారత ఉపఖండంలో అంతర్భాగాలే.బంగ్లాదేశ్ తోనూ మన దేశానికి సరిహద్దు సమస్యలూ, నదీజలాల సమస్యలు ఉన్నా, అవి ఇరుదేశాల మధ్య మైత్రిని దూరం చేసేంత తీవ్రంగా లేవు.ఇచ్చి పుచ్చుకునే ధోరణిలో పరిష్కారానికి ఇరుదేశాలూ కృషి చేస్తున్నాయి. భారత్ తో గిల్లి కజ్జాలు పెట్టుకుంటున్న పొరుగుదేశాలు చైనా, పాకిస్తాన్‌లే.ఈ రెండు దేశాలూ మన భూభాగాలను ఆక్రమించాయి. మన దేశంలో రెండు రోజుల పాటు పర్యటించేందుకు శుక్రవారం నాడు వస్తున్న చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ కు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ ఎస్ ఎస్) సీనియర్ నాయకుడు ఇంద్రేష్ కుమార్ ఓ విజ్ఞప్తి చేశారు. బాబూ జిన్ పింగ్ గారూ మా దేశంలో సౌహార్ద పర్యటనకు వస్తున్నందుకు స్వాగతం చెబుతూనే హృదయపూర్వకమైన మనవి చేస్తున్నాం. 55ఏళ్ళ క్రితం మీ దేశం ఆక్రమించిన ఆక్సాయ్ చిన్ ప్రాంతాన్ని తిరిగి ఇప్పించండిఅని. జిన్ పింగ్ స్థాయికి తగ్గవాడు కాకపోయినా,భారత పౌరుని హృదయ స్పందనను ఆయన మాటల్లో వివరించారు.అలాగే, పాక్ అధీనంలో ఉన్న ఆక్రమిత కాశ్మీర్ లో శాశ్వత కట్టడాలు ఏవీ చేయరాదని కూడా చైనా అధినేతను భారత పౌరులు కోరుతున్నారు. ఈ ప్రాంతం మీదుగానే చైనా ఆర్థిక నడవ ( కారిడార్) ని నిర్మిస్తోంది. ఈ ప్రాజెక్టుకు సహకరిస్తున్నందువల్లే పాక్ ను అంతర్జాతీయంగా అన్ని దేశాలూ వెలివేసినంత పని చేసినా, చైనా వెనకేసుకొస్తోంది. అదే సందర్భంలో బంగ్లాదేశ్ కూడామనకు పొరుగు దేశమే.బంగ్లాదేశ్‌లో త్రిపుర,బెంగాల్ ప్రాంతాలు, ఈ రెండు రాష్ట్రా ల్లో బంగ్లాదేశ్ కి చెందిన గ్రామాలను బదిలీ చేయడానికి సంబంధించి సరిహద్దు ఒప్పందాలను చేసుకోవడం జరిగింది. ఇందుకోసం ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రత్యేకంగా ఢాకా వెళ్ళారు. ఈ ఒప్పందాలతో దశాబ్దాల నాటి వివాదం చిటికెలో పరిష్కారం అయింది. పొరుగుదేశాలతో సరిహద్దు సమస్యలు తలెత్తినా సామరస్యపూర్వకమైన చర్చల ద్వారా పరిష్కరించుకోవచ్చునడానికి ఈ ఒప్పందాలే నిదర్శనం. కానీ, చైనా,పాకిస్తాన్‌లతో ఇలాంటి వివాదాలు పరిష్కారం కాకపోవడానికి కారణం ఆ రెండు దేశాల్లో చిత్తశుద్ధి లోపించడమే కారణం.పైనో మాట,లోన ఓ మాట అనే రీతిలో ఈ రెండు దేశాలూ దశాబ్దాలుగా వ్యవహరిస్తూ వస్తున్నాయి. జిన్ పింగ్, ఆయన ముందుఆ పదవిలో ఉన్న వారు మన దేశంలో ఎన్ని సార్లు పర్యటించినా, మన నాయకులు బీజింగ్ లో ఎన్ని పర్యటనలు జరిపినా ఇచ్చి పుచ్చుకునే ధోరణి ఆవలి దేశానికి లేనందువల్లే పరిష్కా రం కావడం లేదు.మరో వంక గత వారం మన దేశంలో నాలుగు రోజుల పాటు పర్యటించిన బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా పర్యటన సందర్భంగా భారత్ నుంచి పెట్టుబడులను ఆహ్వానించారు.ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం గత ఆర్థిక సంవత్సరంలో 9 బిలియన్ డాలర్లకు పెరిగింది. ఏడాది కాలంలో పన్నెండు ప్రాజెక్టులను ప్రారంభించడం ఈ రెండు దేశాల మధ్య వెల్లివిరిస్తున్న స్నేహానికి నిదర్శనమన్న ప్రధాని మోడీ వ్యాఖ్యలో అత్యుక్తి లేదు.అంతేకాక, బంగ్లాదేశ్ మన దేశంలోని ఈశాన్య రాష్ట్రా లకు వంటగ్యాస్ ను సరఫరా చేస్తోంది.బంగ్లా దేశ్ నుంచి మన దేశానికి పర్యాటకుల సంఖ్య గతంలో కన్నా బాగా పెరిగారు. పరస్పర సహకారం ఉంటే అది ఇరుదేశాలకూ ఉభయ తారకమవుతుందన్న నానుడి బంగ్లాదేశ్ మైత్రితో రుజువు అవుతోంది. బంగ్లా దేశ్ అవతరణకు పోరాటం సాగించిన షేక్ ముజిబూర్ రహమాన్ భారత్ కు మిత్రుడు. అదే మాదిరిగా ఆయన కుమార్తె అయిన ప్రస్తుత ప్రధాని షేక్ హసీనాకు కూడా మన దేశమంటే ప్రత్యేక అభిమానం. హసీనా , మాజీ ప్రధాని ఇందిరాగాంధీ కుటుంబంతో భావోద్వేగమైన బంధం ఉంది.అందుకే, ఆమె పర్యటన సందర్భంగా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ మీరే మాకు స్ఫూర్తి అని ఆమెతో అన్నారు. దేశాల మధ్య మైత్రి, అధికార కుటుంబాలకు విస్తరించడంలో అసహజం లేదు. మైత్రితోనే చిరకాల సమస్యలు పరిష్కారం అవుతాయని భావించడం వల్లనే ప్రధానిమోడీ పూర్వపు పాక్ ప్రధాని నవాజ్ షరీఫ్ తో ఎక్కువ సన్నిహితంగా ఉన్నారు. అప్పట్లో మోడీ వలలో షరీఫ్ పడుతున్నారంటూ అప్పటి ప్రతిపక్ష నాయకుడు,ప్రస్తుత పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ కనీసం షరీఫ్ హయాం నాటి సాంగత్యాన్ని కొనసాగించకుండా సమయం వచ్చినప్పుడల్లా భారత్ పై విషం కక్కుతున్నారు. బంగ్లాదేశ్ లో కూడా పూర్వపు ప్రధాని, బంగ్లాదేశ్ నేషలిస్టు పార్టీ (బిఎన్ పీ) అధ్యక్షురాలు బేగం ఖలీదా మన దేశం పట్ల శత్రు వైఖరినే ప్రదర్శించారు.తమ భూభాగాల్లో యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ అసోం (ఉల్ఫా) తీవ్ర వాదులు స్థావరాలు ఏర్పాటు చేసుకోవడానికి అనుమతి ఇచ్చారు.ఉల్ఫా తీవ్రవాదులకు ఖలీదా ప్రభుత్వం ఆర్థికంగా,ఆయుధ పరంగా సాయాన్ని అందించింది.అదే బంగ్లాదేశ్ ఇప్పుడు మన దేశంతో మైత్రిని కోరుతున్న దంటే, అధికారంలో ఉన్న వారి మనస్తత్వం, ధోరణి ప్రధాన కారణం. షేక్ హసీనా మోడీనే కాకుండా, కాంగ్రెస్ తాత్కాలిక అధ్యక్షురాలు సోనియాగాంధీని కూడా తమ దేశానికి ఆహ్వానించి అత్యున్నతపౌర పురస్కారాన్ని అందించారు. బంగ్లాదేశ్ పర్యాటకుల సంఖ్య భారీగా పెరుగుతోంది। పర్యాటక రంగం ద్వారా భారత్ కు వచ్చే ఆదాయంలో ఐదో వంతు బంగ్లాదేశ్ పర్యాటకుల ద్వారానే వస్తోంది.కాశ్మీర్ విషయంలో పాక్ కయ్యానికి కాలు దువ్వకుండా ఉండి ఉంటే ఇరుదేశాల మధ్య పర్యాటకుల సంఖ్య మరింత పెరిగేది. ఆదాయం మాట అటుంచి ఇరుదేశాల నాయకుల మధ్య దశాబ్దాలుగా పెనవేసుకుని పోయిన భావోద్వేగ సంబంధాలు మరింత పటిష్టం అయ్యేవి.మన దేశంలో వివిధరంగాల్లో పేరొందిన వారిలో పాతతరం నాయకులంతా పాకిస్తాన్ లో పుట్టిన వారే, బాలీవుడ్ లో వెనకటి తరానికి చెందిన దిలీప్ కుమార్, మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్, మాజీ ఉప ప్రధాని అద్వానీ వంటి హేమాహేమీల పూర్వీకులంతా పాక్ కి చెందిన వారే.చైనా మన భూభాగాలను అప్పగించకపోయినా,పొరుగుదేశంతో సంబంధాల విషయంలో సడలింపు ధోరణిని మాజీ ప్రధానులు రాజీవ్ గాంధీ, పీవీ నరసింహారావు,వాజ్‌పేయి అనుసరించడం వల్లనే చైనా అధ్యక్షుడు మన దేశానికి , మన ప్రధాని మోడీ బీజింగ్ కూ వెళ్ళేందుకు అవకాశం కలిగింది.

# అభివృద్ధితో పర్యావ'రణం'!



అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినప్పుడు పర్యావరణ సమస్యలు తలెత్తడం సహజమే కానీ, ఈ మధ్య కాలంలో ఇలాంటి వివాదాలు పెచ్చుపెరుగుతున్నాయి. జార్ఖండ్ లో గనుల తవ్వకం, విశాఖలో బాక్సైట్ గనుల తవ్వకంపై వివాదాలు తరచూ తెరమీదికి వస్తున్నాయి.దేశంలోని పలు రాష్ట్రా లలో అభివృద్ధి వర్సెస్ పర్యావరణం కథనాలు తరచూ మీడియాలో వస్తున్నాయి.ఇలాంటి సందర్భాల్లో విత్తు ముందా చెట్టు ముందా తరహాలో ఏది ముఖ్యం ఏది అముఖ్యం అనే ప్రశ్న తలెత్తుతూ ఉంటుంది. పర్యావరణం, అభివృద్ధి రెండూ ముఖ్యమే. ఆధునిక నాగరికత బహుముఖాలుగా విస్తరిస్తున్న ప్రస్తుత తరుణంలో అభివృద్ధిని అరచేతితో అడ్డుకోవడం ఎవరి తరమూ కాదు.అభివృద్ధి కార్యక్రమాలు ఒక చోట ప్రారంభమైతే మిగిలిన ప్రాంతాలకు విస్తరిస్తాయి. అభివృద్ధినీ,పర్యావరణాన్నీ సమతుల్యంగా భావిస్తూ ప్రాజెక్టులు చేపట్టాల్సి ఉంటుంది. సుందర్ లాల్ బహుగుణ, మేధాపాట్కార్, వందనా శివ



వంటి పర్యావరణ వేత్తలు దశాబ్దాలుగా పర్యావరణ పరిరక్షణ కోసం ఎటువంటి స్వార్థమూ లేకుండా నిరంతర పోరాటాలను రాజీ లేని రీతిలో సాగిస్తున్నారు.అయితే, మన దేశంలో పర్యావరణ వేత్తలపై ప్రభుత్వాలు వామపక్ష తీవ్రవాదుల సానుభూతిపరులన్న ముద్రవేసి వారిపై కేసులు బనాయించడం,కొన్ని సందర్భాల్లో అరెస్టులు చేయడం కూడా జరుగుతోంది.తమిళనాడులోని కుందకూళం అణువిద్యుత్‌ను వ్యతిరేకిస్తూ రచయిత, హక్కుల ఉద్యమకారుడు ఉదయ్ కుమార్ పెద్దపోరాటం చేశారు. ఆయన పీపుల్స్ మూవ్ మెంట్ ఎగెనెస్ట్ న్యూక్లియర్ ఎనర్జీ కి కన్వీనర్ గా ఉన్నారు. ప్రదర్శనలు, ధర్నాలు చేసినందుకు ఆయనను పలుమార్లు అరెస్టు చేశారు.ఈ అణు విద్యుత్ ప్రాజెక్టు తమిళనాడులోని నాగర్ కోయిల్ కు 30 కిలో మీటర్ల దూరంలో ఉంది.ఈ ప్రాజెక్టుకు రష్యా అణు రియాక్టర్లను అందజేసిం ది.కల్పాక్కం, కైగా, కాక్రా పూర్,జైతాపూర్,నరోరా అణు ప్రాజెక్టులకు వ్యతిరేకంగా పర్యావరణ వేత్తలు ఇప్పటికీ ఆందోళనలు సాగిస్తున్నారు. ప్రాజెక్టులు, పర్యావరణ పరిరక్షణల మధ్య తలెత్తిన వివాదాలు ఇప్పుడు కోర్టులకు సంగ్రామ క్షేత్రాలుగా తయా రయ్యాయి. తాజాగా ముంబాయిలోని మెట్రో రైలు ప్రాజెక్టు కోసం ఆరే కాలనీలో చెట్లు నరికివేత వివాదం కోర్టులో కొనసాగుతోంది.ఈ మెట్రో ప్రాజెక్టు కోసం చెట్ల నరికివేతను వ్యతిరేకిస్తూ స్థానిక పర్యావరణ వేత్తలు బొం బాయి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.అయితే ఈ ప్రా జెక్టుకు బొంబాయి హైకోర్టు అనుమతి ఇచ్చింది.దానిపై పర్యావరణ వేత్తలు సుప్రీంకోర్టుకు వెళ్ళారు.ఇది ఒక్కటే కాదు.

ఈ ఏడాది ఆగస్టులో సుప్రీంకోర్టుకు కేంద్ర ప్రభుత్వానికి చెందిన చార్ ధామ్ ప్రాజెక్టు విచారణకు వచ్చింది.నాలుగు పరమపవిత్రమైన హిందూ పుణ్య క్షేత్రాలు యమునోత్రి, గంగోత్రి,బదరీనాథ్, కేదార్ నాథ్ లను కలుపుతూ 900 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి సంబంధించిన ఈ ప్రాజెక్టు వల్ల పర్యావరణ సమస్యలు తలెత్తుతాయని డెహ్రాడూన్ కి చెందిన సిటిజెన్స్ ఫర్ గ్రీన్ డూన్ సంస్థ,ఇతర పర్యావరణ సంస్థలు నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ లో పిటిషన్ దాఖలు చేశారు.ఈ ప్రాజెక్టుకు అవసరమైన పర్యావరణ అనుమతులు తీసుకోలేదని వారు ఈ పిటిషన్ లో ఆరోపించారు.అయితే, గ్రీన్ ట్రిబ్యునల్ ఈ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు అవసరం లేదని స్పష్టం చేసింది.ప్రాజెక్టు నిర్మాణ పనులను కొనసాగించేందుకు అనుమతులు ఇచ్చింది.పర్యావరణ పరిరక్షణ ప్రణాళికను పరిశీలించేందుకు ఉత్తరాఖండ్ హైకోర్టు మాజీ న్యాయ మూర్తి నేతృత్వంలో నిపుణల కమిటీని ట్రిబ్యునల్ ఏర్పాటు చేసింది.ఈ ప్రాజెక్టుకు సంబంధించి పర్యావరణ అనుమ తుల ఉల్లంఘన ఎక్కడైనా జరిగిందా పరిశీలించాల్సిందిగా ఈ నిపుణుల కమిటీని ఆదేశించింది.

అయితే,ట్రిబ్యునల్ ఉత్తర్వుపై సాంకేతిక కారణాల పేరిట సుప్రీంకోర్టు స్టే విధించింది.అయితే,స్వతంత్ర ప్రతిపత్తి గల అంచనా కమిటీకి ఈ ప్రాజెక్టు మంచిసెబ్బరలను పరిశీలించే బాధ్యతను అప్పగించాలన్న ట్రిబ్యునల్ ఉత్తర్వును కోర్టు అనుమతించింది.అయితే, ఈ కమిటీకి రిటైర్డ్ న్యాయ మూర్తి బదులు డెహ్రాడూన్ పీపుల్స్ సైన్స్ ఇనిస్టిట్యూట్ డైరక్టర్ రవిచోప్రా నేతృత్వం వహించాలని కోర్టు ఆదేశించింది.ఈ ప్రాజెక్టు వల్ల హిమాలయ ప్రాంతాల్లో పర్యావరణ పరిస్థితులపై ప్రభావం గురించి కూడా అధ్యయనం చేయాల్సిందిగా సుప్రీంకోర్టు ఆదేశించింది.ఇందుకు నాలుగు నెలల గడువు ఇచ్చింది.నాలుగు నెలలలోగా రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖకు నివేదిక సమర్పించాల్సిందిగా కూడా ఆదేశించింది.ఈ కమిటీలో రోదశి, వన్యప్రాణి సంరక్షణ సంస్థ (డెహ్రాడూన్),రక్షణ మంత్రిత్వ శాఖ ప్రతినిధులు సభ్యులుగా ఉండాలని కూడా సుప్రీంకోర్టు ఆదేశించింది. ఇలాంటిదే మరో వివాదం....సేలం-చెన్నై ల మధ్య 8లైన్ల గ్రీన్ కారిడార్ ప్రాజెక్టుకు సంబంధించింది.పదివేల కోట్ల రూపాయిల వ్యయంతో చేపట్టే ఈ ప్రాజెక్టుపైన కూడా అభ్యంతరాలు వచ్చాయి.ఈ ప్రాజెక్టుకు భూసేకరణ జరిపితే పర్యావరణ సమస్యలు తలెత్తుతాయని పలువురు స్థానికు లు పిటిషన్లు దాఖలు చేశారు.దీనిపై మద్రాసు హైకోర్టు ఈ ప్రాజెక్టును నిలిపి వేయాలని ఆదేశించింది. ప్రభుత్వం సుప్రీంకోర్టుకు అప్పీలు చేయగా,ఈ ప్రాజెక్టుకు జాతీయ ప్రాముఖ్యం ఉందనీ,ఈ ప్రాజెక్టును నిర్మిస్తే సేలం- చెన్నైల మధ్య దూరం సగం పైగా దక్కుతుందని తన అప్పీలులో కేంద్రం స్పష్టం చేసింది. కాగా, ఈ ప్రాజెక్టుకు భూసేకరణను వ్యతిరేకిస్తున్న రైతుల తరపున న్యాయవాది సంజయ్ పరేఖ్ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ లో ఈ ప్రాజెక్టును నిర్మిస్తే ఇది నీటివనరుల సంస్థలు,కొండలను కోస్తూ వెళ్తుందనీ, దీని వల్ల పర్యావరణ సమస్యలు తలెత్తుతాయని వాదించారు.ఈ ప్రాజెక్టు నిడివి 277 కిలోమీటర్లు. మొదట్లో ఈప్రాజెక్టును సేలం- చెన్నైలను కలుపుతూ ప్రణాళిక రూపొందించారు.ఈ ప్రణాళిక ప్రకారం అయితే పర్యావరణ అనుమతులు అవసరం లేదు.అయితే, ఈ మార్గాన్ని మార్చి సేలం-చెన్నైల మధ్యరోడ్డు నిర్మాణం జరపాలని నిర్ణయించారు. దాంతో పర్యావరణ వేత్తలు కోర్టులో సవాల్ చేశారు.చెన్నై-మధురై ప్రాజెక్టు చేపడితే చెట్లు ఎక్కువగా కూల్చాల్సిన అవసరం లేదని పరేఖ్ తన అప్పీలులో వాదించారు. చెన్నై-సేలం మధ్య రోడ్డు నిర్మిస్తే చాలా చెట్లను కూల్చాల్సి వస్తుందని కూడా ఆయన పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో కోర్టులకు ఈ వివాదాలు పెను సవాల్ గా తయారయ్యాయి.

ఒక వైపు ఎఫ్ డిఐలు, మరో వైపు ఆందోళనలు: మన దేశంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావల్సిందిగా ప్రధాని నరేంద్రమోడీ దాదాపు అన్ని విదేశీ పర్యటనల్లోనూ,ఆయా దేశాల పారిశ్రా మికవేత్తలకే కాకుం డా, ప్రవాస భారతీయులకు విజ్ఞప్తి చేస్తున్నారు.మరో వంక విదేశీ సంస్థలకు భూములు,గనుల కేటాయింపును పర్యావరణ వేత్తలు వ్యతిరేకిస్తున్నారు. దీంతో అభివృద్ధి వర్సెస్ పర్యావరణం వివాదాలు ఎక్కడికక్కడ తలెత్తు తున్నాయి. ప్రాజెక్టులు ఎంత అవసరమో, పర్యావర ణమూ అంతే అవసరం.ఈ విషయంలో ప్రభుత్వాలు పర్యావరణ వేత్తలను పిలిచి చర్చలు జరపాలి.సామరస్య పూర్వకమైన పరిష్కారాన్ని కనుగొనాలి.విద్యుత్ రంగంలో పరిస్థితి మెరుగుగా ఉన్నా, అణు విద్యుత్ ద్వారానే విద్యుత్ సమస్యలు తీరిపోతాయన్న అభిప్రాయం ఉంది.తెలుగు రాష్ట్రా ల్లో మహబూబ్ నగర్, కడప తదితర ప్రాంతాలలో యురేనియం ప్రాజెక్టులకు వ్యతిరేకంగా ఇప్పటికే ఆందోళనలు సాగుతున్నాయి. అణు ప్రాజెక్టు లవల్ల సాధ్యమైనంత వరకూ తక్కువ నష్టంవాటిల్లేట్టు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విని యోగించుకోవాలి. లేని పక్షంలో జపాన్ లోని పుకూషి మా అణుకేంద్రంలో సంభవించిన ప్రమాదాలు మాదిరి అణు ప్రమాదాలు సంభవిస్తాయే మోనన్న పర్యావరణ వేత్తల భయాలు నిరాధారం కాకపోవచ్చు

**- పద్మనాభస్వామి**

# బేటీ పడావ్‌తోనే ప్రగతి



అంతర్జాతీయ బాలికల దినోత్సవం నేడు

"యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః అనేది ఆర్యోక్తి" అంటే ఆడవారికి గౌరవం దక్కిన చోటే దేవతలు నడయాడుతారు అని అర్థం. కానీ ఇటీవల కాలంలో ఆడపిల్లగా పుట్టడం, పుట్టినా సురక్షితంగా మనుగడ సాగించడమే దుర్భరమైన దురవస్థ ఏర్పడింది. అందుకే బాలికల హక్కుల ఉల్లంఘన, మానవ హక్కులకు వ్యతిరేకంగా ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది ఆడపిల్లలు ఎదుర్కొంటున్న సవాళ్లని ప్రపంచానికి తెలియజేయడం తోపాటు బాలికలకు అవగాహన పెంచే ఉద్దేశంతో ప్రతి ఏడాది అక్టోబర్ 11వ తేదీన అంతర్జాతీయ బాలికల దినోత్సవంగా జరుపుకోవాలని ఐక్యరాజ్యసమితి డిసెంబర్ 19న 2011లో ప్రకటించింది. అప్పటి నుంచి ప్రపంచ వ్యాప్తంగా అక్టోబర్ 11వ తేదీన 2012 నుండి అంతర్జాతీయ బాలికల దినోత్సవంగా జరుపుకుంటున్నాం.కౌమార దశలోని యువతుల్లోని శక్తిసామర్థ్యాలను వెలికితీసుకురావాలంటే, తొలుత వారి ఎదుగుదలకు అడ్డుగా నిలుస్తున్న సామాజిక అడ్డంకులను అధిగమించాలి.అభివృద్ధి అజెండాలో వారికి స్థానం కల్పించాలి. అందుకోసం బాలి కా విద్య, ఆరోగ్యం, పోషకాహారం, ఉపాధి నైపుణ్యాల విషయంలో ప్రభుత్వాలు స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకోవాలి. కానీ వాస్తవాలు భిన్నంగా ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా బాలికలు ఎదుర్కొంటున్న గడ్డు పరిస్థితులే అందుకు తిరుగులేని సాక్ష్యాలు. పేదరికం, అవిద్య, బాల్య వివాహాలు, బలవంతపు పెళ్ళిళ్ళు, పోషకాహారలేమి, అఘాయిత్యాలు, వ్యభిచార ముఠాలు, లైంగిక దాడులు బాలికల పాలిట శాపాలవుతున్నాయి. ఇవన్నీ ఒకదానితో మరొకటి ముడివడిన సమస్యలు. పాలకులు ఒకవ్యైపు "బేటీ బచావో.. బేటీ పఢావో" అంటూ పథకాలు రూపొందిస్తున్నారు. మరోవ్యైపు ఆడపిల్లల అక్రమ రవాణా యథేచ్ఛగా సాగిపోతోంది. అమ్మాయిలను బలవంతంగా వ్యభిచార ముగ్గు లోకి దించుతున్నారు. తమ ప్రేమను అంగీ కరించని బాలికలపై అఘాయిత్యాలకూ, ఆసిడ్ దాడులకూ పాల్పడుతున్నారు. సమ సమాజం ఆమోదించని ఘటనల వలన బాలికల భద్రతపై ఇంకా అనేక సందేహాలు వెల్లువెత్తుతున్నాయి.

బాలికల వికాసం విషయంలో ఆశాజనకమైన ఫలితాలను పొందుతున్నామని మనం చెప్పుకుంటున్నా.. ప్రపంచ వ్యాప్తంగా ఇంకా 40 మిలియన్ల మంది బాలికలు పాఠశాల విద్యను అందుకోలేకపోవడం గమనార్హం. అలాగే ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 65 కోట్లమంది అడపిల్లలకు బలవంతపు బాల్య వివాహాలు జరుగుచున్నాయి. వీళ్లలో ప్రతి ముగ్గురిలో ఒకరి కంటే ఎక్కువ మంది బాలికల వివాహం 15 సంవత్సరాలలోపే జరుగుతోంది. ఈ విషయం మీదనే భారత సుప్రీంకోర్టు స్పందించింది. 15 నుండి 18 సంవత్సరాల లోపు ఉన్న బాలికలతో సంసార బంధం ఏర్పరచుకోవడం నేరమని పేర్కొంది.

ఇళ్లలో, స్కూళ్ళలో, ఆరుబయట, ఆట స్థలాల్లో, బహిర్భూముల్లో, తిరిగే బస్సుల్లో , కార్లలో, సంక్షేమ హాస్టళ్ళలో ఇక్కడా...అక్కడా అని తేడా లేకుండా ఎక్కడైనా అపాయం పొంచి వుంది అనుకునే విధంగా పిల్లలపై లైంగిక అత్యాచారాలు పెరిగిపోయాయి. అలాగే 15-19 వయసు ఆడ పిల్లల్లో దాదాపు ప్రతి నలుగురిలో ఒకరు విపరీతమైన శారీరక హింసకి గురవుతున్నట్లు తెలుస్తోంది. అన్ని వయసులతో పోలిస్తే ఈ వయసు ఆడ పిల్లలు లైంగిక అత్యాచారాలకు ఎక్కువ బలి అవుతున్నారు. పెచ్చరిల్లిన లింగ భేదం హింసకు నివారణ ఉపాయాలు కనుగొనే దిశలో, ఇంతకు ముందు సామాజిక కార్యకర్తలు, హక్కుల ఉద్యమకారులు, పౌరసమాజాలు చేసిన మంచి ప్రయత్నాలు కొన్నిటిని ఇప్పుడు ప్రభుత్వాలే స్వయంగా పథకాల రూపంలో, చట్టసవరణల రూపంలో ముందుకు తెచ్చి, ప్రజా బాహుళ్యాన్ని వారి అభిప్రాయాలని పరిగణనలోకి తీసుకునే ప్రయత్నం ఎంతో కొంత చేస్తున్నాయనడంలో సందేహం లేదు. అదొక మంచి పరిణామం. అయితే ప్రభుత్వాల ఈ ప్రయత్నాలు పిల్లలు భద్రంగా బతికే హక్కును కాపాడటంలో ఎంత సఫలీకృతం అవుతాయి ఎక్కడ ఘోరంగా విఫలమవుతాయి అన్న ప్రశ్న అందరినీ వేధిస్తున్నది. రాజధాని నడిబొడ్డున కదిలే బస్సులో ఆరు గురు కామాంధులు ఒక అమ్మాయిని అత్యంత పాశవికంగా అఘాయిత్యం చేయడం, దేశమంతా ఉప్పెనలా కదిలి ప్రభుత్వాన్ని కదిలించిన సంఘటనల తర్వాత నిర్భయ చట్టం అమలులోకి వచ్చింది. అయినా దేశంలో ఇంకా అఘా యిత్యాలు ఆగడం లేదు. ఈమధ్యలో కూడా గుడి పూజారులు, చర్చి ఫాస్టరులు ఇంకా అనేక ఉన్నత పదవులలో ఉన్నవారు ఆడపిల్లమీద అఘా యిత్యాలు చేస్తున్న ఘటనలు సభ్య సమాజాన్ని తల దించుకునేలా చేస్తున్నాయి.

కారణాలను పరిశీలిస్తే.. తరాల తరబడి తరుముకొస్తున్న లింగ వివక్ష, ఇంటర్నెట్ తయారీ హింస, మార్కెట్ సంస్కృతికి తోడై ఆడపిల్లలపై హింస జడలు విప్పి వికృతరూపం దాల్చింది అని చెప్పక తప్పదు. ఆడపిల్లల జీవితాల్లో, లింగ వివక్ష , హింస, బతికే హక్కును కాలరాయటమే కాక, వారి అభివృద్ధికి గొడ్డలిపెట్టు లా తయారైంది. ఈ పరిస్థితుల నుంచి మన అమ్మల్ని, అమ్మాయిలని, భావి భారత పౌరులని కాపాడడానికి ఎన్ని వందల సీసీ కెమెరాలు అతికించాలి ఈ భారతావని చుట్టూ? సీసీ కెమెరాలతో సమస్యకి శాశ్వత పరిష్కారం దొరుకుతుందా? బాల్య వివాహాలని నిరోధిస్తూ బాల్య వివాహాల నిషేధ చట్టం, అత్యాచారాలను నిరోధిస్తూ నిర్భయ చట్టం, బాలకార్మిక వ్యవస్థని రూపుమాపడానికి బాలకార్మిక నిషేధ చట్టాలు వచ్చాయి. భద్రతతో బతికే హక్కును ప్రభుత్వాలు పిల్లలకు అందించడం అంటే చట్టాల్లో మార్పు తెస్తూ చట్టసభల్లో చర్చించి తమ పని పూర్తయింది అనుకుంటే చాలదు. తెచ్చిన మార్పు పిల్లల జీవితాల వరకు చేర్చ టానికి కావలసినంత చిత్తశుద్ధి ప్రభుత్వాలకూ వాటిని ప్రజాస్వామిక పరంగా పాలించడానికి ఎన్నుకోబడిన రాజకీయ వర్గాలకూ ఉండాలి. చట్టాలని సరైన పద్ధతిలో అమలు చేయడానికి కావలసినంత బడ్జెట్ కేటా యింపు, అవగాహన, ఆదరణ, నిబద్ధత, అమ్ముడు పోనితనం, జెండర్ స్పృహ మొదలైన లక్షణాలను ప్రభుత్వ విభాగాలతో పాటు, పోలీసు న్యాయ వ్యవస్థకూ అబ్బేలా చేయాల్సి న అవసరం ఎంతైనా ఉన్నది.

**-కాళంరాజు వేణుగోపాల్**
8106204412

## చైనా గురివిందనైజం!

కాశ్మీర్ విషయంలో చైనా వైఖరి గురివింద నైజాన్ని గుర్తు చేస్తున్నది. కాశ్మీర్ ప్రాంతం వేల సంవత్సరాల నుంచీ భారతదేశంలో భాగం... ఇప్పటి పాకిస్థాన్ మాదిరిగానే. కాశ్మీర్ మహారాజు బేషరతుగా భారతదేశంలో తన సంస్థానాన్ని విలీనం చేశారు. దాంతో పాకిస్థాన్ కాశ్మీర్ దురాక్రమణకు పాల్పడింది. తన భూభాగాన్ని రక్షించుకొని, దక్కించుకొనే హక్కు భారతదేశానిదే. ఇందులో మరో దేశ జోక్యానికి తావులేదు. చైనాలాగా భారత్ పొరుగు దేశాల్ని దురాక్రమించటంలేదు. ఉఘైర్ ముస్లిములను అత్యంత పాశవికంగా హింసిస్తూ, అణిచివేస్తున్న చైనాలాగా, పాకిస్థానీ ప్రేరిత ఉగ్రవాదుల విషయంలో వ్యవహరించలేకపోవటమే భారత్ తప్పిదం. ఇక చైనాకంటే ప్రాచీన చరిత్ర, నాగరికత, సంస్కృతి గల టిబెట్ దేశాన్ని ఎట్లా దురాక్రమించి, టిబెటియన్లను రూపుమాపే ప్రయత్నం చేస్తోందో ప్రపంచానికంతటికీ తెలిసిన విషయమే! చుట్టూ ఉన్న పొరుగు దేశాలతో, సరిహద్దుల పేరుతో ఘర్షణలు పడే చైనా, తన దేశంలోని పౌరుల కనీస వాక్స్వేచ్ఛకు సంకెళ్ళు వేసింది. హాంకాంగ్‌లో ప్రజావాణిని సామ్యవాద కబంధహస్తంతో నొక్కేయాలని ప్రయత్నిస్తోంది. ఇట్లాంటి చైనా -స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకు, ప్రజాస్వామ్యానికి పుట్టినిల్లైన భారతదేశ అభివృద్ధిని ఓర్వలేక, పాకిస్థాన్‌కు వంతపా డుతోందన్నది నిజం. చైనా వికృత నైజాన్ని, దురాక్రమణను, నిరంకుశత్వాన్ని ప్రపంచానికి తెలియజెప్పే రీతిలో మనదేశంలోని ప్రజాస్వామ్యవాదు లు, పౌర మానవ హక్కుల సంఘాలు కృషి చెయ్యాలని కోరుకుం టున్నాను.

**-వీరుభొట్ల పేరయ్యశాస్త్రి**
విజయవాడ

## మధ్యాహ్న భోజనంలో పెరుగుండాలి

గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం అమలులో ఉంది. నాసిరకం భోజనం నుంచి పౌష్టికాహారం అందించే దిశగా అనేకసార్లు భోజన పథక మెనూని మార్పులు చేర్పులు చేసి సవరించటం జరిగింది. వారానికి 5 కోడి గుడ్లు అందిస్తూ పప్పు, ఆకు కూరలు వడ్డిస్తున్నారు. కానీ పాఠశాలలకి అందించే బియ్యం నాణ్యమైనవిగా ఉండడం లేదు. అన్నం బాగుంటేనే ఏ కూర కలుపుకున్నా రుచిగా అనిపిస్తుంది. నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయాలి. అంతే కాకుండా పిల్లలకు ఒక్క కూర అన్నం మాత్రమే తిని లేస్తే అది అర్ధ భోజనంతో సమానం. కావున ప్రభుత్వం పిల్లలకు కూర అన్నంతో పాటు పెరుగు కూడా వడ్డించేదిశగా చర్యలు తీసుకోవాలి. అప్పుడే సమతులాహారం అందుతుంది.

**-పారేపల్లి సత్యనారాయణ**
దేవులపల్లి, 9676441513

## వైమానిక దళం సేవలు ఎనలేనివి

ఆకాశ మార్గంలో ఎగురుతూ, సరిహద్దులలో నిరంతరం పహారా కాయడమే కాక యుద్ధ సమయాలలో శత్రు శిబిరాలలోకి దూసుకుపోయి బాంబుల వర్షం కురిపించగల సత్తా భారత వాయుసేనకు ఉంది. వరదలు, భూకంపాలు వంటి ప్రకృతి వైపరీత్యాలలో సైతం సాహసోపేతమైన సేవలనం దించేవాయుసేన భారత రక్షణ రంగంలో కీలకపాత్ర పోషిస్తున్నది. రాయల్ ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అనే పేరుతో ఈ వైమానికదళం 8.10.1932న స్థాపించబడింది. పాకిస్తాన్‌తో, చైనాతో జరిగిన యుద్ధాలలో ఈ వాయుసేనదే ప్రధాన పాత్ర. ప్రస్తుతం ఈ సేనలో 1.3 లక్షల మంది సైనికులు ఉన్నారు. 937 యుద్ధ విమానాలు, 150 సాయుధ హెలీకాప్టర్లు, 255 ట్రాన్స్‌పోర్ట్ యుద్ధ విమానాలు ఉన్నాయి. ఎటాకింగ్ ఎయిర్ క్రాఫ్ట్‌లో మిగ్-21, మిగ్-23, జాగ్వార్, మిరాజ్, తలదస్, మొదలైన అనేక యుద్ధ విమానాలు ఉన్నాయి. ఆకాష్ బ్రహ్మోస్, కావేరి, పృథ్వీ, తేజస్ మొదలైన క్షిపణులు ఉన్నాయి. రష్యా దేశ పరిజ్ఞానంతో కూడిన అత్యంత ఆధునికమైన సుఖోయ్ యుద్ధ విమానాన్ని కూడా భారత వాయుసేన సమకూర్చుకుంది. ప్రతిఏటా వైమానిక దళ వ్యవస్థాపక దినోత్సవం రోజున వివిధ కేంద్రాలలో ప్రదర్శింపబడే యుద్ధ విన్యాసాలు ప్రజలను ఆకట్టుకుంటున్నాయి. మన వైమానిక దళానికి ఎంతో కీర్తి ప్రతిష్టలు ఉన్నాయి. ధైర్యం, సాహసంతో ప్రాణాలకు తెగించి వైమానిక దళ సిబ్బంది మన దేశాన్ని కంటికి రెప్పలా కాపాడుతున్నారు. వారి సేవలు వెలకట్టలేనివి. మనమందరం వారి సేవలను గౌరవిద్దాం, కొనియాడదాం, విధి నిర్వహణలో అమరులైనవారికి నివాళులు అర్పించి, త్యాగాలను స్మరించుకుందాం.

**-కామిడి సతీష్‌రెడ్డి**
జడలపేట

ఫాసిస్ట్(పాపిస్టు) పాలనలో
## ఉన్మాద మూకదాడులు!

కవిత

లైంగిక హత్యలు.
అన్యాయపు
వికృత అసమానతలను
ప్రశ్నించినా..
కైకట్టినా..
కవిత్వం అల్లినా..
ఆర్టికల్స్‌గా అక్షరాలు పేర్చినా..
లేఖగా విన్నవించినా...

దోషులమే..!
రాజద్రోహులమే..!!
అర్బన్ నక్సలైట్లమే..!!!

దానికి
సినీ ప్రముఖులు..
చరిత్రకారులు..
అడ్వకేట్స్.
మేధావులు..
కవులు..రచయితలన్న
మినహాయింపు కాదు..
డెబ్బైయేళ్ళ వృద్ధాప్యం..
తొంభైశాతం అంగవైకల్యం ఉన్నా..
మానవత్వం లేదు...

ఇప్పుడంతా
సమూహ ఒంటరి బందీలమే..
నేడు
నువ్వో.. నేనో..
దోష, రాజద్రోహులం
కాకముందే
సామూహిక
సమిష్టిగా కొట్లాడాల్సిందే...

**-గడ్డం శ్యామ్**
పిడిఎస్‌యు ప్రధాన
కార్యదర్శి, ఓయూ

# ఆరో రోజూ అవే కష్టాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : డిమాండ్ల పరిష్కారం కోరుతూ ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మె ఆరవ రోజుకు చేరుకుంది. సమ్మెపై ఉక్కుపాదం మోపిన ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించి ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. అయినప్పటికీ ప్రయాణికుల ఇక్కట్లు తీరడం లేదు. పండుగల నేపథ్యంలో గ్రామాలకు వెళ్ళిన వారంతా పట్టణాలకు చేరుకుంటున్నారు. ఎలాగోలా గ్రామాల నుంచి పట్టణానికి వచ్చిన వారికి ప్రయాణ సౌకర్యం కరువైంది. ఇదే అదనుగా ప్రైవేట్ ఆపరేటర్లు ప్రయాణికుల నుంచి అందినంత దండుకుంటున్నారు. మరో వైపు ప్రయాణికులకు సరిపోయినన్ని బస్సులను తిప్పుతున్నామని చెబుతున్న ఆర్టీసీ యాజమాన్యం గతంలో తిరిగే ట్రిప్పులెన్నీ, ఇప్పుడు తిరుగుతున్న ట్రిప్పులెన్ని అన్న వివరాలను వెల్లడించలేకపోతోంది.

సమ్మెలో ఉన్న కార్మికుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ వైఖరిని నిరసిస్తూ వామపక్షాలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు నిరసనలను హోరెత్తిస్తున్నాయి. ఆందోళనలో భాగంగా ఆర్టీసీ కార్మికులు గురువారం నిరసన ప్రదర్శనలకు దిగారు. రాష్ట్రంలోని డిపోలన్నింటి ముందు కార్మికులు, ప్రజా సంఘాల నేతలు నిసరన ప్రదర్శనలు నిర్వహించి తమ ఆందోళనను వ్యక్తం చేశారు. కొన్ని చోట్ల కార్మికులు ప్రదర్శనలను కూడా నిర్వహించారు.


హన్మకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్టీసీ జేఏసీ

### గుండెపోటుతో ఇద్దరు మృతి

హెచ్‌సీయూ డిపోకు చెందిన డ్రైవర్ షఏర్ ఖలీల్‌మియా (50) సమ్మెలో ఉన్న కార్మికులందరి ఉద్యోగాలు కోల్పోయినట్లేనని ప్రభుత్వం ప్రకటించడంతో ఆందోళనతో గడుపుతున్నారు. బుధవారం రాత్రి ఖలీల్ మియాకు గుండెపోటు రావడంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. బోడుప్పల్‌కు చెందిన కొమరయ్య (57) గురువారం ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో చంగిచర్ల డిపో నుంచి ఉప్పల్ డిపో వరకు నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. ఆ తర్వాత ఇంటికి వెళ్ళిన ఆయన అస్వస్థతకు గురవడంతో కుటుంబ సభ్యులు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు.

### హన్మకొండలో ఉద్రిక్తత

ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతుగా చేపట్టిన ర్యాలీలోని మహిళల పట్ల పోలీసులు అనుసరించిన తీరుతో హన్మకొండలో కొంత ఉద్రిక్తత తలెత్తింది. హన్మకొండ చౌరస్తా నుంచి అమర వీరుల స్థూపం వరకు మహిళా కార్మికులు ర్యాలీని నిర్వహించారు. అదాలత్ సెంటర్‌లోని అమరవీరు స్థూపం వద్ద ర్యాలీని అడ్డుకునే క్రమంలో పోలీసులు మహిళా కార్మికుల పట్ల అనుచితంగా ప్రవర్తించడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలీసులు, మహిళా కార్మికుల మధ్య జరిగిన తోపులాటలో అయిదుగురు మహిళా కార్మికులు గాయాలపాలయ్యారు.

## తప్పని తిప్పలు

తమ డిమాండ్ల పరిష్కారానికి ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మెతో ప్రయాణీకులను కష్టాలు వెంటాడుతున్నాయి. అష్టకష్టాలు పడుతూ ప్రయాణీకులు హైదరాబాద్, వివిధ పట్టణాల నుంచి పండుగకు సొంతూళ్లకు వెళ్లారు. పండుగకు వెళ్లేటప్పుడు డబుల్ చార్జీలతో ప్రయాణీకుల నుంచి అందిన కాడికి దండుకున్న ప్రయివేటు ఆపరేటర్లు, తిరుగు ప్రయాణంలోనూ ప్రయాణికులపై అధిక ఛార్జీలు వసూలు చేశారు. హన్మకొండ నుంచి హైదరాబాద్ వరకు సాధారణంగా అయితే రూ.200 తీసుకునే ట్యాక్సీ, క్యాబ్‌లు రూ. 400 నుంచి రూ.500 దాకా వసూలు చేశారని ప్రయాణీకులు ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా గురువారం నుంచి షెడ్యూల్ ప్రకారం బస్సులు నడుపుతామని రవాణా మంత్రి పువ్వాడ అజయ్ చేసిన ప్రకటన అమలుకు నోచుకోలేదు. బస్సుల కోసం ప్రయాణీకులు వేచి చూడాల్సి వచ్చిం ది. అయితే... గంటల తరబడి వేచి చూడలేదని, అర్ధగంట, 40 నిమిషాల వ్యవధిలో బస్సు దొరికిందని ప్రయాణీకులు చెప్పారు. ఆర్టీసీ సమ్మెతో హైదరాబాద్‌లో ఆటో వాలాలు మీటర్‌ను ఉపయోగించటం మర్చిపోయారు. నోటిమాట ద్వారా చెబుతూ అధిక మొత్తంలో ఛార్జీలను వసూలు చేస్తున్నారని ప్రయాణీకుల నుంచి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

# రోడ్లపై బస్సులేవీ?

- నివేదిక అస్పష్టం • పూర్తి వివరాలతో మళ్లీ ఇవ్వండి
- ఆర్టీసీ సమ్మెపై ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మెపై దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంపై హైకోర్టు మరోసారి విచారణ చేపట్టింది. సమ్మె వ్యవహారంలో తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ ముఖ్యకార్యదర్శి సమర్పించిన నివేదిక అస్పష్టంగా ఉందని పేర్కొంటూ హైకోర్టు అసంతృప్తిని వ్యక్తం చేసింది. కోర్టు పరిశీలనకు ఇచ్చిన ఫొటోలను చూస్తే..బస్సులన్నీ డిపోలకే పరిమితమైనట్లుగా ఉందని హైకోర్టు వ్యాఖ్యానించింది. మిగతా రోజుల్లో తాము కోర్టుకు వచ్చే సమయంలో రోడ్లపై పెద్ద సంఖ్యలో బస్సులు కనిపించేవని, ఈ రోజు బస్సులు పెద్దగా కనిపించలేదని హైకోర్టు పేర్కొంది. సమ్మె కారణంగా వారం రోజుల నుంచి బస్సుల కొరత, అధిక చార్జీల వసూళ్లు, బస్సు పాసులను అనుమతించడం లేదంటూ సామాజిక మాధ్యమాల్లో వస్తున్న ఫిర్యాదులను పరిష్కరించాలని హైకోర్టు సూచించింది. సిబ్బంది కొరతను అధిగమించేందుకు ఎంత మంది డ్రైవర్లు, కండక్టర్లను నియమించారో చెప్పలేదని హైకోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. పూర్తి వివరాలతో మరోసారి మెరుగైన కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. సమ్మె కాలంలో ఏర్పాటు చేసిన వాహనాల్లో ప్రయాణించేందుకు బస్సు పాసులున్న విద్యార్థుల్ని అనుమతించాలని కోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎ.రాజశేఖర్ రెడ్డి, జస్టిస్ ఏ అభిషేక్ రెడ్డితో కూడిన వెకేషన్ డివిజన్ బెంచ్ గురువారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ ఈ నెల 15కి వాయిదా వేసింది. సమ్మె విరమించాలని ఆర్టీసీ ఉద్యోగ సంఘాల సంయుక్త కార్యాచరణ కమిటీని (జేఏసీ) ఆదేశించాలని అభ్యర్థిస్తూ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. హైకోర్టుకు దసరా సెలవులు కావడంతో హౌస్ మోషన్ రూపంలో ఆర్ సుబేందర్ సింగ్ అనే రీసెర్చ్ స్కాలర్ ఈ ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేసిన విషయం తెలిసిందే.

ఈ సందర్భంగా పిటిషనర్ తరపు న్యాయవాది పివి.కృష్ణయ్య వాదనలు వినిపిస్తూ..ఆర్టీసీ సమ్మె కారణంగా సామాన్యులు ఇబ్బంది పడ్తున్నారని తెలిపారు. సమ్మె పేరుతో సామాన్య ప్రజల కనీస వసతులను కాలరాసే అధికారం ఆర్టీసీ కార్మికులకు లేదని సుప్రీంకోర్టు, హైకోర్టు వెలువరించిన తీర్పులు స్పష్టం చేసినట్లు విన్నవించారు. సమ్మె వెనుక ప్రభుత్వ రహస్య అజెండా ఉందన్నారు. అందువల్ల సమ్మెను అక్రమమైనదిగా ప్రకటించాలని, సమ్మెను విరమించాలని కార్మికులను ఆదేశించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ తరపున సీనియర్ న్యాయవాది డి.ప్రకాశ్ రెడ్డి వాదనలు వినిపిస్తూ..తమ డిమాండ్లను పరిష్కరించాలని అభ్యర్థిస్తూ వినతి పత్రాలు సమర్పించినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడంతో విధిలేని పరిస్థితుల్లోనే కార్మికులు సమ్మె చేస్తున్నారని విన్నవించారు. సమ్మె నిబంధనల మేరకు సెప్టెంబర్ 11న సమ్మె నోటీసులు ఇచ్చినట్లు విన్నవించారు. దీంతో చర్చలు జరిపేందుకు ప్రభుత్వం వాయిదాలు వేసిందన్నారు. పైగా చర్చలు జరిపేందుకు వేసిన త్రిసభ్య కమిటీని ప్రభుత్వం రద్దు చేసిందని తెలిపారు. సంఘం పెట్టుకునే హక్కు కార్మికులకు రాజ్యాంగం కల్పించిందని విన్నవించారు. ఈ వ్యాజ్యంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలుకు గడువు కావాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ జేఏసీ తరపు న్యాయవాది బి.రచనారెడ్డి వాదనలు వినిపిస్తూ...ఆర్టీసీ కార్మికులకు సంబంధించిన రూ.545 కోట్ల భవిష్య నిధి, సీసీఎస్ నిధులను ప్రభుత్వం వినియోగించుకుందని, దీంతో అత్యవసర సమయంలో కార్మికులు సీసీఎస్ రుణాలు పొందే అవకాశం లేకుండా పోయిందని తెలిపారు. కార్మికులకు సెప్టెంబర్ నెల జీతాలను సైతం చెల్లించలేదన్నారు. సమ్మెకు దిగేందుకు ముందుగానే సెప్టెంబర్ 11 ప్రభుత్వానికి సమ్మె నోటీసులు ఇచ్చినట్లు, చట్ట ప్రకారం సమ్మె చేస్తున్నట్లు విన్నవించారు.


అవసరమైతే మరిన్ని బస్సులు: ప్రభుత్వం

ఆర్టీసీ సమ్మెపై దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంలో ప్రజాహితం కొరవడిందని తెలంగాణ అడ్వకేట్ జనరల్ బీఎస్.ప్రసాద్, అదనపు అడ్వకేట్ జనరల్ జె.రామచంద్రరావు వాదనలు వినిపించారు. కార్మిక సంఘాలతో కుమ్మక్కై పిటిషనర్ ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారని తెలిపారు. దసరా పండుగ సమయంలో ప్రజల ఇబ్బందులను పట్టించుకోకుండా చేస్తున్న సమ్మె చట్ట విరుద్ధమని విన్నవించారు. ప్రయాణికుల సౌకర్యం కోసం నడుపుతున్న బస్సులను కార్మికులు అడ్డుకుంటున్నారని తెలిపారు. తాత్కాలిక ప్రాతిపదికన డ్రైవర్లు, కండక్టర్ల నియామకం కోసం నోటిఫికేషన్ జారీ చేసినట్లు విన్నవించారు. డ్రైవర్ పోస్టుల కోసం దాదాపు 3 వేల మంది దరఖాస్తు చేసినట్లు తెలిపారు. వారి డ్రైవింగ్ లైసెన్సులు, అనుభవం, తదితర వివరాలను డిపో మేనేజర్లు, ఆర్టీఏ అధికారులు పరిశీలిస్తున్నారని విన్నవించారు. ఈ దశలో ధర్మాసనం జోక్యం చేసుకుంటూ...అనుభవం లేని డ్రైవర్ల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని పిటిషనర్ తరపు న్యాయవాది విన్నవించారని గుర్తు చేసింది. దీనిపై అడ్వకేట్ జనరల్ బదులిస్తూ..సదరు డ్రైవర్లకు ముందుగా టెస్ట్ డ్రైవ్ నిర్వహించిన తర్వాతే విధుల్లోకి తీసుకుంటున్నట్లు తెలిపారు. అన్ని డిపోల్లో అవసరమైన డ్రైవర్లు, కండక్టర్లు విధులు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నారని విన్నవించారు. ఈ దశలో ధర్మాసనం స్పందిస్తూ..అయితే ప్రయాణీకులే లేరా అని ప్రశ్నించింది. అవసరమైతే మరికొన్ని బస్సులు నడిపేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఏజీ విన్నవించారు. సమ్మె రోజు నుంచి నడిపిన వాహనాల వివరాలను ఆయన తెలిపారు.

# త్వరలో అఖిలపక్ష కార్యాచరణ

- కార్మికులకు అండగా ఉంటాం: కోదండరాం, మంద కృష్ణ



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతుగా అఖిలపక్షం భవిష్యత్ కార్యాచరణను త్వరలో ప్రకటిస్తామని టీజేఎస్ అధినేత ప్రొ. కోదండరాం తెలిపారు. గురువారం ఎస్‌వీకేలో కార్మిక జేఏసీతో అఖిలపక్ష నేతలు సమావేశమయ్యారు. అనంతరం ప్రొ. కోదండరాం మాట్లాడుతూ, సమావేశంలో సమ్మెకు మద్దతుగా అఖిలపక్షం అనుసరించాల్సిన భవిష్యత్ కార్యాచరణపై చర్చించామన్నారు. అఖిలపక్షంలోని మరికొన్ని పార్టీలు హాజరుకానందున శనివారం మరోసారి సమావేశమై రాష్ట్ర బంద్ తేదీని ప్రకటిస్తామన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ... రాష్ట్రవాప్తంగా సమ్మెకు మద్దతుగా సీపీఐ శ్రేణులు కార్యక్రమాలు చేపడుతాయన్నారు. హుజూర్‌నగర్ ఉప ఎన్నికలో అధికార టీఆర్ఎస్‌కు మద్దతు అంశంపై ప్రశ్నించగా ఎలాంటి సమాధానం చెప్పలేదు.

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణమాదిగ మాట్లాడుతూ... ఆర్టీసీ సమ్మెకు అఖిలపక్షం మద్దతుగా నిలిచినా తోటి కార్మికులు అన్న కనీస సానుభూతి కూడా చూపకుండా టీఎన్‌జీవో, టీజీవో సంఘాలు వెన్నుపోటు పొడుస్తున్నాయని ధ్వజమెత్తారు. ఉద్యోగసంఘం నేతగా ఎదిగి... కేబినెట్‌లో కొనసాగుతున్న మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆర్టీసీ కార్మికుల సమ్మెపై నోరు మెదపకపోవటం తగదన్నారు. ఇవాళ 20శాతం ప్రయివేటీకరణ అంటున్న సీఎం రెండు మూడు రోజుల్లో 80శాతం అని ప్రకటిస్తారని కార్మికులను హెచ్చరించారు. సీపీఎం, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నేతలు సమ్మెకు మద్దతుగా నిరసన కార్యక్రమాల్లో పాల్గొంటామన్నారు. ఉమ్మడిగా అఖిలపక్షం కార్యాచరణలో పాల్గొంటూనే పార్టీ పరంగా అన్ని మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని పోటు రంగారావు ప్రకటించారు.

ఆర్టీసీ పరిరక్షణ ఉద్యమంలోనూ పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క పిలుపు నిచ్చారు. కాగా... గురువారం నాటి అఖిలపక్ష సమావేశానికి కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ పార్టీల ప్రతినిధులు హాజరుకాక పోవటంతో మరోసారి సమావేశం కావాలని నిర్ణయించారు.

## సమ్మె యథాతథం

- ఆర్టీసీ కార్మిక జేఏసీ

ఆర్టీసీ సమ్మె యథాతథంగా కొనసాగుతుందని, సమ్మె మొదలై గురువారానికి ఆరు రోజులయిందని కార్మిక జేఏసీ కన్వీనర్ అశ్వత్థామ రెడ్డి ప్రకటించారు. నిర్బంధాలకు, అక్రమ అరెస్టులకు, ప్రలోభాలకు తలొగ్గకుండా మొక్కవోని ధైర్యంతో సమ్మెను కొనసాగించాలని కార్మికులకు పిలుపునిచారు. భవిష్యత్ కార్యాచరణపై గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అఖిలపక్షం నేతలతో కార్మిక జేఏసీ నేతలు సమావేశమ య్యారు. అనంతరం జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి మాట్లా డుతూ శుక్రవారం రాష్ట్రంలోని అన్ని డిపోల పరిధిలో ఉన్న ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులకు వినతిపత్రం అంద జేయాలని కార్మికులకు సూచించారు. శనివారం అన్ని డిపోల పరిధిలోని ప్రముఖుల విగ్రహాల ఎదుట మౌనదీ క్షలు చేయాలని పిలుపు నిచ్చారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతు ఇవ్వాలని టీఎన్ జీవో, టీజీవో నేతలతోపాటు అన్ని ట్రేడ్ యూనియన్లను అశ్వత్థామరెడ్డి కోరారు.

టీజీవో, టీఎన్‌జీవో నేతలు డీఏ పెంపుకు అమ్ముడుపోరని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం చర్చలకు పిలిస్తే వెళ్లేందుకు సిద్ధమని ప్రకటించారు. తెలంగాణ ఎంప్లాయిస్ యూనియన్ పదవుల్లో ఉండి సమ్మెకు మద్దతు తెలుపని అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నేతలతో తమకు ఎలాంటి సంబంధం లేదన్నారు. సమ్మెకు మద్దతు విషయమై అధికార టీఆర్ ఎస్ ఎమ్మెల్యేలు ఎవరు మద్దతిస్తే వారితోనే మాట్లాడతామని కరాఖండిగా చెప్పారు. ఆర్టీసీలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ రానివ్వండి... చట్ట ప్రకారం, కోర్టుల్లో ఆ ప్రక్రియను ఎదుర్కొంటామన్నారు. సమ్మె చేస్తున్న కార్మికులపై పోలీసులు దమన నీతిని ప్రయోగిం చటం సరికాదన్నారు. కాగా... సమ్మెపై ప్రభుత్వం నివేదికను హైకోర్టు తప్పుబట్టటాన్ని స్వాగతించారు. ఆర్టీసీ కార్మికులను అరెస్టు చేయటాన్ని కార్మిక జేఏసీ నేత రాజిరెడ్డి ఖండించారు.

## ఆర్టీసీని ప్రైవేట్‌పరం చేసే కుట్ర

- సమ్మెపై గవర్నర్‌ను కలిసిన బీజేపీ బృందం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో విలువైన ఆస్తులున్న ఆర్టీసీని ప్రైవేటు పరం చేసేందుకే ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ సమ్మె పరిస్థితిని తీసుకువచ్చిందని బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డా. కె.లక్ష్మణ్ ఆరోపించారు. 40 రోజుల క్రితమే కార్మికులు సమ్మె నోటీసు ఇచ్చినా సకాలంలో ప్రభుత్వం స్పందించలేదని, ఇప్పుడు 48 వేల మంది కార్మికులు ఆందోళనలో పాల్గొన్నారని, అటు ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని, దీనికి ప్రభుత్వ వైఖరే కారణమని ఆయన విమర్శించారు. ఆర్టీసీ కార్మికులకు బీజేపీ అండగా ఉంటుందని, వారి సమ్మెకు మద్దతు ఇస్తున్నామని ప్రకటించారు. సమ్మె నేపథ్యంలో గురువారం లక్ష్మణ్ సారథ్యంలో బీజేపీ బృందం గవర్నర్ తమిళిసై సౌందర రాజన్‌ను కలిశారు. తాజా పరిస్థితులను వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. ఆర్టీసీ కార్మికుల సమ్మె, ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను గవర్నర్‌కు నేతలు వివరించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. కార్మికుల డిమాండ్లన్నీ కొత్తవేమీ కాదని, 2014, 2018 ఎన్నికల సందర్భంగా కేసీఆర్ ఇచ్చిన హామీలేనని పేర్కొన్నారు. గతంలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని కేసీఆర్ డిమాండ్ చేశారని, ఇప్పుడు అదే డిమాండ్‌ను కార్మికులు చేస్తున్నారన్నారు. గవర్నర్‌ను కలిసిన వారిలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లు ఇంద్రసేనారెడ్డి, ఎంఎల్‌సీ ఎన్. రాంచందర్‌రావు, మాజీ ఎంపీలు వివేక్ వెంకటస్వామి, ఏపీ జితేందర్‌రెడ్డి, మాజీ ఎంఎల్‌సీ బి. మోహన్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు జి. ప్రేమేందర్‌రెడ్డి, చింతాసాంబమూర్తి, జి. మనోహర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు మల్లారెడ్డి, అధికార ప్రతినిధి ప్రకాష్‌రెడ్డి, పార్టీ నేత టి. వీరేందర్‌గౌడ్ తదితరులున్నారు.

## ఓఎంసీ కేసు విశాఖకు బదిలీ చేయొద్దు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఓబుళాపురం గనుల లీజుల అక్రమాల కేసులో సీబీఐ వాదన మార్చింది. ఓఎంసీ కేసును విశాఖకు బదిలీ చేయవద్దని, హైదరాబాద్ సీబీఐ కోర్టులోనే విచారణ జరపాలని కోరింది. లీజుల కేటాయింపు అక్రమాల కుట్ర ఎక్కువగా హైదరాబాద్‌లోనే జరిగిందని నివేదించింది. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రైవేటు వ్యక్తులు హైదరాబాద్‌లోనే ఉండి నేరానికి పాల్పడ్డారని తెలిపింది. విశాఖ సీబీఐ కోర్టుకు బదిలీ చేస్తే, కేసు విచారణ మరింత ఆలస్యమవుతుందని పేర్కొంది. వాదనలు విన్న సీబీఐ న్యాయస్థానం విచారణను 18కి వాయిదా వేసింది.

## తెలంగాణ కేడర్ ఐఏఎస్‌లకు అదనపు కార్యదర్శి హోదా

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ క్యాడర్ నుంచి ఇద్దరు సీనియర్ ఐఏఎస్ అధికారులు అరవింద్ కుమార్, అశోక్ కుమార్‌లను అదనపు కార్యదర్శి హోదాలోకి సిబ్బంది వ్యవహారాల శాఖ ఎంప్యానెల్ చేసింది. తెలంగాణ ప్రభుత్వ పారిశ్రామిక విధాన రూపకల్పనతో పాటు కీలక విధాన నిర్ణయాల్లో అరవింద్ కుమార్ క్రియాశీలక పాత్ర పోషించారు. అశోక్ కుమార్ ఈ ఏడాది జనవరిలో నేషనల్ వాటర్ మిషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ ఇద్దరూ అధికారులు 1991 బ్యాచ్ వాళ్ళే కావడం గమనార్హం.

# తాత్కాలిక సిబ్బంది చేతివాటం

- ఇద్దరిపై చీటింగ్ కేసు • ఆర్టీసీ బస్సులో నల్గొండ ఎస్పీ తనిఖీ

నల్గొండ (టౌన్)/దేవరకొండ, ప్రభ న్యూస్ : కార్మికుల సమ్మె నేపథ్యంలో ఆర్టీసీ బస్సులు నడుపుతున్న తాత్కాలిక సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ప్రయాణికుల నుంచి ఎక్కువమొత్తంలో ఛార్జీలు వసూలు చేస్తున్నారు. ఒక్క రూపాయి తీసుకున్నా ఒప్పుకోబోమని ప్రభుత్వం హెచ్చరించిన నేపథ్యంలో నల్గొండ ఎస్పీ ఏవీ రంగనాథ్ గురువారం తనిఖీలు చేపట్టారు. నల్గొండ, నార్కెట్‌పల్లి రూట్‌లో తాత్కాలిక సిబ్బంది నడుపుతున్న బస్సులను ఆపి లోపలికి వెళ్లి ప్రయాణీకులతో మాట్లాడారు. ఎక్కువ ఛార్జీలు వసూలు చేశారని ఫిర్యాదులు రావడంతో యాదగిరిగుట్టకు చెందిన రామాంజనేయులు అనే కండక్టర్‌ను తొలగించి 420కేసు నమోదు చేయాలని ఎస్పి ఆదేశించారు. ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న మరో బస్సులో ఖమ్మం డిపోకు చెందిన కండక్టర్ నాగేశ్వర్‌రావు కూడా అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు రుజువు కావడంతో అతనిపై చీటింగ్ కేసు నమోదు చేశారు. ప్రైవేట్ ఉద్యోగులు అధిక చార్జీలు వసూలు చేస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్పి ఏవీ రంగనాథ్ హెచ్చరించారు. దసరా సెలవులు ముగుస్తున్న క్రమంలో శని, ఆదివారాలలో ప్రయాణికుల రద్దీ పెరిగే అవకాశం ఉన్నందున బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులకు టిక్కెట్ ధరకంటే ఒక్కరూపాయి కూడా ఎక్కువ తీసుకున్నా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు



### దేవరకొండలో....

ఆర్టీసీ కార్మికుల సమ్మెతో తాత్కాలికంగా కండక్టర్లు, డ్రైవర్లు నియమించుకొని ప్రయాణికులకు ఇబ్బందులు కల్గకుండా ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే కండక్టర్లు అదనంగా వసూలు చేస్తున్నారనే ఫిర్యాదు మేరకు ఒక తాత్కాలిక కండక్టర్ పై కేసు నమోదు చేసి విధుల నుంచి తొలగించినట్లు ఎస్‌హెచ్‌వో ఆదిరెడ్డి తెలిపారు.

## యూరియా పంపిణీలో అక్రమాలపై విచారణ



హైదరాబాద్, ఆంధ్రప్రభ : యూరియా పంపిణీలో అక్రమాలు జరిగాయని వచ్చిన వార్తాకథనాలపై వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విచారణకు ఆదేశించారు. ఈ వ్యవహారంపై విజిలెన్స్ విచారణ జరిపించాలని ఆయన వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారధిని కోరారు. యూరియా పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులు యూరియాతో ఇబ్బంది పడకుండా చూడాలని ఇందుకు సంబంధించి ప్రతిరోజూ యూరియా రవాణా, పంపిణీపై సమీక్ష జరపాలని ఆదేశించారు. యూరియాను పాయింట్ ఆఫ్ సేల్ ద్వారా అమ్మకాలు జరుపుతున్నా అక్రమాలు జరగడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తంచేశారు. యూరియా పంపిణీలో అక్రమాలు జరిగినట్టు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, విధుల నిర్వహణలో అలసత్వం ప్రదర్శించిన వారిని ఉపేక్షించవద్దని కోరా రు. ప్రభుత్వ లక్ష్యాలకు తూట్లు పొడిచేవారు ఎంతటి వారైనా వదిలేది లేదన్నారు.

## టోల్‌ప్లాజా వద్ద ట్రాఫిక్ జామ్

చౌటుప్పల్, ప్రభ న్యూస్ : నల్గొండ జిల్లా, చౌటుప్పల్ మండలంలోని 65వ నెంబర్ జాతీయ రహదారి పొడవునా బుధవారం సాయంత్రం నుంచి గురువారం తెల్లవారుజాము వరకు వాహనాల ప్రవాహంతో నిండిపోయింది. పంతంగి టోల్ ప్లాజా వద్ద ట్రాఫిక్ జామ్ అయ్యింది. దసరా పండుగ కోసం హైదరాబాద్‌లో ఉండే ప్రజలంతా తమ పిల్లలతో కలిసి తమతమ సొంత గ్రామాలకు తమ సొంత వాహనాలలో వెళ్లి మరల గ్రామాల నుంచి హైదరాబాద్‌కు ఒకేసారి తరలిరావడంతో వాహనాల రద్దీ పెరిగి టోల్ ప్లాజా వద్ద, జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్ అయింది. ఎడతెరిపి లేకుండ వాహనాలు వెళుతుండటంతో రోడ్డు దాటడానికి ప్రజలు, ప్రయాణికులు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ట్రాఫిక్ క్లియర్ చేయడం కోసం ఏసీపీ సత్తయ్య ఆధ్వర్యంలో పోలీసులు జాగ్రతలు తీసుకున్నారు.



## ఆయుష్మాన్ కంటే ఆరోగ్యశ్రీయే భేష్

- వైద్య, ఆరోగ్య మంత్రుల సమావేశంలో మంత్రి ఈటల




న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : వైద్య, ఆరోగ్య రంగాల్లో శరవేగంగా పురోగమిస్తున్న రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహించాలని తెలంగాణ రాష్ట్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. ఢిల్లీలో జరిగిన సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ సమావేశానికి హాజరైన ఆయన, వైద్యారోగ్య రంగంలో తెలంగాణ రాష్ట్రం సాధించిన ప్రగతిని కేంద్ర ప్రభుత్వం సహా మిగతా అన్ని రాష్ట్రాలకు వివరించి చెప్పారు. మూడున్నరేళ్ల తర్వాత కేంద్ర వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో జరిగిన అన్ని రాష్ట్రాల వైద్యారోగ్య శాఖ మంత్రుల సమావేశానికి కో-చైర్మన్‌గా ఈటల రాజేందర్ నాయకత్వ బాధ్యతలు నిర్వర్తించారు. కేంద్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హర్షవర్ధన్ చైర్మన్‌గా, ఈ శాఖ సహాయ మంత్రి అశ్విన్ కుమార్ వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కార్యక్రమాల గురించి వివరిస్తూ కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చెప్పుకుంటున్న ఆయుష్మాన్ భారత్ కంటే రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్యశ్రీ అనేక విధాలుగా మెరుగ్గా ఉందని పేర్కొన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకంలో కేవలం కొన్ని రకాల రుగ్మతలకు మాత్రమే వైద్యం అందిస్తుండగా, ఆరోగ్యశ్రీ పథకం కింద గుండె మార్పిడి, మూత్ర పిండాల మార్పిడి సహా అనేక ఖరీదైన శస్త్ర చికిత్సలు చేస్తున్నామని ఈటల అన్నారు. ఆయుష్మాన్ భారత్ కింద గరిష్టంగా రూ. 5 లక్షల వరకు ఖర్చు భరిస్తుండగా, ఆరోగ్యశ్రీ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం గరిష్టంగా రూ. 13 లక్షల వరకు భరిస్తోందని వెల్లడించారు. ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా తెలంగాణ రాష్ట్రంలో కేవలం 24 లక్షల మందికి మాత్రమే లబ్ది చేకూరుతుండగా, ఆరోగ్యశ్రీ వల్ల 85 లక్షల మందికి ఉచిత వైద్య సేవలు అందుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం నేషనల్ హెల్త్ మిషన్ కింద ప్రాథమిక ఆరోగ్యానికి మాత్రమే సహాయం అందజేస్తోందని, సెకండరీ, ఆపై స్థాయి వైద్య సేవలకు కూడా కేంద్రం అవసరమైన నిధులు అందజేయాలని ఈటల రాజేందర్ కోరారు. సమావేశం అనంతరం ఢిల్లీలోని తెలంగాణ భవన్ గురజాడ హాల్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు.

ప్రతి ఇంటికీ సురక్షిత మంచి నీటిని అందించే లక్ష్యంతో 40 వేల కోట్లతో 24 వేల గ్రామాలకు మంచి నీటి సదుపాయం కల్పించామని వివరించారు. నిరుపేద గర్భిణీలకు 3 విడతలుగా రూ. 13 వేలు, డెలివరీ కిట్ అందజేస్తున్నామని తద్వారా నవజాత శిశు మరణాలు, ప్రసవ, బాలింత మరణాల రేటు తగ్గించామని వెల్లడించారు.

# విద్యుత్ పొదుపు మంత్రం

**●ఈసీబీసీతో దుబారాకు చెక్..**
**●పొదుపు పాటించే భవనాలకు స్టార్ రేటింగ్ ●గ్రీన్‌ఎనర్జీకి ప్రోత్సాహం**
**●2030 నాటికి 60 శాతం అమలు లక్ష్యం**
**●30 శాతం విత్యుత్ పొదుపు అంచనా**



**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** విద్యుత్ పొదుపుకోసం రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక చేపట్టింది. భవన నిర్మాణ రంగంలో ఎనర్జీ కన్సర్వేషన్ బిల్డింగ్ కోడ్ (ఈసీబీసీ)ని అమలు చేయటం ద్వారా విద్యుత్ వినియోగంలో దుబారాను నివారించి గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహించటం ద్వారా రాష్ట్రంలో ప్రస్తుతం వినియోగిస్తున్న విద్యుత్‌లో 20శాతం పొదుపు చేయవచ్చని అంచనా వేసింది. ఈసీబీసీని అమలులో పెట్టే భవనాలకు స్టార్ రేటింగ్ ఇస్తోంది. రాష్ట్రంలో ఇప్పటివరకూ ఈసీబీసీ కోడ్ అములు కింద 150 భవనాలు ఉన్నాయి. వీటి ద్వారా 65 మిలియన్ యూనిట్ల విద్యుత్ పొదుపు కాగలదని ప్రభుత్వం అంచనా వేసింది. టీఎస్ ట్రెడ్‌కో ద్వారా ఈసీబీసీ కోడ్‌ను అమల్లోకి తెచ్చింది. రాష్ట్రంలో 2030నాటికి 60శాతం భవన నిర్మాణాలు ఈ కోడ్ పరిధిలోనే ఉండాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే నిర్మాణం జరిగిపోయిన పాత భవనాలను కూడా విద్యుత్ పొదుపు ప్రక్రియ పరిధిలోకి తెచ్చేందుకు చర్యలు చేపడుతున్నారు.

### కాంపోజిట్ జోన్‌లో తెలంగాణ

వాతావరణ పరిస్థితుల ఆధారంగా దేశాన్ని ఐదు జోన్ల కింద విభజించగా అందులో తెలంగాణ రాష్ట్రం కాంపోజిట్ జోన్ పరిధిలో ఉన్నట్టు అధికారులు వెల్లడించారు. భవనం నిర్మాణ దశలోనే ఈసీబీసీ కోడ్‌కు దరఖాస్తు చేసేకుంటే భవన నిర్మాణం సందర్భంగా గదుల్లోకి సహజ సిద్ధమైన వెలుతురు, గాలి ప్రసరణ కోసం అవసరమైన జాగ్రత్తలలో డిజైన్లు రూపొందించటం, ఏసీలు, లైటింగ్‌కోసం తక్కువ సామర్థ్యంతో విద్యుత్ వినియోగించుకునేలా డిజైన్లు ఉండేలా చర్యలు తీసుకుంటారు. ఈసీబీసీ కోడ్ మార్గదర్శకాలను అమల్లోకి తెస్తూ జీహెచ్‌ఎంసీలో 32మందిని థర్డ్ పార్టీ అసెస్సీలుగా ఎంపిక చేశారు. డైరెక్టర్ ఆఫ్ టౌన్ ప్లానింగ్ విభాగానికి కూడా కోడ్ అమల య్యేలా చర్యలు తీసుకోవాలని మార్గదర్శకాలు ఇచ్చారు. భవన నిర్మాణం పూర్తయ్యాక వీరితో తనిఖీలు చేయి స్తారు. వారి నుంచి సర్టిఫికెట్ వచ్చాకే జీహెచ్‌ఎంసి అధికారులు ఆ భవనానికి అక్యుపెన్సీ సర్టిఫికెట్ మంజూరు చేస్తారు.

### 137 దరఖాస్తులు..
### వాటిలో కొత్త కలెక్టరేట్ భవనాలు

తెలంగాణ రాష్ట్రంలో ఈసీబీసీ కోడ్ అమలుకోసం 137 భవన నిర్మాణాలకు దరఖాస్తులు వచ్చాయి.ఇందులో తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేసిన కొత్త జిల్లాల్లో నూతన కలెక్టరేట్ భవనాల డిజైన్లు కూడా ఉన్నాయి. కలెక్టరేట్ భవనాలు, జిల్లా పరిషత్ కార్యాలయ భవనాలు పూర్తిగా ఎనర్జీ కన్సర్వేషన్ బిల్డింగ్ కోడ్ పరిధిలోనే నిర్మాణాలు చేపట్టారు. ఇప్పటికే రాష్ట్రంలో ఐకియా, కోహినూర్ ఐటీసీ తదితర బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు ఈ ప్రకారం నిర్మించి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు పొందాయి. మరికొన్ని మాల్స్ దరఖాస్తు చేసుకున్నాయి. బహుళ అంతస్తులతో అత్యంత అధునాత సదుపాయాలతో నిర్మిస్తున్న కార్పొరేట్ ఆస్పత్రుల్లో అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ కోడ్‌ను పాటిస్తూ భవనం నిర్మించటం ద్వారా సాధారణంగా జరిగే విద్యుత్ వినియోగంలో 20 శాతం పొదుపు జరుగుతుంది. దీనిపై అవగాహన కల్పించేందుకు శిక్షణ కార్యక్రమాలు చేపట్టారు.

### ఆరు కేటగిరీల్లో స్టార్ రేటింగ్

ఈసీబీసీ కోడ్ పాటించిన నిర్మాణాలకు ఆరు కేటగిరిల కింద స్టార్ లేబులింగ్ ఇవ్వనున్నారు. స్టార్‌లేబులింగ్‌లో 5శాతం విద్యుత్ పొదుపు పాటించే వాటికి ఒక స్టార్ , 6 నుంచి10శాతం పొదుపు పాటించే వాటికి టూస్టార్, 11నుంచి 15శాతం పొదుపు పాటించేవాటికి త్రీస్టార్, 16నుంచి 20శాతం పొదుపు పాటించే వాటికి 4స్టార్, 21నుంచి 30శాతం పొదుపు పాటించే వాటికి 5స్టార్, 30శాతం ఆ పైన విద్యుత్ పొదుపు పాటించే వాటికి 6స్టార్ లేబులింగ్ ఇవ్వనున్నారు. ఈసీబీసీ మార్గదర్శకాలు పాటిస్తూ నిర్మాణాలు చేపడితే వ్యయం కొంత అధికమే అయినా సిద్ధమేనని, అయితే తమకు జీహెచ్‌ఎంసి లేదా టౌన్ ప్లానింగ్, కంట్రీ ప్లానింగ్ విభాగాలనుంచి పర్మిషన్లు ఇవ్వటంలో ప్రాధాన్యత ఇవ్వాలని రియల్టర్లు కోరుతున్నారు.

## తొలిదశ ఉద్యమకారుడు చంద్రయ్య ఇకలేరు



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** తెలంగాణ తొలిదశ ఉద్యమకారుడు గుడాల చంద్రయ్య (70) తుదిశ్వాస విడిచారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌కు చెందిన చంద్రయ్యకు గురువారం ఉదయం గుండెపోటు రావడంతో కుప్పకూలి మరణించారు. షాద్‌నగర్ పట్టణంలోని పటేల్ రోడ్డు వాస్తవ్యుడైన చంద్రయ్య తొలిదశ తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేసి అనేక ఉద్యమాలు నిర్వహించారు. శ్రీశైలం ప్రాజెక్టులో టెక్నికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించి 12 ఏళ్ళ క్రితం పదవీ విరమణ చేశారు. తొలిదశ తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించడంతో పాటు తెలంగాణ ఉద్యమానికి సంబంధించి గ్రామాల్లో తిరుగుతూ బుర్రకథలు చెప్పేవారు. ఆనాటి కాంగ్రెస్ నేత, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే రాయికల్ దామోదర్‌రెడ్డి, మరో మాజీ ఎమ్మెల్యే భీశ్వ కిష్టయ్యలతో పాటు తొలితరం తెలంగాణ ఉద్యమంలో చంద్రయ్య పాల్గొన్నారు. ఉద్యోగంలో ఉంటూనే తెలంగాణ రాష్ట్ర సాధనకు అనునిత్యం పోరాడే వారని చెబుతుంటారు. ఉద్యోగ రీత్యా శ్రీశైలం ప్రాజెక్టులో పనిచేసి పదవీ విరమణ చేశాక షాద్‌నగర్‌లో స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. చంద్రయ్య పెద్ద కుమారుడు గుడాల శ్రీనివాస్ పోలీస్ శాఖలో పనిచేస్తున్నారు. చంద్రయ్య మరణంతో షాద్‌నగర్‌లో విషాదం చోటుచేసుకుంది.

## మాజీ ఎమ్మెల్సీ ఆమోస్ కన్నుమూత

**●సీఎం కేసీఆర్, మంత్రుల సంతాపం**



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** తెలంగాణ తొలితరం ఉద్యమనాయకుడు, మాజీ ఎమ్మెల్సీ కేఆర్ ఆమోస్ గురువారం తుదిశ్వాస విడిచారు. 1969లో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమం చేసిన ఆమోస్‌ను.. అప్పటి ప్రభుత్వం ఉద్యోగం నుంచి తొలగించింది. ఉద్యమం కారణంగా దేశంలోనే ఉద్యోగం కోల్పోయిన మొదటి వ్యక్తి, టీఎన్‌జీవో నేతగా ఆమోస్ గుర్తింపు తెచ్చుకున్నారు. 1969 తెలంగాణ ఉద్యమం కాలంలో ఉద్యోగస్తులందరని ఏకతాపైకి తీసుకొచ్చి ఉద్యమం నడిపించారు. మలిదశతెలంగాణ ఉద్యమంలోనూ కేఆర్ ఆమోస్ కీలకపాత్ర పోషించారు. కాంగ్రెస్ పార్టీలోనే ఉంటూ.. సొంత పార్టీలోనే సమైక్యవాదుల నిర్ణయాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టే వారు. రెండుసార్లు కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. కాగా కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీకి కూడా రాష్ట్రం నుంచి నమ్మకస్తుల్లో కేఆర్ ఆమోస్ ఒకరుగా ఉండేవారని కాంగ్రెస్ వర్గాలు చెబుతుండే వారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి టీఆర్ఎస్‌లో చేరారు. ఆ తర్వాత ఆమోస్ వయోభారం వల్ల క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన మాజీ ఎమ్మెల్సీ కేఆర్ ఆమోస్ రాష్ట్రానికి తీరనిలోటని రాష్ట్ర మంత్రి కేటీ రామారావు అన్నారు. ఆమోస్ కుటుంబ సభ్యులకు మంత్రి కేటీఆర్ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ తెలిపారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర పోరాటంతో పాటు, తెలంగాణ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాలపైన నాలుగు దశబ్దాల పాటు నిరంతరం గళమెత్తారని మంత్రి కేటీఆర్ అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆయన టీఆర్ఎస్‌లో చేరారని చెప్పారు. తెలంగాణ సమాజానికి ఆమోస్ చేసిన సేవలు ఎల్లకాలం గుర్తుంటాయని కేటీఆర్ పేర్కొన్నారు. ఆమోస్ మృతిపై మంత్రులు హరీష్, ఎర్రబెల్లి, నిరంజన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు.

## 2020 హజ్ యాత్ర దరఖాస్తులు ప్రారంభం



**హైదరాబాద్,ఆంధ్రప్రభ :** వచ్చే ఏడాది హజ్‌యాత్రకు వెళ్ళేందుకు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. గురువారం హజ్‌హౌస్‌లో హజ్ యాత్ర 2020 ఉచిత ఆన్‌లైన్ దరఖాస్తు విధానాన్ని హోంశాఖ మంత్రి మహ్మద్ మహమూద్ అలీ ప్రారంభించారు. ఈ నెల 10 నుంచి నవంబర్ 10వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. మరిన్ని వివరాలకు హజ్‌కమిటీ డాట్ జివోవి డాట్ ఇన్ అనే వెబ్‌సైట్‌లో సందర్శించాలని హజ్‌హౌస్ అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా 2019లో హజ్‌యాత్రలో యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విజయవంతగా నిర్వహించినందుకు తెలంగాణ హజ్‌హౌస్ కమిటీని మంత్రి మహమూద్ అలీ అభినందించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి విప్ ఎం. ఎస్. ప్రభాకర్, హజ్‌కమిటీ ఛైర్మన్ ఎండి మసియుల్లాఖాన్, తెలంగాణ వక్ఫ్‌బోర్డు సిఇవో అబ్దుల్లా హమీద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరు జిల్లాలకు పార్టీ అధ్యక్షులను నియమించిన కాంగ్రెస్ అధిష్టానం

**న్యూఢిల్లీ/హైదరాబాద్, ఆంధ్రప్రభ :** రాష్ట్రంలోని ఆరు జిల్లాలకు జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులను పార్టీ అధిష్టానం నియమించింది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కొంత మంది డీసీసీ అధ్యక్షులు పార్టీ మారిన విషయం తెలిసిందే. దీంతో ఖాళీగా ఉన్న జిల్లాలకు టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇన్‌చార్జీలను నియమించారు. ఇప్పుడు వారినే పార్టీ అధ్యక్షులుగా నియమిస్తూ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాలు ఆదేశాలు ఇచ్చారు. కొమ్రంబీం - ఆసిఫాబాద్‌కు - కె. విశ్వప్రసా దరావు, జయశంకర్ భూపాలపల్లి- అయిత ప్రకాశ్‌రెడ్డి, వికారాబాద్- టి. రామ్మో హన్‌రెడ్డి, ములుగు - నల్లెల కుమారస్వామి, నారాయణపేట్ - శివకుమార్‌రెడ్డి, యాదాద్రి- భువనగిరికి కుంభం అనిల్‌కుమార్‌రెడ్డిని నియమించారు.

## కాంగ్రెస్ గెలుపుతోనే కేసీఆర్ దూకుడుకు కళ్లెం



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** హుజూర్‌నగర్ ఓటర్లు తెలంగాణ రాజకీయాలను మలుపు తిప్పే చారి త్రక తీర్పు ఇస్తారనే నమ్మకం ఉందని టీ పీసీసీ ప్రచార కమిటి చైర్మన్ విజయశాంతి అన్నారు. అక్కడ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పద్మావతిరెడ్డి గెలిస్తే తప్ప.. కేసీఆర్ అండ్ కో దూకుడుకు కళ్లెం పడదని ఆమె అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఏడు నియోజక వర్గాల్లో టీఆర్ఎస్‌ను ఓడించినట్లుగానే.. హుజూర్ నగర్‌లో కూడా టీఆర్ఎస్‌ను ఓడించి కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతిని గెలిపించాలని గురువారం ఆమె ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. 48 వేల మంది ఆర్టీసీ కార్మికులను తొలగించిన ప్రభుత్వం.. తిరిగి మేం తొలగించలేదని వారే సెల్ఫ్ డిస్మిస్ అయ్యారని కేసీఆర్ వితండవాదం వినిపిస్తున్నారని విజయశాంతి ఆరోపించారు. ఆర్టీసీని ప్రభుత్వం విలీనం చేస్తామన్న హామీని కేసీఆర్ నిలబెట్టుకోవాలని ఆమె సూచిం చారు. టీఆర్ఎస్‌కు సీపీఐ మద్దతుపై పునరాలోచ చేస్తామన్న చాడా వెంకట్‌రెడ్డి ప్రకటన చేయడం.. కేసీఆర్ నియంతృత్వం ఏ విధంగా ఉందో అర్థమవుతోందన్నారు.

## ఏపీ నియామకాల్లో తెలంగాణవారికి అన్యాయం

**●సీఎం స్పందించాలి ●ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ఏపీలో నాన్‌లోకల్ కింద నియమించే 20 శాతం ఉద్యోగాల్లో తెలంగాణ ప్రాంతం నిరుద్యోగులకు న్యాయం జరిగే విధంగా తెలంగాణ ప్రభుత్వం చూడాలని మాజీ మంత్రి, కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సూచించారు. గురువారం ఆయన సీఎం చంద్రశేఖర్‌రావుకు లేఖ రాశారు. ఇటీవల ఏపీ ప్రభుత్వం నియమించిన ఉద్యోగాల భర్తీలో నాన్‌లోకల్ కోటా కింద తెలంగాణ ప్రాం త నిరుద్యోగులు ఎంపికైనారని, అయనప్పిటికి ఏపీ ప్రభుత్వం పోస్టింగ్‌లు ఇవ్వడం లేదని ఆయన పేర్కొన్నారు. 20 శాతం కోటాలో దేశ పౌరులెవరైనా ఉద్యోగానికి అర్హులని చట్టంలో ఉన్నదని జీవన్‌రెడ్డి గుర్తు చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల సీఎం లు జగన్, కేసీఆర్ మధ్య సఖ్యత ఉన్నందున.. సీఎం కేసీఆర్ జోక్యం చేసుకుని తెలం గాణ నిరుద్యోగ యువతకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. హైదరాబాద్‌లో కూడా దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన వారు విద్య, ఉద్యోగాల నియామకంలో చేరుతున్న విషయాన్ని సీఎంకు రాసిన లేఖలో ఆయన వివరించారు.

## చంబల్ అంతర్జాతీయ చలనచిత్ర వేడుకల అధ్యక్షునిగా గజల్ శ్రీనివాస్

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** మధ్యప్రదేశ్‌లోని చంబల్ 3వ ఆసిఫ్ అంతర్జాతీయ చలనచిత్ర వేడుకల అధ్యక్షునిగా ప్రఖ్యాత గాయకుడు, డాక్టర్ గజల్ శ్రీనివాస్ (కేశిరాజు) నియమించినట్లు చంబల్ ఫౌండేషన్ సంచాలకులు జనాబ్ షా ఆలం పత్రికా ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 11 నుంచి 14 వరకు భిండీ, మధ్య ప్రదేశ్‌లో ఉత్సవం జరుగ నున్నదని, టర్కీ, జర్మనీ, యుస్ఏ, ఇరాన్, ఇటలీ, సింగ పూర్, ఇండియా దేశాల కు చెందిన చలన, లఘు, చిత్రాలను ప్రదర్శించనున్నామని తెలిపారు. ప్రముఖులు పాల్గొనే ప్రారంభ సభలో గజల్ శ్రీనివాస్ రూపొందించిన '' చంబల్ చంబల్ ''వీడియో గీతం ఆవిష్కరణ జరుగుతుందని తెలిపారు.

## రవిప్రకాష్ కస్టడీ పిటిషన్‌పై నేడు తీర్పు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** టీవీ9 మాజీ సీఈఓ రవిప్రకాష్ కస్టడీపై నాంపల్లి కోర్టులో వాదనలు ముగిశాయి. వాదనలు విన్న న్యాయస్థానం తీర్పును నేటికి వాయిదా వేసింది. సంస్థ నిధులు మళ్లించారన్న ఆరోపణలపై అరెస్టయిన రవి ప్రకాష్‌ను పది రోజుల తమ కస్టడీకి ఇవ్వాలని బంజారాహిల్స్ పోలీసులు కోరారు. కస్టడీలో విచారణ జరపాల్సిన అవసరం లేదని గతంలోనే అన్ని విషయాలు వివరించారని రవిప్రకాష్ తరపు న్యాయవాది వాదించారు. హైకోర్టు అన్ని విషయాలు పరిగణనలోనికి తీసుకున్న తర్వాతే మిగతా కేసుల్లో ముందస్తు బెయిల్ మంజూరు చేసిందని తెలిపారు.

## లాసెట్ కౌన్సెలింగ్ గందరగోళం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** రాష్ట్రంలో ఉన్న న్యాయ కళాశాలల్లో చేరడానికి గురువారం కౌన్సెలింగ్ ప్రారంభం అయింది. అయితే నిజాం కాలేజ్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ కేంద్రంలో కెపాసిటీకి మించి అభ్యర్థులు రావడంతో కొంత గందరగోళం ఏర్పడింది. ఎక్కువ మంది సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు కావడంతోపాటు హెల్ప్‌లైన్ కేంద్రంలో ఉన్న అధికారులకు అనుభవం లేకపోవడంతో అభ్యర్థులు ఇబ్బం దులు పడాల్సి వచ్చింది. అధికారుల అనుభవ లేమితోపాటు ఎక్కువ మంది అభ్యర్థులు హాజరు కావడంతో రాత్రి పొద్దుపోయే వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ కొనసాగింది. నిజాం కాలేజ్ హెల్ప్‌లైన్ కేంద్రంలో కెపాసిటీకి మించి అభ్యర్థులు హాజరు కావడంతో ఇబ్బందులు వచ్చాయని అడ్మిషన్ల కమిటీ కన్వీనర్ తెలిపారు. దాంతోపాటు సర్టిఫికెట్ వెరిఫికేషన్ మొదటి రోజు కావడంతో కొన్ని ఇబ్బందులు వచ్చాయని శుక్రవారం నుంచి ఇబ్బందులు లేకుండా సాఫీగా జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిజాం కాలేజీ కేంద్రంలో 400 మందికి సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు అవకాశం ఉండగా అభ్యర్థులు 658 మంది హాజరయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 4 హెల్ప్‌లైన్ కేంద్రాల్లో లాసెట్-2019 సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ ప్రారంభం అయింది. జేఎన్‌టీయూ కేంద్రంలో 575 మంది హాజరయ్యారు. నారాయణగూడలోని కేశవ మోమోరియల్ కాలేజ్‌లో ఏర్పాటు చేసిన కేంద్రంలో 433 మంది, వరంగల్‌లోని కాకతీయ వర్సిటీలో ఏర్పాటు చేసిన కేంద్రంలో 362 మంది సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరయ్యారు.

## రూ.3కోట్ల ఆశ ముంచేసింది!

**●కోకోకోలా లాటరీ పేరుతో సైబర్ నేరగాళ్ల బురిడీ**
**●పన్నుల పేరిట రూ.43 లక్షలు చెల్లించి మోసపోయిన విద్యార్థి**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** కొన్ని లక్షలు కట్టేస్తే 3 కోట్లు వస్తాయన్న ఓ యువకుడి ఆశ... ఆస్తులను అమ్మేలా చేసింది. కోకోకోలా లాటరీ పేరుతో వేసిన సైబర్ నేరగాళ్ల వలలో చిక్కిన ఓ విద్యార్థి అలా 43 లక్షలు కట్టి... నిండా మునిగిపోయాడు. లాటరీ అదృష్టం మాటేమోగాని... ఉన్న భూములను తాకట్టు పెట్టిన ఆ బాధితుడు మోసపోయానని తెలుసుకుని లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లికి చెందిన గంగారెడ్డి అనే విద్యార్థి హైదరాబాద్‌లో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చేస్తూ సైబర్‌నేరగాళ్ల ట్రాప్‌లో పడ్డాడు. ఈ కేసు వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని కాచిగూడలో చదువుకుంటున్న గంగారెడ్డికి కొద్దిరోజుల క్రితం ఓ మెయిల్ వచ్చింది. కోకా కోలా కంపెనీ నిర్వహించిన లాటరీలో మూడు కోట్ల బహుమతి వచ్చిందని ఆ మెయిల్ సారాంశం. అది నిజమని నమ్మిన గంగారెడ్డి ఆ మెయిల్‌కు స్పందిస్తూ తన సమాచారాన్ని ఇచ్చాడు. ఇక ఆ తర్వాత సైబర్ నేరగాళ్లు రంగంలోకి దిగారు. కట్టుకథలతో గంగారెడ్డిని నమ్మించారు. లాటరీ మొత్తం చేతికి రావాలంటే కొన్ని పన్నులు కట్టాల్సి ఉంటుందని నమ్మించారు. విడతలు విడతలుగా మొత్తం రూ.43.22 లక్షలు గుంజేశారు. అలా డబ్బు చెల్లించేందుకు గంగారెడ్డి తమకు జీవనాధారంగా వున్న నాలుగెకరాల వ్యవసాయ భూమిని సైతం తన తండ్రి చేత తాకట్టు పెట్టించాడు. కాగా, దీనిపై అనుమానం వచ్చిన విద్యార్థి తండ్రి.. కుమారుడిని నిలదీయడంతో అసలు విషయం వెలుగుచూసింది. తనను ఫోన్‌లో సంప్రదించిన సైబర్ నేరగాడికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ అయింది.

## ఓయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ జగన్ అరెస్ట్

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ఉస్మానియా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జగన్‌ని మహబూబ్‌నగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐబీ పోలీసులు డాక్టర్ జగన్ ఇంట్లో సోదాలు నిర్వహించారు. జగన్ మావోయిస్టులకు సహకరిస్తున్నారని పోలీసులు ఆరోపిస్తున్నారు. జగన్ ఇంట్లో మావోయిస్టుల లెటర్లు, ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో అర్థశాస్త్రంలొ డాక్టరేట్ పొందిన ఆయన విప్లవ రచయితల సంఘం(విరసం) కార్యవర్గ సభ్యుడిగా ఉన్నారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో పదిహేనేళ్లపాటుపోరాడారు.

## కీసర ఆర్డీవో లచ్చిరెడ్డికి స్థానచలనం

**●జయశంకర్ భూపాలపల్లి భూ సేకరణ విభాగానికి బదలీ**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** తెలంగాణ తహశీల్దార్ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, డిప్యుటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షుడిగా ఉన్న కీసర ఆర్డీవో వీ లచ్చిరెడ్డిని బదలీ చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. మేడ్చెల్ మల్కాజ్‌గిరి జిల్లా కీసర రెవెన్యూ డివిజనల్ అధికారిగా పనిచేస్తున్న ఆయనను జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూ సేకరణ, ఆర్ అండ్ ఆర్ స్పెషల్ డిప్యుటీ కలెక్టర్‌గా నియ మిస్తూ ఆదేశాలు జారీ చేసింది. కీసర ఆర్డీవోగా మల్కాజ్‌గిరి ఆర్డీవో ఎన్ మధుసూదన్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు సీఎస్ ఎస్‌కే జోషి ఉత్తర్వులు జారీ చేశారు.తాజాగా మేడ్చెల్ మల్కాజ్‌గిరి జాయింట్ కలెక్టర్‌గా గవర్నర్ నర్సింహన్ వద్ద లైజన్ ఆఫీసర్‌గా పనిచేసిన కె విద్యాసాగర్ నియామకం కావడం తెలిసిందే.

ఇదిలా ఉండగా గురువారం టీజీవో, టీఎన్జీవో నేతలు సీఎం కేసీఆర్‌ను కలిసిన రోజే ఆయన బదలీ ఉత్తర్వులు వెలువడటం గమనార్హం.

## 'సెలెక్టెడ్ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ అభ్యర్థులకు పోస్టింగ్ ఇవ్వాలి'

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** రాష్ట్రంలో హాస్టల్స్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి సెలెక్ట్ అయిన అభ్యర్థులకు వెంటనే పోస్టింగ్‌లు ఇవ్వాలని తెలంగాణ సెలెక్టెడ్ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ అభ్యర్థుల సంఘం డిమాండ్ చేసింది. సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు గుండగోని రంగనాథ్ అధ్యక్షతన గురు వారం జరిగింది. జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమావేశంలో నాయ కులు గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, రామ్‌గోపాల్‌రెడ్డి, నందిని, మహేందర్‌రెడ్డి, శివశంకర్, నసీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. సెలెక్టెడ్ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లకు పోస్టింగ్ ఇవ్వడానికి అవరోధాలు లేవని ఆర్ కృష్ణయ్య అన్నారు.

## మాజీ మంత్రి మాదాటి కన్నుమూత

**●సీఎం కేసీఆర్ సంతాపం ●నివాళులర్పించిన పొన్నాల**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత మాదాటి నర్సింహారెడ్డి (85) గురువారం తెల్లవారు జామున తుదిశ్వాస విడిచారు. రెండు పర్యాయాలు మంత్రిగా వ్యవహరించిన మాదాటి .. మాజీ ప్రధాన మంత్రి పీవీ నరసింహారావుకు అత్యంత సన్నిహితులు, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రస్తుత భూపాలపల్లి జిల్లా మొసలపలిల్లో ఆయన జన్నించారు. శాయంపేట నియోజకవర్గం నుంచి రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొందారు. కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి, నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి మంత్రి వర్గంలో రెవెన్యూ , మున్సిపల్ శాఖలకు మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. అంతకు ముందు ఉమ్మడి వరంగల్‌కు జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా కూడా పని చేశారు. ప్రస్తుత భూపాలపల్లి జిల్లాలోని మొసలపల్లిలో ఆయన జన్మించారు. ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీలో కీలకనేతగా ఉండి ఉమ్మడి వరంగల్ జిల్లా పార్టీలో చక్రం తిప్పారు. వయోభారం కారణంగా ఆయన కొంత కాలంగా రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. ఆయన ప్రాతినిధ్యం వహించిన శాయంపేట నియోజక వర్గం 2004 నుంచి భూపాలపల్లి నియోజక వర్గంగా మారింది.

### అధికార లాంఛనాలతో అంత్యక్రియలకు కేసీఆర్ ఆదేశం



మాజీ మంత్రి మాదాటి నర్సింహ్మారెడ్డి మృతిపై సీఎం చంద్రశేఖర్‌రావు సంతాపం వ్యక్తం చేశారు. మంత్రిగా, ఎమ్మెల్యేగా, జడ్పీ ఛైర్మన్‌గా ప్రజలకు చేసిన సేవలను సీఎం స్మరించుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేసి, ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు.నరసింహారెడ్డి అంత్యక్రియలను అధికార లాంఛనాలతో నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషిని ఆదేశించారు. నరసింహారెడ్డి మృతిపట్ల పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తీవ్ర సంతాపం వ్యక్తంచేశారు. నరసింహారెడ్డి పార్థివదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. కాగా మాజీ మంత్రి మాదాటి మృతిపై కాంగ్రెస్ పార్టీ కూడా సంతాపం వ్యక్తం చేసింది. టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య బంజారా హిల్స్‌లోని ఆయన నివాసానికి వెళ్లి నర్సింహారెడ్డి పార్థివ దేవాహనికి నివాళులు అర్పించి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు పొన్నాల సానుభూతి తెలిపారు.

## కమ్యూనిస్టులకు భయపడే పథకాలు తీసుకొచ్చారు



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ఒకప్పుడు కమ్యూనిస్టులకు భయపడి ప్రభుత్వాలు సంక్షేమ పథకాలను అమలు చేసేవని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. కమ్యూ నిస్టులకు రాజ్యాధికారం దక్కకుండా చేయాలనే ఉద్దేశ్యం తోనే ప్రభుత్వాలు ఇలా చేసేవని తెలిపారు. కమ్యునిస్టులంటే భయం తగ్గడంతో కార్పొరేట్ శక్తులు బాగుపడే విధంగా ప్రభు త్వాలు పనిచేస్తున్నాయని చెప్పారు. గురువారం ఎస్వీకేలో 'మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు-ఆర్థిక మాంద్యం' అనే అంశంపై వామపక్షాల రాష్ట్ర సదస్సు జరిగింది. సీపీఐ నేత పశ్య పద్మ అధ్యక్షతన జరిగిన సదస్సులో తమ్మినేని వీరభద్రం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట రెడ్డి, డి.పాపారావు, ఆర్ఎస్‌పీ రాష్ట్ర కార్యదర్శి జానకీరామ్, ఎంసీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఉపేందర్, సీపీఎం నేత నర్సింగ రావు పాల్గొని ప్రసంగించారు.

## కట్టుకున్న భర్తనే కాటికి పంపిన భార్య

**ప్రియుడితో కలిసి దారుణం**



**చిన్నచింతకుంట, ప్రభ న్యూస్ :** తన వివాహే తర సంబం ధానికి భర్త అడ్డొస్తున్నాడనే నెపంతో ఓ భార్య కట్టుకున్న భర్తనే కాటికి పంపించిన ఘటన చిన్న చింత కుంట మండలంలో వెలుగు లోకి వచ్చింది. మహబూబ్ నగర్ జిల్లా, చిన్నచింతకుంట మండల పరిధి లోని మద్దూరు గ్రామంలో దారు ణం జరిగింది. గ్రామానికి చెందిన రాములమ్మ అనే వివాహితకు 23 సంవత్సరాల కింద వనపర్తి జిల్లా, కేతేపల్లి గ్రామానికి చెందిన ఆంజనేయులుతో వివాహం జరిగింది. అయితే రాములమ్మ స్వగ్రామానికి చెందిన సలీం అనే వ్యక్తితో 10 సంవత్సరాలుగా వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ వివాహేతర సంబంధం భర్త ఆంజనేయులుకు తెలిసింది. దీంతో ఆమె సోదరుడు రాజు, ప్రియుడు సలీంతో కలిసి రాములమ్మ భర్తను పీర్ల పండగ రోజున సలీం పొలం వద్ద ముగ్గురు కలిసి హతమార్చారు. ఈ విషయాన్ని బయటికి తెలియనీయకుండా రాములమ్మ, ఆమె సోదరుడు రాజులు భర్త కనిపించడం లేదని సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేపట్టి ఆంజనేయులు హత్య కేసును ఛేదించి అసలు నిందితులు వీరేనని తేల్చి చెప్పారు. సిఐ పాండురంగా రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం రాములమ్మ భర్త వారి వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని ఎలాగైనా ఆంజనేయులును అడ్డు తొలగించుకోవాలని, ఇంతటి దారుణానికి ఒడిగట్టాడు. ఎవరికీ తెలియకుండా భర్త కనిపించడం లేదని డ్రామా ఆడారని పోలీసుల విచారణలో తేలింది. అంతమొందించిన ఆంజనేయులును ప్రియుడు సలీం పొలం వద్దనే పూడ్చి పెట్టడంతో మృతదేహాన్ని వెలికి తీసి హత్యకు కారణమైన ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు.

## ఏపీలో ఇంటింటికీ కంటి వెలుగు

**●అనంతపురంలో ప్రారంభించిన సీఎం జగన్**



**అనంతపురం, ప్రభన్యూస్ బ్యూరో:** డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ కంటి వెలుగును అందిస్తామని రాష్ట్ర ముఖ్య మంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రకటించారు. గురువారం ఉదయం అనంతపురం నగరం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని జ్యోతిప్రజ్వలనతో ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సభాధ్యక్షునిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడుతూ తల్లి గర్భం నుంచి బయటపడే పసిబిడ్డకు ప్రపంచాన్ని పరిచయం చేసేవి కళ్లు మాత్రమేనన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న 5.40 కోట్ల జనాభాలో 2.12 కోట్ల మంది కంటిచూపు సమస్యలతో బాధపడుతున్నారన్నారు. ఇందులో దాదాపు 80 శాతం సమస్యలు సకాలంలో చికిత్స చేయించడం ద్వారా నయం చేయవచ్చునన్నారు.

## ఏసీబీ వలకు చిక్కిన తెలుగు గంగ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

**రూ.4 కోట్ల ఆస్తుల గుర్తింపు**

**నెల్లూరు (క్రైం), ప్రభ న్యూస్:** విలేజ్ డెవలప్‌మెంట్ అధికారిగా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించి డిప్యూటీ కలెక్టర్ స్థాయికి ఎదిగి పనిచేసిన చోటల్లా జేబులు నింపుకుని కోట్ల రూపాయల ఆస్తులు ఆర్జించారన్న ఆరోపణలతో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా తెలుగుగంగ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మన్నెం లక్ష్మీ నరసింహం ఇళ్లు, బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో ఏసీబీ డీఎస్పీ సీహెచ్‌డీ శాంతో నేతృత్వంలో అధికారులు ఏకకాలంలో 6 ప్రాంతాలలో దాడులు చేసి రూ. 4 కోట్ల ఆస్తులను గుర్తించారు. బహిరంగ మార్కెట్‌లో ఈ ఆస్తుల విలువ రూ. 15 కోట్ల పైనే ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ప్రకాశం జిల్లా ఓలేటి వారిపాళెం మండలం కలవల్ల గ్రామానికి చెందిన లక్ష్మీ నరసింహం 1989లో ప్రకాశం జిల్లాలో విలేజ్ డెవలప్‌మెంట్ అధికారిగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. 1995లో డిప్యూటీ తహసీల్దార్‌గా పదోన్నతి పొంది పొదలకూరులో పనిచేశారు. 2004లో తహసీల్దార్‌గా పదోన్నతి పొంది నెల్లూరు, జలదంకి, వెంకటాచలం, బాలాయపల్లి ప్రాంతాలలో పనిచేశారు.

## ఏసీబీకి పట్టుబడ్డ కేటీపీఎస్ సీఈ



**భద్రాద్రి కొత్తగూడెం, ప్రభన్యూస్ :** కేటిపిఎస్ కర్మాగారంలో బిల్లుల చెల్లింపులో కాంట్రాక్టర్ నుంచి రూ.3 లక్షల లంచం తీసుకుంటూ కేటీపీఎస్ 5, 6 దశల సీఈ ఆనందం గురువారం అనిశాకు పట్టుబడ్డారు. వివరాల ప్రకారం....కేటీపీఎస్ 5, 6 దశల్లో వాహిని ఇంజినీరింగ్ అండ్ సర్వీసెస్ కంపెనీ యజమాని లలితమోహన్ రూ.71 లక్షలకు ఆరో దశలో మెకానికల్ పనులు చేస్తు న్నారు. ఆ బిల్లులు చెల్లించ డానికి సీఈ ఆనందం రూ.10 లక్షల లం చం అడిగారు. కాంట్రాక్టర్ ఇవ్వకపోవడంతో బిల్లులు చెల్లించడానికి సీఈ అభ్యం తరం వ్యక్తం చేస్తున్నారు. తరచూ ఇదే విధంగా జరుగుతుండటంతో ఇటీవల కాం ట్రాక్టర్ రూ.2లక్షలు సీఈ ఆనందంకు ముట్టజెప్పగా రూ.28 లక్షల బిల్లులు మంజూరు చేశారు. మిగిలిన బిల్లులు చెల్లించాలంటే రూ.8లక్షలు ఇవ్వాల్సిందేనని సిఈ డిమాండ్ చేయడంతో విసుగు చెందిన కాంట్రాక్టర్ అనిశా అధికారులను ఆశ్రయించారు. రంగంలోకి దిగిన అనిశా డీఎస్పీ ప్రతాప్ గురువారం రూ.3లక్షలు సీఈకి ఇవ్వాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కాంట్రాక్టర్ సీఈ దగ్గరకు వెళ్ళేప్పుడు అనిశా అధికారులు పక్కనే వెళ్లారు. కాంట్రాక్టర్ మధ్యాహ్నం సీఈ ఆనందంకు డబ్బులు ఇచ్చి బయటకు వచ్చిన వెంటనే అనిశా అధికారులు ఛాంబర్‌లోకి దూసుకెళ్లి రెడ్ హ్యాండెడ్‌గా సీఈ ఆనందంను పట్టుకున్నారు. డబ్బులు, సంబంధిత రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. 24గంటల్లో ఏసీబీ కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలిస్తామని అనిశా అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో అనిశా సిఐలు రమణమూర్తి, రవీందర్, క్రాంతితో పాటు 12మంది అనిశా సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్రప్రభ





# దసరా ఘనత చాటేందుకే...

# అలయ్...బలయ్

• హాజరైన గవర్నర్ తమిళిసై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయ

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** చెడుపై మంచి సాధించిన విజయమే విజయదశమి అని హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. బతుకమ్మ, బోనాల పండుగలు తెలంగాణ ఖ్యాతిని పెంచుతున్నాయని పేర్కొనవ్నారు. దసరా పండుగ సందర్భంగా ప్రతి ఏటా జరిగే అలయ్ బలయ్ కార్యక్రమం గురువారం జలవిహార్‌లో దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి నేతృత్వంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ, భావితరాలకు పండుగ ప్రాధాన్యతను తెలియజేయడానికే అలయ్ బలయ్‌ని నిర్వహిస్తున్నా మన్నారు. రాజకీయాలకు అతీతం గా ఈ కార్య క్రమం చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. హిమాచల్‌ప్రదేశ్ ప్రకృతికి నిలయమని, ప్లాస్టిక్ భూతాన్ని అంతం చేసి పర్యావరణాన్ని కాపా డాలని పిలుపునిచ్చారు.



### సాంస్కృతిక విప్లవం రావాలి

మహారాష్ట్ర మాజీ గవర్నర్, బీజేపీ సీనియర్ నేత సిహెచ్ విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ, తెలం గాణ కవులు, కళాకా రులు మళ్లీ ముందుకు రావాలని, సాంస్కృతిక ప్రదర్శనలు ఇవ్వాలని, సాంస్కృతిక విప్లవం తీసుకు వచ్చి భాషను రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. కేంద్ర హోం శాఖసహాయ మంత్రి జి. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధనలో అలయ్ బలయ్ దోహదపడిందన్నారు. కుల, మత, ప్రాంత, వర్గ, వర్ణ విబేధాలన్నింటినీ విడిచిపెట్టి ప్రతీ ఒక్కరు దేశాభివృద్ధికి పాటు పడాలన్నారు.

**తెలంగాణకు రావడం అదృష్టం: తమిళిసై**

రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ మాట్లాడుతూ, తెలంగాణకు గవర్నర్‌గా రావడం తన అదృష్టమని సంతోషం వ్యక్తం చేశారు. బండారు దత్తాత్రేయ, సిహెచ్ విద్యా సాగర్‌రావులు తనకు ఆదర్శమన్నారు. పదిహేను సంవత్స రాలుగా దత్తాత్రేయ అలయ్ బలయ్ నిర్వహించడం చాలా గొప్ప విషయమని కొనియా డారు. మానవ సంబంధాలు పెంచడంలో ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. తెలంగాణలో మహిళ లకు ఎంతో గౌరవం ఇస్తారన్నారు. తమిళనాడు, తెలంగాణ కు భౌగోళిక సరిహద్దులు ఉన్నాయే కానీ సంస్కృతీ సంప్రదా యాలు మాత్రం ఒకేలా ఉంటాయన్నారు. చిన్న పిల్లల టిఫిన్ బాక్సుల్లో బర్గర్లు, చిప్స్ లాంటివి ఉంటున్నాయి, వీటిల్లో పోషకాలు లేకపోవడంతో చిన్నారుల్లో పోషకాహార లోపం తలెత్తు తోందన్నారు. చిన్నారులకు పౌష్టికాహారం ఇచ్చేలా తలిదం డ్రులు అవగాహన పెంచుకోవాలని గవర్నర్ సూచించారు.

### వీహెచ్ అసహనం

అలయ్ బలయ్ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత వి. హన్మంతరావు రాజకీయ వ్యాఖ్యలు చేశారు. తమకు తగిన సమయం ఇవ్వడం లేదంటూ వేదికమైనే అసంతృప్తిని వ్యక్తం చేశారు. గత గవర్నర్ కూడా తమ పట్ల ఇలాగే వ్యవహరించాలంటూ అసహనానికి లోనయ్యారు. ఫ్లెక్సీలలో కాంగ్రెస్ నేతల ఫొటోలు లేకపోవడం బాధాకరమన్నారు. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీని అవమానపరిచారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాతగవర్నర్‌లా చేయొద్దని రాష్ట్ర గవర్నర్ తమిళిసైని కోరారు. మీరైనా మమ్మల్ని జర చూసుకోవాలంటూ హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీలు కేశవరావు, రేవంత్‌రెడ్డి, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, బీజేపీ నేతలు మురళీధర్‌రావు, ఇంద్రసేనారెడ్డి, లక్ష్మణ్, తెలంగాణ జన సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం, టీ టీడీపీ అధ్యక్షులు ఎల్. రమణ,ఎంఎల్‌ఎ దానం నాగేందర్‌లతో పాటు పలు పార్టీలకు చెందిన నేతలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరయ్యారు.



# నేడు కేమరోస్ పార్లమెంట్‌లో ఉపరాష్ట్రపతి ప్రసంగం

**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ :** ఐదు రోజుల ఆఫ్రికా దేశాల పర్యటనలో ఉన్న ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు కేమరోస్ చేరుకున్నారు. ఆ దేశాధ్యక్షుడు అజాలీ అసొమని, కేమరోస్‌లో భారత రాయబారి అభయ్ కుమార్ తదితరులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. గురువారం ఆఫ్రికా పర్యటన చేపట్టిన వెంకయ్యా నాయుడు కామరోస్, సియారా లియోన్ దేశాల్లో పర్యటించనున్నారు. భారతీయ కాలమానం ప్రకారం నేడు కేమరోస్ అధ్యక్షుడు అజాలీ అసొమనితో ద్వైపాక్షిక అంశాలపై చర్చి స్తారు. అనంతరం వీరిరువురి సమక్షంలో ఇరుదేశాల మధ్య పలు ఒప్పందాలపై అధికారులు సంతకాలు చేయనున్నారు. ఇవాళే వెంకయ్య నాయుడు కేమరోస్ పార్లమెంటును ఉద్దేశించి ప్రసంగిస్తారు. సియారా లియోన్‌లో భారత సంతతి ప్రజలతోనూ ఆయన సమావేశం కానున్నారు. అక్కడి భారత సంతతి ప్రజలను ద్దేశించీ ఆయన ప్రసంగించనున్నారు. 12, 13, 14 తేదీల్లో సియారా లియోన్ పర్యటన సందర్భంగా ఆ దేశాధ్యక్షుడు జూలియస్ మాదా బయో, విదేశాంగ మంత్రి శ్రీమతి నబీలా ఫరీదా ట్యూనిస్‌తో వేర్వేరుగా ఉపరాష్ట్రపతి చర్చలు జరుపుతారు. ప్రతినిధి స్థాయి చర్చల అనంతరం పలు ద్వైపాక్షిక ఒప్పందాలపై సంతకాలు చేయనున్నారు.



# హుజూర్‌నగర్

## వేడెక్కిన ఉప ఎన్నిక ప్రచారం

- నేటి నుంచి కేటీఆర్ సుడిగాలి పర్యటన
- ప్రచారానికి రానున్న కాంగ్రెస్ నేతలు రేవంత్, విజయశాంతి, ముఖ్యనేతలు
- కదనరంగంలోకి కమలదళం
- ప్రచారానికి సిద్ధమవుతున్న కిషన్‌రెడ్డి, లక్ష్మన్
- 13 నుంచి తెదేపా తరపున బాలకృష్ణ ప్రచారం
- పేలుతున్న మాటల తూటాలు
- కాంగ్రెస్, తెరాసలమధ్య మాటల యుద్ధం
- భారీగా పట్టుబడుతున్న నగదు, మద్యం
- రంగంలోకి దిగిన ఎన్నికల పరిశీలకులు






**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** హుజూర్‌నగర్ ఉపఎన్నిక పోలింగ్ సమీపిస్తుండడంతో ప్రధాన రాజకీయ పార్టీలు ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ఆయా పార్టీల తరపున అగ్రనేతలు రంగంలోకి దూకేస్తున్నారు. సిట్టింగ్ స్థానంలో తన సతీమణిని గెలిపించుకునేందుకు టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి తీవ్రంగా కృషిచేస్తున్నారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ప్రచారాన్ని నిర్వహిస్తోంది. కాగా, కాంగ్రెస్‌ను ఓడించి సత్తా చాటాలని తెరాస పట్టుదలతో ఉంది. ఒక్కో మండలానికి ఇద్దరేసి ఎమ్మెల్యేలను, ఎమ్మెల్సీలకు ప్రచార బాధ్యతలను అప్పగించారు. జిల్లాకు చెందిన మంత్రి జగదీష్‌రెడ్డి ఇక్కడే మకాం వేసి ప్రచారం నిర్వహిస్తుండగా, సహచర మంత్రులు తొలి విడత ప్రచారం పూర్తిచేశారు. కాంగ్రెస్ తరపున ఆ పార్టీ సీనియర్ నేత, జానారెడ్డి నియోజక వర్గంలోనే ఉంటూ ప్రచార బాధ్యతలను సమన్వయం చేస్తున్నారు. నేటి నుంచి రేవంత్‌రెడ్డి, విజయశాంతి, పొన్నం ప్రభాకర్ ప్రచారంలోకి దిగనున్నారు.

### నేటి నుంచి కేటీఆర్ టూర్..

తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మునిసిపల్ శాఖ మంత్రి కేటీఆర్ శుక్రవారం నుంచి నియోజకవర్గం లోనే బసచేసి ప్రచారం జరపాలని నిర్ణయించారు. సీఎం కేసీఆర్ ఆఖర్లో రోడ్‌షోలు, బహిరంగ సభలో పాల్గొంటారు. 17 లేదా 18 తేదీల్లో కేసీఆర్ పర్యటన ఉండొచ్చని తెలుస్తోంది.

### రెండు రోజులపాటు బాలకృష్ణ పర్యటన

మరోవైపు తెదేపా అభ్యర్థి చావా కిరణ్మయి తరపున ఆ పార్టీ హిందూపురం ఎమ్మెల్యే, నటుడు నందమూరి బాలకృష్ణ ఈనెల 13 నుంచి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. రెండు రోజులపాటు ఆయన పర్యటించే అవకాశముంది.

### నేడోరేపో లక్ష్మణ్ ప్రచారం

భాజపా తరపున ప్రచారం నిర్వహించేందుకు బాధ్యతలను పార్టీ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ కట్టబెట్టారు. ఒకటి, రెండు రోజుల్లో తాను సైతం హుజూర్‌నగర్ వెళ్ళి ప్రచారంలో పాల్గొనాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. ఈ ఉపఎన్నికకు జాతీయ నేతలను ప్రచారానికి ఆహ్వానించరాదని భాజపా నిర్ణయించింది. ఉమ్మడి రాష్ట్రానికి చెందిన పార్టీ అగ్రనేతలు రాం మాధవ్, మురళీధర్‌రావులు ప్రచారంలో పాల్గొనేలా పార్టీ రాష్ట్రనాయకత్వం ప్రణాళికలు సిద్ధంచేసినట్టు తెలుస్తోంది.

### విమర్శల జోరు

ఎన్నికల పోలింగ్ సమీపిస్తున్న కొద్ది పోటీలో ఉన్న ప్రధాన రాజకీయ పార్టీలు కాంగ్రెస్, తెరాసలు మాటల తూటాలు పేల్చుకుంటున్నాయి. వ్యయ పరిశీలనకు పదవీ విరమణ చేసిన ఆదాయ పన్నుశాఖ ఉన్నతాధికారిని నియ మించింది. ఇరువురు పరిశీలకులు స్థానికంగా ఉంటూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని కేంద్ర ఎన్నిలక సంఘానికి చేరవేసున్నారు. సిట్టింగ్ స్థానాన్ని ఎలాగైనా సరే సాధించి తీరాలన్న పట్టుదలతో ఉత్తమ్‌తో పాటు పార్టీ రాష్ట్ర నాయకత్వం ప్రచారం నిర్వహిస్తూ గత ఐదేళ్ళలో అధికార తెరాస నియోజకవర్గానికి చేసిందేమీ లేదన్న విషయాన్ని ప్రజలకు వివరిస్తూ ఓట్లను అడిగే ప్రయత్నం చేస్తున్నారు. ఇందుకు ధీటుగా తెరాస సైతం ఉత్తమ్‌తో పాటు కాంగ్రెస్ పార్టీపై ఆరోపణలు గుప్పిస్తోంది. నియోజకవర్గ అభివృద్ధిపై గత ఐదేళ్ళలో ఉత్తమ్ ఏమాత్రం దృష్టి సారించలేదని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా, ఎమ్మెల్యేగా, ఎంపీగా ఆయన తన నియోజకవర్గంలో సమస్యలపై ఏనాడూ ప్రభుత్వాన్ని కలవలేదని వినతిపత్రం కూడా అందజేయలేదని అయినా అన్ని నియోజకవర్గాలకన్నా ఎక్కువగా హుజూర్‌నగర్ అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉండి ఆ దిశగా నిధులను మంజూరు చేసిందని తెరాస చెబుతోంది. తెరాస, కాంగ్రెస్‌లు రాష్ట్రాన్ని అదోగతి పాలు చేశాయని హుజూర్‌నగర్ అభివృద్ధిని అధికార పార్టీ తెరాస, అంతకు ముందు అధికారంలో ఉన్న కాంగ్రెస్ విస్మరించాయని భాజపా నేతలు ఆరోపిస్తున్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే హుజూర్‌నగర్‌లో వైద్య కళాశాలను ఏర్పాటు చేస్తానని భాజపా తరపున పోటీ చేస్తున్న అభ్యర్థి రామారావు హామీనిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి ప్రభుత్వం సెస్ పేరుతో కోట్ల రూపాయలను వసూలు చేస్తోందని ఆ నిధులన్నింటినీ మంత్రి జగదీష్‌రెడ్డి తన నియోజకవర్గ అభివృద్ధికి ఖర్చు పెడుతున్నారని తాను గెలిస్తే ఈ నిధులను హుజూర్‌నగర్ అభివృద్ధికే వెచ్చిస్తానని ఆయన హామీనిస్తూ ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు.

### ఇక హోరు.. జోరు

దసరా పండుగ దాకా హుజూర్‌నగర్ ఉపఎన్నిక ప్రచారం మందకొడిగా సాగినా.. గురువారం నుంచి ప్రచారం ఊపందుకుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ఆయా రాజకీయ పక్షాలు తరలిస్తున్న నగదు, మద్యాన్ని భారీఎత్తున పట్టుకుని స్వాధీనం చేసుకుంటున్న కేసులు ప్రతిరోజూ జరుగుతూనే ఉన్నాయి. మరో పది రోజుల్లో పోలింగ్ జరుగుతుండడంతో కాంగ్రెస్, తెరాస పార్టీలు స్థానికంగా మకాంవేసి ఇంటింటికి తిరుగుతూ ప్రచారంలో నిమగ్నమవుతున్నారు. పేరుకి కాంగ్రెస్, తెరాస, భాజపా, తెదేపా అభ్యర్థులు బరిలో నిలిచినా ప్రధాన పోటీ కాంగ్రెస్, తెరాసల మధ్యనే ఉంటుందని రాజకీయ విశ్లేషకులు లెక్కలు వేస్తున్నారు. పార్టీని బలోపేతం చేసే దిశగా తెదేపా ఈ నియోజకవర్గంలో అభ్యర్థిని నిలబెట్టింది. భాజపా సైతం ఉపఎన్నికలో తమ అభ్యర్థిని పోటీకి పెట్టడం ద్వారా సత్తా చాటాలని నిర్ణయించింది.



## అక్కడే మకాం.. పక్కా వ్యూహం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** హుజూర్‌నగర్ శాసనసభా స్థానాన్ని ఎలాగైనా నిలబెట్టుకోవాలని కాంగ్రెస్ భావిస్తోంది. అందుకు తగ్గట్లు పావులు కదుపుతోంది. ఎన్నడూ లేనివిధంగా ఆ పార్టీ సీనియర్లు హుజూర్‌నగర్ నియోజకవర్గంలోనే మకాం వేసి ప్రచారం తీరుతెన్నులు పరిశీలిస్తున్నారు. అవసరాన్ని బట్టి ఎత్తులు వేస్తున్నారు. సిట్టింగ్ స్థానాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ జారవిడుచుకోరాదన్న పట్టుదలతో నేతలు పనిచేస్తున్నారు. అందుకోసం ప్రచారాన్ని ఉధృతం చేసింది. ఆ జిల్లాకు చెందిన ముఖ్య నేతలతో పాటు, రాష్ట్రంలోని పార్టీ నాయకులు కూడా అక్కడనే మకాం వేశారు. ప్రతి పల్లెకు వెళ్లి.. ప్రతి గడప ఎక్కి కాంగ్రెస్‌ను ఆశీర్వదించాలని కోరుతున్నారు. ఆర్టీసీ సమ్మెను కూడా తమకు అనుకూలంగా మలుచుకునేం దుకు కాంగ్రెస్ నేతలు ప్రయత్నిస్తున్నారు. హుజూర్‌నగర్ ఉప ఎన్నిక ప్రభుత్వ నియంతృత్వానికి, ప్రజాస్వామ్యానికి మధ్య జరుగుతున్నదని, అందువల్ల ప్రజాస్వామ్యవాదులందరూ తమకు మద్దతుగా ఉండాలని కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహిస్తున్నారు. సామాజికవర్గాల వారీగా నేత లను ప్రచార పర్వంలోకి దించారు. ప్రధానంగా జిల్లాకు చెందిన సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి, ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ మంత్రి రామిరెడ్డి దామోదర్‌రెడ్డితో పాటు మరికొందరూ కూడా కాంగ్రెస్ అభ్యర్థి పక్షాన విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా పార్టీ అనుబంధ విభాగాలను కూడా కాంగ్రెస్ పార్టీ ప్రచారంలోకి దింపింది. యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్ యూఐ, వికలాంగుల సెల్‌తో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అనుబంధ విభాగాల నాయకులు కాంగ్రెస్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా పద్మావతి నామినేషన్ వేసిన రోజే భారీ సభను నిర్వహిం చిన కాంగ్రెస్, మరొకసారి భారీసభను నిర్వహించాలని భావిస్తోంది.

### సీపీఐ పునరాలోచన నిర్ణయం భేష్ - భట్టి

హుజూర్‌నగర్ ఉపఎన్నిక విషయంలో టీఆర్ఎస్‌కు మద్దతు ఇచ్చే అంశంపై పునరాలోచన చేస్తామన్న ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడా వెంకట్‌రెడ్డి వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ స్వాగతిస్తున్నదని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. తుది నిర్ణయాన్ని వెంటనే ప్రకటించాలని కోరారు. ఆర్టీసీ ఆస్తులను కాపాడటం కోసం రాష్ట్ర ప్రజలందరూ ఏకంకావాలన్నారు. ఆర్టీసీ ఆస్తులను కాపాడుకు నేందుకు ప్రతిఒక్కరు ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. హుజూర్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీనే విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# 15న నీటి లెక్క తేలుద్దాం!

• రబీకి 79 టీఎంసీలు ఇవ్వండి
• కృష్ణా బోర్డును కోరిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** రబీ అవసరాల కోసం తమకు 79 టీఎంసీల నీటిని విడుదల చేయాలని కృష్ణా నది నిర్వహణ మండలిని తెలంగాణ కోరింది. తమకూ150 టీఎంసీలు కావాలని ఆంధ్రప్రదేశ్ బోర్డు కూడా ప్రతిపాదన చేసింది. కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు మెంబర్ సెక్రటరీ పరమేశం అధ్యక్షతన జరిగిన భేటీలో రెండు రాష్ట్రాల తరుపున విజ్ఞప్తులు వినిపించారు. నీటి కేటాయింపులకు సంబంధించి శుక్రవారం కేఆర్ఎంబీ అధికారులు రిలీజ్ ఆర్డర్ ఇవ్వనున్నారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్ పోతిరెడ్డిపాడు, కేసీకెనాల్, నాగార్జునసాగర్ ఎడమకాల్వల నుండి కేటాయింపుల కంటే అధికంగా నీరు వాడుకుంటోందని తెలంగాణ ఇంజనీర్లు ఆరోపించారు. కాగా, ఎన్‌సీపీ లెఫ్ట్ కెనాల్ మినహా మిగతా ప్రాజెక్టుల్లో ఎక్కడా కేటాయింపులకు మించి నీరు వాడలేదని ఆంధ్రప్రదేశ్ ఇరిగేషన్ శాఖ ఇంజనీర్లు పేర్కొన్నారు. 15న జరిగే ఈఎన్‌సీల సమావేశంలో వివాదాన్ని చర్చించి పరిష్కరించుకోవాలని కేఆర్ఎంబీ అధికారులు సూచించారు.

### వినియోగంలో వెనుకే

కృష్ణా జలాల్లో ఏపీకి 66శాతం, తెలంగాణకు 34శాతం వాటా ఉండగా, ఈ మేరకే కేటాయింపులు జరుగుతున్నాయి. దామాషా ప్రకారం తెలంగాణకు ఖరీఫ్ లో 105.9 టీఎంసీలు కేటాయించగా, కేవలం 70.198 టీఎంసీలే వినియోగించుకుంది. ఇంకా 35టీఎంసీలను వాడుకోలేదు. ఎఎమ్మార్ ప్రాజెక్టు, కల్వకుర్తి, నాగార్జునసాగర్ ఎడమకాల్వ, హైదరాబాద్ తాగునీరు అన్నింటిలోనూ తక్కువగానే వినియోగించుకున్నారు. మరోవైపు ఏపీ 214 టీఎంసీలు కేటాయించగా, 241 టీఎంసీల జలాలను వినియోగించుకుంది.

# శ్రీరాంసాగర్@78 టీఎంసీలు

• 15వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో • శ్రీశైలం, సాగర్‌లకు వరదే వరద • నాగార్జునసాగర్ ఆరుగేట్లు ఎత్తిన అధికారులు



**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** చాలాకాలం తర్వాత శ్రీరాంసాగర్ ప్రాజెక్టు భారీవరదతో కళకళలాడుతోంది. పూర్తిసామర్థ్యానికి చేరువ అవుతోంది. రెండు రోజులుగా ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లోలు వస్తుండగా, గురువారం 15,571 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగింది. 90.3టీఎంసీలకు గాను ప్రాజెక్టులోకి 78.34టిఎంసిల నీరు చేరింది. మరోవైపు కృష్ణాబేసిన్‌లో ఆల్మట్టి నుండి పులిచింతల దాకా వరద వెల్లువ కొనసాగుతోంది. జూరాల ప్రాజెక్టుకు 53,012క్యూసెక్కుల వరదవస్తుండగా, తుంగభద్రకు 12,782క్యూసె క్కులు, శ్రీశైలం ప్రాజెక్టుకు 1,22,840క్యూసెక్కులు, నాగార్జునసాగర్‌కు 85,488 క్యూసె క్కులు, పులిచింతలకు 83,524క్యూసెక్కులు వరద వస్తోంది. శ్రీపాద ఎల్లం పల్లి ప్రాజెక్టుకు 6570క్యూసెక్కులు, కడెం ప్రాజెక్టుకు 433 క్యూసెక్కుల వరద కొనసాగు తోంది. సింగూరు, నిజాంసాగర్ ప్రాజెక్టు మినహా రాష్ట్రంలోని ప్రాజెక్టులన్నీ నిండాయి. సింగూరులో ప్రస్తుతం 0.94 టిఎంసిల నీరు ఉండగా, నిజాంసాగర్‌లో 3.4టిఎంసిలు ఉన్నాయి. మిడ్‌మానేరులో ప్రస్తుతం 25.87టీఎంసీల సామర్థ్యానికి గాను 2.68టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. గతంలో ఈ ప్రాజెక్టు పూర్తిగా నిండగా, నీటిని దిగువకు విడుదల చేశారు.

# ఢిల్లీ తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా గౌరవ్



**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ :** ఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా నల్గొండ జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న గౌరవ్ ఉప్పల్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2005 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి గౌరవ్ ఉప్పల్ ప్రస్తుతం నల్గొండ జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. తెలంగాణ భవన్‌కు రెసిడెంట్ కమిషనర్‌గా పనిచేసిన సీనియర్ ఐఏఎస్ అధికారి అశోక్ కుమార్ బదిలీపై వెళ్లడంతో, అదనపు రెసిడెంట్ కమిషనర్‌గా ఉన్న వేదాంతం గిరికి రెసిడెంట్ కమిషనర్ బాధ్యతలను పూర్తిస్థాయి అదనపు బాధ్యతగా అప్పగించారు. అయితే ఈ మధ్యకాలంలో తెలంగాణ భవన్ పాలనా వ్యవహారాలు, కేంద్ర ప్రభుత్వంతో ఎప్పటికప్పుడు మంతనాలు సాగించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అంచనాలకు తగ్గట్టుగా పని జరగడం లేదని ముఖ్యమంత్రి కార్యాలయం అసంతృప్తితో ఉన్నట్టు తెలిసింది. కొద్ది రోజుల క్రితం ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటన చేపట్టినప్పుడు కూడా రెసిడెంట్ కమిషనర్ తీరుపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. మరోవైపు తెలంగాణ భవన్‌లో పనిచేస్తున్న ఇతర అధికారులు, సిబ్బంది సైతం వేదాంతం గిరి తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినట్టు తెలుస్తోంది. వీటన్నింటి నేపథ్యంలోనే తాజా మార్పులు చేర్పులు జరిగినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం వేదాంతం గిరి నిర్వహించే అదనపు బాధ్యతల నుంచి తక్షణమే రిలీవ్ చేస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో ఆయన అదనపు రెసిడెంట్ కమిషనర్ బాధ్యతలకే పరిమితం కానున్నారు. త్వరలో గౌరవ్ ఉప్పల్ రెసిడెంట్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు.

# ప్రైవేటు చేతుల్లోకి ఇండెంట్లు ఎలా వచ్చాయ్?

• ఈఎస్ఐ స్కాం విచారణలో ఆరా తీసిన ఏసీబీ
• మరికొన్ని రోజుల కస్టడీ కోరే అవకాశం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ఈఎస్ఐ స్కాంలో ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి ఇండెట్లు ఎలా వెళ్లాయి..? అనే ప్రధాన అంశంపై ఈఎస్ఐ డైరెక్టర్ డాక్టర్ దేవికారాణితో పాటు మరో ఆరుగురు నిందితులను రెండోరోజైన గురువారం బంజారా హిల్స్‌లోని ఏసీబీ ప్రధాన కార్యాలయంలో అధికారులు విచారించారు. ఈ స్కాంలో డిస్పెన్సరీలు, మెడికల్ ఏజన్సీలు, ఐఏఎస్ పాత్ర ప్రముఖంగా వినిపిస్తోంది. ఇంకా ఎంత మందికి ప్రమేయం ఉందన్న దానిపై అధికారులు సమాధానం రాబట్టే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. మందుల కొనుగోళ్లలో జీవో 51 నియమాలు ఎందుకు పాటించలేదని ప్రశ్నించినట్లు తెలుస్తోంది. మరోవైపు ఆస్తుల వివరాలు, బ్యాంకు లావాదేవాలపై కూడా కూపీ లాగినట్లు సమాచారం. తగిన సాక్ష్యాలను ముందుంచి సమాచారం రాబట్టేందుకు అధికారులు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. అయితే, అధికారులు ఆశించిన స్థాయిలో సమాచారం రాలేదని సమాచారం. ప్రైవేటు వ్యక్తుల చేతికి ఇండెంట్లు వెళ్లాయంటే.. గుర్తించిన దానికంటే భారీ స్కామ్ జరిగి ఉండొచ్చని అధికారులు భావించారు. ఇప్పటివరకు 13మందిని ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. విచారణ వేగం పుంజుకోవడంతో మిగిలిన అధికారుల గుండెల్లో గుబులు రేపుతోంది. ఒక పథకం ప్రకారం ఏసీబీ ముందుకు వెళ్తున్న క్రమంలో మరికొందరి అరెస్టులు అనివార్యమన్న వాదన బలంగా వినిపిస్తోంది. గురువారంతో రెండు రోజుల కస్టడీ ముగిసిన నేపథ్యంలో వారి నుంచి మరింత సమాచారం రాబట్టేందుకు కోర్టులో మరికొన్ని రోజుల కస్టడీ కోరుతూ పిటిషన్ వేసే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా కస్టడీ ముగియడంతో దేవికా రాణితో పాటు మరో ఐదుగురిని కోర్టులో హాజరుపర్చి చంచలగూడ జైలుకు తరలించారు. నిందితుడు హర్షవర్ధన్ ఆరోగ్యం బాగాలేకపోవడంతో చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.




## బ్యాంకులకు 3 ఏళ్లలో రూ. 1.76 లక్షల కోట్లు

# బడాబాబుల కుచ్చుటోపీ

**న్యూఢిల్లీ:** గత మూడేళ్లలో ఎగవేతదార్ల కారణంగా భారతీయ బ్యాంకింగ్ వ్యవస్థకు 1.76 లక్షల కోట్ల రూపాయల నష్టం వాటిల్లింది. మొత్తంగా 416 మంది ఎగవేత దారులు బ్యాంకులను నిలువునా ముంచేశారు. ఒక్కొక్కరు రూ.100 కోట్లు ఆపైన రుణాలు తీసుకుని ఎగ్గొట్టారు. అనంతర కాలంలో మొండిబకాయిల పేరిట ఈ మొత్తాన్ని బ్యాంకులు రద్దు చేశాయి. దీనిద్వారా సగటున ఒక్కో రుణగ్రహీతకు గరిష్టంగా రూ. 424 కోట్ల మేరకు ప్రయోజనం చేకూరినట్లు అయింది. రూ. 100 కోట్లు ఆపైన ఎగవేతకు పాల్పడిన రుణగ్రహీతల వివరాలు, భారీ మొండి బకాయిల చిట్టా స.హ. దరఖాస్తుతో తొలిసారి బయటకు వచ్చింది. ఆర్‌బీఐ నిబంధనల మేరకు అన్ని షెడ్యూల్, వాణిజ్య బ్యాంకులు మాఫీ చేసిన మొండి బకాయిల వివరాల్లో విస్తుగొలిపే అంశాలున్నాయి.




- 2014-15 నుంచి దేశంలోని ప్రభుత్వరంగ బ్యాంకులు, ప్రైవేటు బ్యాంకులు మాఫీ చేసిన మొండి బకాయిల మొత్తాల్లో స్థిరమైన పెరుగుదల కనిపించింది. 2015 - 2018 మధ్య కాలంలో మొత్తం 2.17 లక్షల కోట్ల రూపాయలను షెడ్యూల్ చేసిన వాణిజ్య బ్యాంకులు మొండిబాకీలుగా పేర్కొన్నాయి.
- రిజర్వు బ్యాంకు గణాంకాల ప్రకారం, 2015 సంవత్సరం నాటికి 109 మంది ప్రత్యేక రుణగ్రహీతలు రూ .40,798 కోట్ల మేరకు ఎగవేతకు పాల్పడ్డారు. మార్చి 2016 నాటికి ఎగవేత దారుల సంఖ్య 199కి చేరగా, మాఫీ చేయబడిన రుణాల విలువ రూ. 69,976 కోట్లుగా పేర్కొనబడింది.
- ఆ తర్వాత రెండేళ్ల కాలంలో, అంటే పెద్దనోట్ల రద్దు ప్రక్రియ తర్వాత బడాబాబుల రుణమాఫీ మరింత పెరిగింది. ఈ పీరియడ్‌లో రుణగ్రహీతల సంఖ్య 343కి చేరింది. 2016తో పోల్చితో 72శాతం అధికమన్నమాట. వీళ్ల పేరిట వేర్వేరు బ్యాంకుల్లో రూ 69,926 నుండి రూ.1,27,797 కోట్లు మొండి బకాయిలు రద్దయినట్లు తెలుస్తోంది.
- 31 మార్చి 2018 నాటికి ప్రత్యేక రుణగ్రహీతల సంఖ్య 525కిచేరింది. వీరికి చెందిన రుణాలు భారీ మొత్తంలో రద్దుచేయబడ్డాయి. దీంతో మొండి బకాయిల విలువ రూ .1.27 లక్షల కోట్ల నుండి రూ .2.17 లక్షల కోట్లకు పెరిగింది.
- కాగా 2014 సెప్టెంబర్‌కు ముందు రూ.100 కోట్లు అంతకు మించిన మొండి బకాయిల రద్దు డేటా అందుబాటులో లేదని ఆర్బీఐ సమాధానం సూచించింది.
- నిరర్థక ఆస్తుల్లో క్రమానుగత పెరుగుదల బ్యాంకులను నగదు లభ్యత సమస్యల్లోకి నెట్టింది. బెయిల్ అవుట్ పరిణామాలకు ప్రేరేపించింది. రుణాలు రద్దు చేసినప్పటికీ, వాటిని రాబట్టేందుకు చర్యలు కొనసాగుతున్నాయని బ్యాంకులు చెబుతున్నప్పటికీ, వాస్తవ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉన్నట్లు స్పష్టమైంది. 15-20 శాతానికి మించి రికవరీ సాధ్యం కావడం లేదని బ్యాంకింగ్ వర్గాలే పేర్కొంటున్నాయి.

## ఎన్నికల ప్రచారానికి రాహుల్...!

**న్యూఢిల్లీ:** మహారాష్ట్ర, హర్యానా ఎన్నికల ప్రచార బరిలోకి దించేందుకు రాహుల్ గాంధీ సిద్ధమవుతున్నారని తెలుస్తోంది. మహారాష్ట్రలో అక్టోబర్ 13, 15న, హర్యానాలో అక్టోబర్ 14న భారీ ర్యాలీలు నిర్వహించేందుకు కాంగ్రెస్ సిద్ధమైంది. ఈ మూడు ర్యాలీల్లో రాహుల్ గాంధీ పాల్గొంటారని హర్యానా నేతలు చెబుతున్నారు. కర్నాల్ టౌన్ నుంచి ఎన్నికల రోడ్ షో ద్వారా రాహుల్ తన ప్రచారం ప్రారంభిస్తారంటున్నారు.కేవలం మూడు ర్యాలీల్లో రాహుల్ పాల్గొంటుండటంపై కూడా నేతలు పెదవి విరుస్తున్నారు. విస్తృతంగా ప్రచారం చేస్తానని రాహుల్ గతంలో చెప్పారంటూ గుర్తు చేసుకుంటున్నారు. పార్టీలో అంతర్గత కుమ్ములాటల కారణంగానే రాహుల్ గాంధీ దూరంగా ఉన్నారని, రాహుల్ సన్నిహితులను పార్టీ అధినాయకత్వం పక్కనపెట్టిందని ఇద్దరు నేతలు బహిరంగంగానే విమర్శించారు.

## సీబీఐ, ఈడీకి మద్రాస్ కోర్టు నోటీసులు

**చెన్నై:** నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) కో-లోకేషన్ కేసులో చెన్నై ఫైనాన్సియల్ మార్కెట్స్ అండ్ అకౌంట్‌బిలిటీ (సీఎఫ్ఎంఎ) దాఖలు చేసిన పబ్లిక్ ఇంటరెస్ట్ లిటిగేషన్ (పిల్)ను విచారించేందుకు మద్రాస్ హైకోర్టు అంగీకరించింది. సెబీతోపాటు కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ, సీబీఐ, ఈడీలకు న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ (ఎస్ఎఫ్ఐఓ), ఇంటెలిజెన్స్ యూనిట్ (ఎఫ్ఐయూ)లను నవంబర్ 11లోగా తమ స్పందన తెలియజేయాలని హైకోర్టు కోరింది. కోలోకేషన్ ప్రక్రియలో ఎన్ఎస్ఈ ప్రాథమిక లక్ష్యాన్ని ఉల్లంఘించిందని తద్వారా మొత్తం సెక్యూరిటీ మార్కెట్ ఖర్చుతో ఎన్ఎస్ఈ ట్రేడ్ డేటాను యాక్సెస్ చేయడానికి కొంతమంది వాణిజ్య సభ్యులకు చట్టవిరుద్ధ ప్రాధాన్యతనిచ్చిందని పిటిషనర్ పిల్‌లో పేర్కొన్నారు. ఈ భారీ ఆర్థిక కుంభకోణాన్ని వెలికి తీయడానికి సెబీ ఎటువంటి ప్రభావవంతమైన చర్యలు తీసుకోలేదని పిల్‌లో తెలిపారు. ఆర్డర్ బుక్ డేటాను సాపేక్షంగా ఆలస్యం చేయడంతో అనేకమంది పెట్టుబడిదారులు భారీ నష్టాలను చవిచూశారని పిల్‌లో తెలిపారు.

## చట్టబద్ధమైతే విచారణకు ఓకే..!



**వాషింగ్టన్:** నిబంధనలు న్యాయం గా ఉంటే డెమొక్రాట్ల నేతృత్వంలో తనపై జరుగుతున్న అభిశంసన విచారణలో పాల్గొంటానని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తెలిపారు. బుధవారం వైట్‌హౌస్ వద్ద విలేఖరులు ఆయనతో మాట్లాడుతూ అభిశంసనపై డెమొక్రాట్ల విచారణకు సహకరిస్తారా అని ప్రశ్నించగా వారు మా హక్కులను ఇస్తే విచారణకు సహకరిస్తామని ట్రంప్ తెలిపినట్టు జిన్హువా వార్తా సంస్థ నివేదించింది. ట్రంప్ ఉక్రెయిన్‌తో లోపాయికారిగా వ్యవహరించారనే ఆరోపణలపై హౌస్ స్పీకర్ నాన్సీ పెలోసీ సెప్టెంబర్ 24 అభిశంసన విచారణను ప్రారంభించారు. 2020 ఎన్నికలలో జోక్యం చేసుకోవాలని విదేశీ శక్తులపై ఒత్తిడి తెచ్చిన ట్రంప్ వాస్తవాలను దాచేందుకు చట్టవిరుద్ధంగా ప్రయత్నిస్తున్నారని పెలోసి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారని వచ్చిన ఆరోపణలను ట్రంప్ ఖండించారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడైమిర్ జెలెన్స్కీపై తను ఎటువంటి ఒత్తిడి తీసుకురాలేదని తెలిపారు.

## పాక్‌లో హిందూ బాలికకు మతమార్పిడి

**ఇస్లామాబాద్:** పాకిస్థాన్‌లోని సింధ్‌లో ఓ హిందూ బాలికను కొంతమంది ముస్లింలు కిడ్నాప్ చేసి బలవంతంగా ఇస్లాం మతంలోకి మార్చారని బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపారు. ఉత్తర సింధ్‌లోని ప్రథమ సంవత్సర వైద్య విద్యార్థి నమ్రిత మంచంపై మెడకు వస్త్రంతో కట్టిఉండగా గుర్తించామని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె గదిలోపల నుంచి లాక్ చేసి ఉండగా ఈ ఘటన జరిగిందని, అయితే ఆమె ఆత్మహత్య చేసుకున్నట్టు చిత్రీకరించి పోలీసులు, అధికారులు సంఘటన తక్కువ చేయడానికి ప్రయత్నించారని వారు ఆరోపించారు. నమ్రితను హత్య చేసినట్టు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని ఆమె సోదరుడు వైద్య కన్సల్టెంట్ విశాల్ తెలిపారు. ప్రతి సంవత్సరం 12 నుంచ 28సంవత్సరాల మధ్య వయస్సుగల వెయ్యిమంది సింధీ హిందూ బాలికలను కిడ్నాప్‌చేసి బలవంతంగా ఇస్లాం మతంలోకి మారుస్తున్నట్టు అమెరికాకు చెందిన సింధీ ఫౌండేషన్ తెలిపింది.

# సాహిత్యంలో ఇద్దరికి నోబెల్

- 2018, 19 సంవత్సరాలకు అవార్డుల ప్రకటన
- ఓల్గా టోకార్జుక్, పీటర్ హ్యాండ్కేకు లిటరేచర్ నోబెల్స్





**స్టాక్‌హోమ్:** పోలాండ్ రచయిత్రి ఓల్గా టోకార్‌జుక్ సాహిత్యంలో నోబెల్ పురస్కారం లభించింది. లైంగిక వేధింపుల కుంభకోణం కారణంగా ఆలస్యమైన 2018 సాహిత్య నోబెల్‌ను స్వీడిష్ అకాడమీ గురువారం ప్రకటించింది. అదేవిధంగా 2019 సంవత్సరానికి ఆస్ట్రియన్ నవలా రచయిత, నాటక రచయిత పీటర్ హ్యాండ్కేను వరించింది. సమకాలీన పోలిష్(పోలాండ్) రచయితల్లో టోకార్‌జుక్ అత్యంత ప్రతిభావంతురాలిగా గుర్తింపు పొందారు. "ఎన్సైక్లోపీడిక్ అభిరుచితో జీవిత సరిహద్దులను దాటడాన్ని వర్ణిస్తూ రచించిన కాల్పనిక నవలకు గాను ఆమెను నోబెల్ వరించింది.

ఆమె రచనలు పాలిక్రోమటిక్ ప్రపంచాన్ని నిరంతరం చలనంలో ఉండేలా చేస్తుంటాయి. పాత్రల లక్షణాలు ఒకదానితో ఒకటి కలిసిపోయి ఉండటమే కాకుండా, స్పష్టమైన, కవితాత్మకమైన భాష ఆమె రచనల్లో కనిపిస్తుంది.

ఇక ఆస్ట్రియా రచయిత పీటర్ హ్యాండ్కే భాషా చాతుర్యంతో, మానవ అనుభవాల విశిష్టతను అన్వేషించడంలో చేసిన ప్రతిభావంతమైన కృషికి ప్రతిష్ఠాత్మక పురస్కారం గెలుచుకున్నారు. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఐరోపాలో అత్యంత ప్రభావవంతమైన రచయితలలో ఒకరిగా హ్యాండ్కే ప్రసిద్ధులయ్యారు. ఆయన రచనలు నూతన సాహిత్య వ్యక్తీకరణలను కనుగొనడంలో ప్రత్యేకతను సంతరించుకున్నాయని న్యాయనిర్ణేతలు అభిప్రాయపడ్డారు. నోబెల్ పురస్కారం కింద టోకార్‌జుక్, హ్యాండ్కేలకు ఒక్కొక్కరికి 828,000 యూరోల నగదు బహుమతి లభిస్తుంది. 1901 నుంచి సాహిత్య నోబెల్ అందుకున్న 116 మంది రచయితల్లో, టోకార్జుక్ 15 వ మహిళగా గుర్తింపు పొందారు.

# 'మహా'లో 'ఉత్తర' లొల్లి!

- టికెట్ల కేటాయింపులో ఉత్తర భారతీయులకు బీజేపీ, కాంగ్రెస్ మొండి చేయి
- ఉత్తర భారతంలో పార్టీలపై ప్రభావం

**న్యూఢిల్లీ:** మహారాష్ట్రఅసెంబ్లీ ఎన్నికల్లో ఈసారి అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్ పార్టీలు ఉత్తర భారతీయులకు టికెట్ కేటాయించకపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అధికార పార్టీ బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీపై ఉత్తర భారతీయులు ఆగ్రహంగా ఉన్నట్టు సమాచారం.ఉత్తర భారతీయులంటే అంత చులకనా...? అంత నిర్లక్ష్య మా..? అన్న విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. 2014 ఎన్నికల్లో విద్యా ఠాకూర్, మోహిత్ కంబోజే, అమర్‌జీత్ సింగ్, సునీల్ యాదవ్‌తో పాటు మరో నలుగురికి బీజేపీ టికెట్ ఇచ్చింది. అదే విధంగా కాంగ్రెస్ పార్టీ కూడా అర డజన్ కంటే ఎక్కువ మంది ఉత్తర భారతీయులకు పోటీలో నిలిపింది. కానీ ఈసారి మాత్రం బీజేపీ కేవలం ముగ్గురు ఉత్తర భారతీయులు, హిందీ మాట్లాడేవారికి మాత్రమే టికెట్ ఇచ్చింది. ఇందులో మలాడ్ పశ్చిమ నియోజకవర్గం నుంచి రమేష్ సింగ్ ఠాకూర్, గోరేగావ్ నుంచి విద్యా ఠాకూర్ (ఉత్తర్ భారతీయ నేత), హిందీ భాష నాయకుడు మంగల్ ప్రభోధ్ లోడాకు (మలబార్ హిల్స్) మాత్రమే టికెట్ కేటాయించారు. ముంబై బీజేపీ కీలక నేత అమర్‌జీత్ మిశ్రా, మాజీ ఎమ్మెల్యే రాజ్‌హాంస్ సింగ్, రెండు ఎమ్మెల్యేగా గెలిచిన అభిరామ్ సింగ్, సంజయ్ పాండే, మోహిత్ కంబోజే, సునీల్ యాదవ్ వంటి కీలక ఉత్తర భారతీయ నేతలు ఎవరికీ టికెట్ బీజేపీ టికెట్ కేటాయించ లేదు.

### బీజేపీ బాటలో కాంగ్రెస్

కాంగ్రెస్‌లో హిందీ మాట్లాడే కేవలం ఐదుగురికి మాత్రమే టికెట్ ఇచ్చింది. వారిలో ఆనంద్ శుక్లా (యశ్‌భూమి న్యూస్ పేపర్ ఎడిటర్)కు ఘాట్‌కోపర్ వెస్ట్, అజంతా యాదవ్ (కాందీవలీ ఈస్ట్), గోవింద్ సింగ్ (ములుంద్), అస్లాం షేక్ (మలాడ్ వెస్ట్), నసీం ఖాన్ (చాందీవలీ)లు ఉన్నారు.

### కూటమియే కారణం..!



ఉత్తర భారతీయులకు టికెట్‌లు దక్క కపోవడం వెనుక కూటమి ప్రధాన కారణమని సీనియర్ జర్నలిస్టు విజయ్ సింగ్ కౌశిక్ అభిప్రాయపడుతున్నారు. 2014లో బీజేపీ, శివసేనలు వేర్వేరుగా పోటీ చేశాయని, అందుకే ఉత్తర భారతీయులకు టికెట్‌లు దక్కలేదన్నారు. ఉతర భారతీయులను తమవైపు తిప్పుకునేందుకు బీజేపీ కంటే కాంగ్రెస్ అధిక సీట్లు కేటాయిస్తుందని అంచనా వేసిన విషయం తెలిసిందే.

### మోడీ రాకతో మారిన సమీకరణాలు

ముంబైలో సుమారు 40 లక్షల మంది ఉద్యోగాలు, పని కోసం ఉత్తర్‌ప్రదేశ్, బిహార్ వంటి రాష్ట్రాల నుంచి వలస వచ్చిన వాళ్లే ఉంటారు. 2014 ఎన్నికల వరకు వీరంతా కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉండేవారు. కానీ 2014 తర్వాత పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోడీ విజయ ఢంకా మోగించడంతో బీజేపీ మహారాష్ట్రలో మరింత బలంగా తయారైంది. కాంగ్రెస్ నుంచి ప్రాతినిథ్యం వహించే ఉత్తర భారతీయ నేతలు ఎవరూ లేకపోగా.. ఉన్నవారంతా బీజేపీలోకి వెళ్లిపోవడంతో హస్తం పార్టీకి ఎదురుదెబ్బ తగిలినట్టయ్యింది. 2014, 2019 ఎన్నికల సరళిని పరిశీలిస్తే.. కాంగ్రెస్‌కు ఉత్తర భారతీయులు గట్టి షాక్ ఇచ్చేలా కనిపిస్తున్నారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

### శివసేనకు షాక్

26 మంది శివసేన కార్పొరేటర్లు, 300 మందికిపైగా కార్యకర్తలు పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. తమ రాజీనామా లేఖలను ఆ పార్టీ చీఫ్ ఉద్దవ్ ఠాక్రేకు గురువారం పంపించారు. బీజేపీ, శివసేన కూటమిగా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తుండటమే దీనికి కారణం. ఈ సమయంలో శివసేనకు ఇదో పెద్ద దెబ్బ తగిలినట్టయ్యింది. టికెట్ల కేటాయింపులో అనుకున్నవారికి మొండిచేయి ఎదురవ్వడంతో వారంతా ఆగ్రహంగా ఉన్నారు. లేఖలను ఉద్దవ్ ఠాక్రేతో పాటు మంత్రి ఏక్‌నాథ్ షిండే, కల్యాణ్ ఎంపీ శ్రీకాంత్ షిండేకు పంపినట్టు వివరించారు. 26 మంది కార్పొరేటర్లలో వివిధ ప్రాంతాలకు చెందినవారున్నారు.

## రైల్వే ప్రైవేటు బాట!



**న్యూఢిల్లీ:** రైల్వేను ప్రైవేటు ట్రాక్ ఎక్కించేందుకు కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. తొలివిడతలో 150 రైళ్లు, 50 రైల్వే స్టేషన్ల నిర్వహణ బాధ్యతలను ప్రైవేటు సంస్థలకు అప్పగించాలని నిర్ణయించింది. నిర్ణీత కాలవ్యవధిలో ఈ పక్రియను పూర్తిచేయాలని సంకల్పించింది. ఇందుకు సంబంధించిన విధివిధానాల రూపకల్పనకు టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసేపనిలో నిమగ్నమైంది. ఈ మేరకు సాధికార బృందాన్ని నియమిస్తున్నట్లు నీతిఅయోగ్ సీఈవో అమితాబ్‌కాంత్ నుంచి లేఖ అందిందని రైల్వేబోర్డు చైర్మన్ వీకే యాదవ్ గురువారం వెల్లడించారు. అమితాబ్‌కాంత్, వీకే యాదవ్‌తోపాటు ఆర్థిక వ్యవహారాలశాఖ కార్యదర్శి, గృహనిర్మాణ, పట్టణ మంత్రిత్వశాఖ కార్యదర్శి సాధికార బృందంలో సభ్యులుగా ఉంటారు. ప్రైవేటీకరణ అవశ్యకతపై అమితాబ్‌కాంత్ మీడియా సమావేశంలో వివరించారు. దేశవ్యాప్తంగా 400 రైల్వే స్టేషన్లను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాల్సివుండగా, వాటిలో కొన్ని స్టేషన్లు మాత్రమే అభివృద్ధి చేశారని చెప్పారు. తాను రైల్వే మంత్రితో వివరణాత్మక చర్చ జరిపానని, కనీసంగా 50 స్టేషన్ల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని నిర్ణయించామని అన్నారు.

పాసింజర్ రైలు కార్యకలాపాల కోసం ప్రైవేట్ ఆపరేటర్లను తీసుకురావాలని రైల్వే మంత్రిత్వ శాఖ ఇదివరకే నిర్ణయించిందని, మొదటి దశలో 150రైళ్లను ప్రైవేటీకరిస్తామని చెప్పారు. ఇంజనీరింగ్ రైల్వే బోర్డు సభ్యుడు, ట్రాఫిక్ రైల్వే బోర్డు సభ్యుడు తప్పనిసరిగా సాధికారిక బృందంలో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. అక్టోబర్ 4న లక్నో- ఢిల్లీ మార్గంలో ప్రవేశపెట్టిన తేజస్ ఎక్స్‌ప్రెస్, తొలి ప్రైవేటు ఆపరే టింగ్ రైలుగా గుర్తింపు పొందింది. ప్రైవేటు రైళ్లలోనూ ఐఆర్‌సిటిసి ద్వారా కాంబి నేషన్ భోజనం, రూ .25 లక్షల వరకు ఉచిత బీమా, ఆలస్యం జరిగితే పరిహారం వంటి సౌకర్యాలను ప్రయాణికులకు కొనసాగించడం జరుగుతుందన్నారు.

## 'డ్రోన్ల కుట్ర' పాక్ ప్రభుత్వ సంస్థలదే

**న్యూఢిల్లీ:** సెప్టెంబర్ నెల్లో భారత భూభాగంలో డ్రోన్ల ద్వారా ఆయుధాలు జారవిడిచిన కుట్రలో పాక్ ప్రభుత్వరంగ సంస్థల హస్తముందని భారత హోంమంత్రిత్వశాఖ గురువారం వెల్లడించింది. ఆయుధాలు జారవిడిచిన ఘటనలో పాక్ ప్రభుత్వ సంస్థల పాత్రపై దర్యాప్తు చేపట్టాలని ఎన్ఐఏకి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. డ్రోన్లను ఆపరేటింగ్ చేయడానికి ఫ్రీకెన్సీ ఎక్కడి నుంచి అందిందో గుర్తించాలని నేషనల్ టెక్నికల్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఎన్టీఆర్వో)ను ప్రభుత్వం కోరింది. ఫ్రీకెన్సీని గుర్తించే పనిలో ఎన్టీఆర్వో ఇప్పటివకే నిమగ్నమైంది. ఈ మేరకు ఇంటెలిజెన్సీ సంస్థలు ప్రభుత్వానికి నివేదిక అందించాయి. అయితే సరిహద్దులో డ్రోన్లు తిరుగాడుతున్నా ఇండియన్ ఎయిర్ ఫోర్స్, సరిహద్దు భద్రతా దళాలు ఎందుకు గుర్తించలేక పోయాయని ఇంటిలిజెన్సీ ఏజెన్సీలు సందేహాలు వ్యక్తం చేశాయి. ఇదిలావుం డగా సెప్టెంబర్ నెల్లో పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో పాక్‌కు చెందిన డ్రోన్లు ఆయుధాలను జారవిడిచాయి. ఇందులో ఏకే-47 రైఫిళ్లు, గ్రానేడ్లు కూడా ఉన్నాయి. గుర్తించిన పంజాబ్ అధికారులు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు..

## సింగ్ గారు... కర్తార్‌పూర్‌కు రండి



**న్యూఢిల్లీ:** గురు నానక్ 550వ జయంతి సందర్భంగా నవంబర్ 9న కర్తార్‌పూర్ కారిడార్ ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌ను పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ గురువారం అధికారికంగా ఆహ్వానించారు. ఈ విషయాన్ని పాకిస్తాన్ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కూడా ధ్రువీకరించింది. కర్తార్‌పూర్ కారిడార్ అనుకున్న సమయానికి కచ్చితంగా ప్రారంభం అవుతుందని, ఇందులో ఎలాంటి ఆలస్యం జరగదని, ఈ విషయంలో ఇమ్రాన్ ఖాన్ దృఢ నిశ్చయంతో ఉన్నారని పాకిస్తాన్ విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి చెప్పుకొచ్చారు. మరోవైపు ప్రారంభోత్సవానికి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని మోడీతో పాటు మాజీ ప్రధాని మన్మోహన్ వెళ్తారని పంజాబ్ సీఎం కెప్టెన్ అమరిందర్ సింగ్ కొన్ని రోజుల క్రితం చెప్పుకొచ్చారు. ఈ విషయమై మన్మోహన్ సింగ్ కూడా వెళ్లడానికి అంగీకరించినట్టు సింగ్ తెలిపారు. అయితే అనూహ్యంగ పాకిస్తాన్ కేవలం మన్మోహన్‌ను మాత్రమే ఆహ్వానించింది.

# భారత్ శక్తి ప్రపంచానికి తెలుసు

- 370 రద్దుపై రాహుల్, పవార్ వైఖరి చెప్పాలి
- మోడీ ప్రభుత్వంలో దేశ భద్రత పటిష్టం
- సాంగ్లీ ఎన్నికల ప్రచారంలో బీజేపీ అధ్యక్షుడు షా



**ముంబై:** ఒక భారతీయ జవాన్‌ను చంపితే, బదులుగా 10మంది శత్రువులు చంపబడతారని ప్రపంచానికి తెలుసునని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. గురువారం మహారాష్ట్రలోని సాంగ్లీ జిల్లాలో షా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మోడీ ప్రభుత్వంలో జాతీయ భద్రత బలపడిందని, 2016లో సర్జికల్ స్ట్రైక్స్ తర్వాత భారతదేశం భిన్నంగా కనిపించిందని గుర్తుచేశారు. జమ్ము-కాశ్మీర్‌లో రాజ్యాంగంలోని ఆర్టికల్ 370 రద్దుచేసి, స్వేచ్ఛను ప్రసాదించిన ప్రధాని మోడీ నిర్ణయానికి యావత్ ప్రపంచం అండగా నిలిచిందని చెప్పారు. ఈ విషయంపై కాంగ్రెస్, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీలు భిన్నంగా స్పందించాయని విమర్శించారు. ఇప్పటికైనా దీనిపై వారి వైఖరేంటో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.

ఆర్టికల్ 370రద్దు ప్రతిపాదన తీసుకొచ్చినప్పుడు, కాంగ్రెస్, ఎన్‌సిపి రెండూ దీన్ని వ్యతిరేకించాయని షా గుర్తుచేశారు. ఆర్టికల్ 370 రద్దును ఎందుకు వ్యతిరేకిస్తున్నారో రాహుల్ గాంధీ, శరద్‌పవార్ ఇద్దరు మహారాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని నిలదీశారు.

కాశ్మీర్‌లో రక్తపుటేరు ఉంటుంది, కానీ బుల్లెట్ పేల్చాల్సిన అవసరం లేదని రాహుల్ చేసిన వ్యాఖ్యలను షా ప్రస్తావించారు. ఇటీవల ఐక్యరాజ్య సమితి సదస్సులోనూ ప్రధాని మోడీ ప్రపంచం మద్దతు కూడగట్టగా, మరోవైపు పాక్ ప్రధాని ఒంటరిగా ఓ మూల నిలబడ్డారని అన్నారు. 1971లో ఇండియా-పాక్ యుద్ధం తరువాత భారత్ విజయానికి మాజీ ప్రధాని ఇందిరా గాంధీని అభినందించిన మొదటి వ్యక్తి అటల్ బిహారీ వాజ్‌పేయి అని షా పేర్కొన్నారు.

అప్పుడు తాము ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ, దేశం కోణంలోనే స్పందించామని బీజేపీ అధ్యక్షుడు తెలిపారు. సాంగ్లీలోని 11 లక్షల మంది రైతులకు ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ 3,700 కోట్ల రూపాయల రుణాలను మాఫీ చేశారని, 1.7 లక్షల మందికి మరుగుదొడ్లు నిర్మించారని, 46,000 మందికి గ్యాస్ కనెక్షన్లు ఇప్పించారని అమిత్‌షా చెప్పారు. 15 ఏళ్ల శరద్ పవార్, కాంగ్రెస్ ప్రభుత్వం ఏలుబడిలో రాష్ట్రం దోపిడీకి గురైందని విమర్శించారు.

ఉగ్రవాదం నిర్మూలన, దేశ రక్షణకు మోడీ కృషి చేశారని అన్నారు. మన్మోహన్ సింగ్ ప్రభుత్వంలో, పాకిస్తాన్ నుండి ఉగ్రవాదులు యధేచ్ఛగా చొరబాట్లకు పాల్పడ్డారని, మన సైనికులను హతమార్చారని చెప్పారు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిందని, సరిహద్దులు దాటేందుకు శత్రువులు, ముష్కరులు హడలిపోతున్నారని అన్నారు.

## నడ్డాకు జడ్ కేటగిరి భద్రత

**న్యూఢిల్లీ:** బీజేపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జేపీ నడ్డాకు కేంద్రం జడ్ కేటగిరీ భద్రత కల్పించింది. ఇకపై ఆయన చుట్టూ సీఆర్‌పీఎఫ్ కమాండోలు భద్రతగా నిలువనున్నారు. దాదాపు గత నాలుగు నెలలుగా అధికార పార్టీకి సంబంధించిన కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయనకు ముప్పు పొంచి ఉండే అవకాశం ఉందన్న భావనతో కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. దేశంలో ఎక్కడి వెళ్లినా ఇదే రకమైన భద్రత కొనసాగుతుందని హోం శాఖ అధికారి వెల్లడించారు. దీని ప్రకారం నడ్డాకు మొత్తం 35 మంది సీఆర్‌పీఎఫ్ కమాండోలు రక్షణగా ఉండనున్నారు. వంతుల వారీగా చూస్తే ప్రతి క్షణం ఆయన చుట్టూ ఎనిమి ది నుంచి తొమ్మిది మంది కమాండోలు భద్రత కవచంగా ఉంటారు. ఆయన నివా సం, కార్యాలయం వద్ద కూడా భద్రతను కట్టుదిట్టం చేస్తున్నట్టు హోం శాఖ ప్రకటించింది.

## అత్యాధునిక డ్రోన్ తయారీ

**చెన్నై:** వరద ప్రాంతాల్లో చిక్కుకున్న వారిని గుర్తించి ఆదుకునేందుకు ఐఐటీ మద్రాస్ విద్యార్థులు కొత్త తరహా డ్రోన్‌ను తయారు చేశారు. బాధితులు ఉన్న ప్రాంతాన్ని గుర్తించి అధికారులకు సమాచారం చేరవేసేలా సరికొత్త డ్రోన్‌ను రూపొందిం చారు. సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ అభివృద్ధి చేసిందని, ఈ ప్రాజెక్టుకు 'ఐ ఇన్ ది స్కై' అని పేరు పెట్టారని ఇన్‌స్టిట్యూట్ అధికారులు తెలిపారు. కృత్రిమ మేధస్సు, కంప్యూటర్ విజన్‌తో డ్రోన్‌లను తయారు చేయడం జరిగిందని, శిథిలాల కింద చిక్కుకుని ఉన్న సమయంలో శరీరంలోని ఒక భాగం కనిపించినా గుర్తిస్తుందని వివరించారు. ఎత్తయిన ప్రాంతాల్లో కూడా విపత్తులు సంభవించినప్పుడు డ్రోన్ ఎంతో బాగా పని చేస్తుందని చెప్పారు. బాధితుడు ఎలాంటి పరిస్థితిలో ఉన్నాడు అనే సమాచారాన్ని రెస్క్యూ బృందానికి చేరవేస్తుందని, అదేవిధంగా ఏరియల్ సర్వే కోసం ఉపయోగపడుతాయని తెలిపారు. విపత్తు ప్రాంతాల్లో భోజనం, నీరు, మందులు అందజేయడానికి ఈ డ్రోన్లు దోహదపడేలా తయారు చేసినట్టు వివరించారు. ఐఐటీ బొంబాయిలో ఇటీవల జరిగిన ఇండియన్ ఇన్నోవేషన్ గ్రోత్ ప్రోగ్రాం (ఐఐజీపీ 2.0) యూనివర్సిటీ ఛాలెంజ్ ఫైనల్స్‌లో 'ఐ ఇన్ ది స్కై' ప్రాజెక్టు దేశ వ్యాప్తంగా టాప్ 18 ఇన్నోవేటివ్ స్టార్టప్‌లో తొలిస్థానంలో నిలిచింది.

## పరువు నష్టం కేసులో సూరత్ కోర్టుకు రాహుల్

**సూరత్:** లోక్‌సభ ఎన్నికలకు ముందు కర్ణాటకలో ఎన్నికల ర్యాలీలో మాట్లాడుతూ.. దొంగలందరికీ సాధారణ ఇంటి పేరు మోడీగా ఉందంటూ చేసిన రాహుల్ వ్యాఖ్యలపై దాఖలైన పరువునష్టం కేసుకు సంబంధించి సూరత్ కోర్టులో రాహుల్‌గాంధీ హాజరయ్యారు. ఈ కేసులో కోర్టు చర్యల నుంచి మినహాయింపు ఇవ్వాలని రాహుల్ అభ్యర్థించారు. దేశం విడిచి పారిపోయిన ఆర్థిక కుంభకోణ నిందితులను తిరిగి తీసుకురావడంలో ప్రధాని వైఫల్యాన్ని తను ఎత్తిచూపిస్తూ ఈ వ్యాఖ్యలు చేశానని రాహుల్ వివరణ ఇచ్చారు. గాంధీ అభ్యర్థనపై డిసెంబర్ 10న విచారిస్తామని ఆ విచారణకు రాహుల్ హాజరుకానవసర లేదని న్యాయమూర్తి తెలిపారు. సంఘీభావం తెలిపేందుకు వచ్చిన కాంగ్రెస్ కార్యకర్తల ట్వీట్టర్ వేదికగా రాహుల్ కృతజ్ఞతలు తెలిపారు.

# సింధు ప్రజల రూపురేఖలపై ప్రయోగాలు

- పూర్వీకుల ముఖాకృతి గుర్తింపునకు పరిశోధనలు
- సీఎఫ్ఆర్, 3డీ కంప్యూటర్ టెక్నాలజీతో అధ్యయనం



**న్యూఢిల్లీ:** సింధు నాగరికత కాలం నాటి వ్యక్తుల ముఖాకృతిని పునర్ నిర్మించేందుకు సరికొత్త ప్రయోగాలు జరుగుతున్నాయి. శాస్త్రవేత్తల బృందం తొలిసారిగా ఈ తరహా పరిశోధనకు శ్రీకారం చుట్టింది. సింధులోయ సమాధుల్లోని 37 అవశేషాలను తమ ప్రయోగానికి ఎంచుకుంది. ఆధునిక టెక్నాలజీ ఆధారంగా ఇందులో రెండు ముఖాలకు పూర్వరూపం తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. 4500 ఏళ్ల కిందటి రాఖిగార్హి సమాధిలోని పుర్రెలను తమ పరిశోధనలకు వాడుతున్నారు. వివిధ రంగాలకు చెందిన 15 మంది శాస్త్రవేత్తలు, వేర్వేరు పరిశోధనా సంస్థలకు చెందిన ఆరుగురు పరిశోధకులు బృందంలో ఉన్నారు. క్రానియోఫేసియల్ రీకన్‌స్ట్రక్షన్ టెక్నిక్ (సీఎఫ్ఆర్)ను కంప్యూటర్ టొమోగ్రాఫీ (సీటీ) డేటాకు అనుసంధానించడం ద్వారా పుర్రెలకు పూర్వ ఆకృతిని సృష్టించడమే వీరి పరిశోధనల లక్ష్యం. డబ్ల్యూ జే లీ, వసంత్ షిండే సారథ్యంలో ఈ పరిశోధనకు జాతీయ జియోగ్రఫిక్ సొసైటీ ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నది. ఈ విషయాలను వివరిస్తూ అనటోమికల్ సైన్స్ ఇంటర్నేషనల్ జర్నల్ ప్రత్యేక కథనం ప్రచురించింది.

సింధు నాగరిక ప్రజలు ఎలా ఉంటారో మనకెవరికీ తెలీదు. మా పరిశోధనలతో దీన్ని ఛేదిస్తున్నామని రాఖిగార్హి ఆర్కియాలజీ ప్రాజెక్టు సారథి షిండే చెప్పారు. ఇండస్‌వ్యాలీ సమాధులపై సమగ్ర అధ్యయనాలు జరగలేదు. సింధు ప్రజల రూపురేఖ లను స్పష్టంగా గుర్తించేందుకు పుర్రెల ఆధారంగా సేకరించిన ఆంథ్రోపాలజీ డేటా సవివరంగా లేదు. అయితే, రాఖిగార్హి పుర్రెల్లో రెండింటిపై సీఎఫ్ఆర్ టెక్నాలజీ ఉపయోగించి కొంతమేరకు విజయం సాధించాం. వీరిలో కాకేసియన్ లక్షణాలు కనిపించాయి. పైగా వీరి ముక్కులు రోమన్ ముక్కులను పోలివున్నాయి. మిగతా ప్రక్రియకు ఇది మరింత ప్రేరణ ఇస్తుంది అని డెక్కన్ కాలేజీ పీజీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ప్రొఫెసర్ అయిన షిండే వివరించారు.



# రెండో టెస్టులోనూ సెంచరీ

ఒక్కో సెషన్‌లో ఒక్కో వికెట్
భారీ స్కోరు దిశగా భారత్

# మయాంక్ మళ్లీ..

సిరీస్ తొలి టెస్టులో డబుల్ సెంచరీ. రెండో టెస్టులో మరో సెంచరీ. ఇదీ... మయాంక్ అగర్వాల్ ప్రదర్శన. 28 ఏళ్ల మయాంక్ అగర్వాల్ తొలి సెంచరీనే డబుల్ సెంచరీగా మలచి అది గాలివాటం కాదని రెండో టెస్టులోనూ సెంచరీతో నిరూపించాడు. తొలి రోజు ఆట నిస్సందేహంగా మయాంక్‌దే. అతడు ఎంత సాధికారికంగా ఆడాడంటే అతని స్కోరులో మూడోవంతు పరుగులు బౌండరీల ద్వారానే వచ్చాయి. అనుభవరాహిత్యం సౌతాఫ్రికా బౌలర్లలో కొట్టొచ్చినట్టు కనబడింది. ఒక్కో సెషన్‌లో ఒక్కో వికెట్ మాత్రమే దక్కాయి. అవికూడా భారత్‌లో ఐపీఎల్ ఆడిన రబాడేకే దక్కడం గమనార్హం.

**పుణె :** రెండో టెస్టులోనూ తొలిరోజు టీమిండియా ఆధిపత్యం ప్రదర్శించింది. తొలి టెస్టులో డబుల్ సెంచరీ హీరో మయాంక్ అగర్వాల్ మరోసారి సఫారీ బౌలర్లను ఆటాడుకున్నాడు. వరుసగా రెండో టెస్టులోనూ సెంచరీ సాధించి తొలి టెస్టు ప్రదర్శన గాలివాటం కాదని నిరూపించుకున్నాడు. అనుభవంలేని సౌతాఫ్రికా బౌలర్ల బలహీనత మరోసారి బహిర్గతమైంది. ఒక్కో సెషన్‌లో దక్షిణాఫ్రికాకు ఒక్కో వికెట్ మాత్రమే లభించిందంటే భారత బ్యాట్స్‌మెన్ ఎంత సాధికారికంగా ఆడారో అర్థమౌతోంది. మయాంక్ సెంచరీ(195 బంతుల్లో 108, 16 ఫోర్లు, 2 సిక్సర్లు), పుజారా(112 బంతుల్లో 58, 9 ఫోర్లు, 1 సిక్సర్), కెప్టెన్ కోహ్లీ(105 బంతుల్లో 63 బ్యాటింగ్, 10 ఫోర్లు) అర్థసెంచరీలు చేయడంతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి టీమిండియా 3 వికెట్లకు 273 పరుగులు చేసి భారీ స్కోరు దిశగా పయనిస్తోంది. ఐపీఎల్‌లో ఆడిన అనుభవంతో రబాడా వికెట్లను సాధించడం మినహా సౌతాఫ్రికా ఏమాత్రం భారత్‌కు సరితూగలేకపోయింది. వెలుతురు లేని కారణంగా 86వ ఓవర్ తొలి బంతి తరువాత ఆటను నిలిపివేశారు.

## రోహిత్ వైఫల్యం(లంచ్ 77/1)

అనుభవ లేమితో కొట్టుమిట్టాడుతున్న సౌతాఫ్రికా బౌలర్ల అనుభవ రాహిత్యం తొలిరోజు తొలి సెషన్‌లోనే కొట్టొచ్చినట్టు కనిపించింది. తొలి టెస్టులో రెండు ఇన్నింగ్స్‌లలో సెంచరీలు సాధించిన రోహిత్ ఈసారి విఫలమయ్యాడు. రబాడా బౌలింగ్‌లో ఆఫ్‌స్టంప్‌మీదుగా వేసిన బంతి అనూహ్యంగా పైకిలేచి రోహిత్ బ్యాట్ అంచును ముద్దాడి కీపర్ డికాక్ చేతిలో ఒదిగింది. దీనితో 25 పరుగులవద్ద ఇండియా తొలి వికెట్ కోల్పోయింది. తరువాత వచ్చిన పుజారా ఖాతా తెరవకముందే రబాడా బౌలింగ్‌లో అందించిన క్యాచ్‌ను బవుమా జారవిడవడంతో బతికిపోయాడు. ఆపై మయాంక్‌కు మద్దతుగా నిలిచి స్కోరును ముందుకు నడిపించాడు. రబాడాను సాధికారికంగా ఎదుర్కొన్న మయాంక్ మూడో బౌలర్ రాగానే విరుచుకుపడ్డాడు. పొడగరి ఆన్రిచ్ నార్జెను బౌలింగ్‌కు దించడం భారత్‌కు కలిసొచ్చింది. అతడి తొలి అయిదు ఓవర్లలో భారత బ్యాట్స్‌మెన్ 27 పరుగులు కొల్లగొట్టారు. అత్యంత వేగంగా బౌలింగ్ చేయగల నార్జె బంతులను మయాంక్ కవర్ బౌండరీలకు తరలించి ఆధిపత్యం ప్రదర్శించాడు. ముందుగా మిడాఫ్‌లో బౌండరీ కొట్టిన మయాంక్ తరువాత కవర్స్‌మీదుగా మరో రెండు అద్భుత బౌండరీలు సాధించాడు. నార్జె వేసిన ఫుల్‌లెంగ్త్ డెలివరీలను మయాంక్ ఫ్రంట్‌ఫుట్‌తో వాటిని బౌండరీలు దాటించాడు. ఆరంభంలో పుజారా నిదానించినా స్పిన్నర్ మహరాజ్ రంగప్రవేశంతో విజృంభించాడు. అతని తొలి ఓవర్‌లోనే పుజారా మిడాన్‌మీదుగా రెండు బౌండరీలు కొట్టి తన ఉద్దేశాన్ని వ్యక్తంచేశాడు. లంచ్ సమయానికి మయాంక్, పుజారా రెండో వికెట్‌కు అజేయంగా అర్థసెంచరీ భాగస్వామ్యం పూరించారు.

## సెంచరీ భాగస్వామ్యం(టీ 168/2)

లంచ్ తరువాత కొద్దిసేపు ఆచితూచి ఆడిన భారత బ్యాట్స్‌మన్ నెమ్మదిగా పుంజుకుని పరుగులు రాబట్టారు. నార్జె కొంతమేరకు కట్టడిచేసినా అది తాత్కాలికమే అయింది. కుదురుకున్న మయాంక్‌ను ఇబ్బంది పెట్టేందుకు నార్జె చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. నార్జె షార్ట్ పిచ్ బంతులు వేసిన ప్రతిసారీ మయాంక్ బ్యాట్‌ఫుట్‌పై వాటిని బౌండరీలకు తరలించడం అతని ప్రతిభకు నిదర్శనం. మహరాజ్ బౌలింగ్‌లో పుజారా బౌండరీలు సాధించడంతో ఆత్మవిశ్వాసం ప్రోదిచేసుకున్న మయాంక్ కూడా రెచ్చిపోయాడు. ఈ నేపథ్యంలో 112 బంతులలో తన అర్థసెంచరీ పూరించాడు. కాగా పుజారా ముత్తుసామి బౌలింగ్‌లో స్క్వేర్‌లెగ్ బౌండరీమీదుగా మ్యాచ్‌లో తొలి సిక్సర్ నమోదు చేశాడు. మయాంక్, పుజారా రెండో వికెట్‌కు 138 పరుగులు జోడించిన తరువాత వారి జోడీ విడివడింది. 107 బంతుల్లో అర్థసెంచరీ సాధించిన పుజారా లంచ్‌కు ముందుగా రబాడా బౌలింగ్‌లో అవుటయ్యాడు.

## మయాంక్ సెంచరీ(తొలి రోజు 273/3)

టీ విరామానంతరం కెప్టెన్ కోహ్లీ పరుగులు జోడించే బాధ్యత చేపట్టి సఫారీ బౌలర్లందరి బౌలింగ్‌లో బౌండరీలు సాధించాడు. కోహ్లీ అండతో మయాంక్ అద్భుత షాట్లతో అలరిస్తూ తన రెండో టెస్టు సెంచరీ పూరించాడు. పేసర్లు, స్పిన్నర్లను సమర్థంగా ఎదుర్కొంటూ బౌండరీలు, సిక్సర్లతో ఆధిపత్యం ప్రదర్శించాడు. అతని స్కోరులో 76 పరుగులు బౌండరీల ద్వారానే వచ్చాయి. అందుకు అతనికి 18 బంతులు అవసరమయ్యాయి. తక్కిన 177 బంతుల్లో అతడు చేసింది 34 పరుగులే. మహరాజ్ బౌలింగ్‌లో రెండు సిక్సర్లు సాధించి సెంచరీ చేరువకు వచ్చిన మయాంక్ ఫిలాండ్ బంతిని బ్యాక్‌కట్‌ద్వారా బౌండరీకి తరలించడంద్వారా సెంచరీ పూరించాడు. మొత్తంగా 16 బౌండరీలు, రెండు సిక్సర్లతో మయాంక్ 108 పరుగులు చేసి నిష్క్రమించాడు. అనంతరం రహానెతో కలిసి కోహ్లీ అవిభాజ్య అర్థసెంచరీ భాగస్వామ్యం(75) నెలకొల్పి భారత్‌ను పటిష్ట స్థితికి చేర్చాడు. ఈ నేపథ్యంలో కోహ్లీ 91 బంతుల్లో అర్థసెంచరీ పూర్తించాడు. వెలుతురు సరిపడినంత లేని కారణంగా ఆటను నిలిపివేసే సమయానికి కోహ్లీ 63 పరుగులతో, రహానె 18 పరుగులతో ఆటలో కొనసాగుతున్నారు.

### రబాడా రెచ్చగొట్టాడు

**పుణె :** రెండో టెస్టు తొలి రోజు ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. దక్షిణాఫ్రికా పేస్‌బౌలర్ కగిసో రబాడ భారత డిపెండబుల్ చతేశ్వర్ పుజారాను రెచ్చగొట్టేందుకు ప్రయత్నించాడు. అయితే పుజారా సంయమనం పాటించి మౌనంగా తనపని తాను చేసుకుపోయాడు. పుజారా పరుగుల ఖాతా తెరవకముందే రబాడా బౌలింగ్‌లో అవుటయ్యే ప్రమాదంనుంచి తప్పించుకున్నాడు. పుజారా ఏకాగ్రతను చెడగొట్టేందుకు రబాడా అతనితో మాటలు కలిపేందుకు ప్రయత్నించాడు. అయితే పుజారా అతడిని పట్టించుకోలేదు. అతడేమన్నాడో తనకు తెలియదని, అటువంటి ప్రయత్నాలకు తాను స్పందించనని పుజారా మ్యాచ్ అనంతరం తెలిపాడు. మన పరిమితిలో మనముంటే ఎవరేమన్నా అది మనపై ప్రభావం చూపదని పుజారా అన్నాడు. పుజారా ఈ మ్యాచ్‌లో అర్థసెంచరీ సాధించాడు. పుజారా వికెట్ రబాడాకే దక్కడం కొసమెరుపు.

### స్కోర్‌బోర్డ్

**ఇండియా:** మయాంక్ అగర్వాల్ (సి) డుప్లెసిస్ (బి) రబాడా 108, రోహిత్ శర్మ (సి) డికాక్ (బి) రబాడ 14, పుజారా (సి) డుప్లెసిస్ (బి) రబాడా 58, విరాట్ కోహ్లీ బ్యాటింగ్ 63, అజింక్య రహానె బ్యాటింగ్ 18, ఎక్స్‌ట్రాలు , మొత్తం (3 వికెట్లకు) 273.

**వికెట్ల పతనం :** 1-25, 2-163, 3-198.

**బౌలింగ్ :** వెర్నాన్ ఫిలాండర్ 17-5-37-0, కగిసో రబాడ 18.1-2-48-3, ఆన్రిచ్ నార్జె 13-3-60-0, కేశవ్ మహరాజ్ 29-8-89-0, సెనురన్ ముత్తుసామి 6-1-22-0, డీన్ ఎల్గర్ 2-0-11-0.



# మేరీకోమ్ కొత్త చరిత్ర

## 8వ పతకం ఖాయం చేసుకున్న భారత స్టార్ బాక్సర్

### సెమీస్‌లోమరో ముగ్గురు.. మహిళల ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్

**ఉలన్-ఉడె:** రష్యాలోని ఉలన్-ఉడె వేదికగా జరుగుతున్న మహిళల ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్లు సత్తా చాటుతున్నారు. ఇక్కడ జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో మేరీకోమ్, లవ్లీనా, మంజు రాణి, జమున బోరోలు తమతమ విభాగాల్లో విజయాలు సాధించి సెమీస్‌లోకి దూసుకెళ్లారు. దీంతో భారత్‌కు నాలుగు పతకాలు ఖాయమయ్యాయి. గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో ఘన విజయం సాధించిన భారత స్టార్ బాక్సర్ మేరీకోమ్ ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో 8వ పతకాన్ని ఖాయం చేసుకొని కొత్త చరిత్ర సృష్టించింది. ఇప్పటికే ఈ మెగా ఈవెంట్‌లో 6 స్వర్ణాలు, 1 రజతం గెలుచుకున్న మేరీకోమ్ తాజాగా రష్యాలో జరుగుతున్న వరల్డ్ చాంపియన్‌షిప్‌లో మరో పతకంపై గురిపెట్టింది. గురువారం జరిగిన 51 కిలోల విభాగం క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో మూడో సీడ్ మేరీకోమ్ 5-0తో ఒలింపిక్స్ పతక విజేత ఇంగ్రిత్ వెలెన్సియా (కొలంబియా)పై విజయం సాధించి సెమీస్‌కు దూసుకెళ్లింది. దీనితో కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేసుకుంది. ఫలితంగా ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో 8 పతకాలు సాధించిన ఏకైక బాక్సర్‌గా మేరీకోమ్ కొత్త రికార్డు సృష్టించనుంది. క్యూబా దిగ్గజ పురుష బాక్సర్ ఫెలిక్స్ సావోన్ (7 పతకాలు) రికార్డును మేరీకోమ్ అధిగమించింది. ఇక ఇప్పటివరకు 48 కిలోల విభాగంలో బరిలోకి దిగిన మేరీకోమ్ ఈసారి 51 కిలోల కేటగిరీని ఎంచుకుంది. టోక్యో ఒలింపిక్స్‌లో 48 కిలోలకు బదులు 51 కిలోల విభాగంలో పోటీలు నిర్వహిస్తారు. దీంతో మేరీకోమ్ మూడు కిలలో బరువు పెంచుకొని ఈ కేటగిరిలో పోటీలకు సిద్ధమైంది. తొలిసారి 51 కిలోల విభాగంలో ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పోటీ పడుతున్న భారత దిగ్గజం మేరీకోమ్ తొలి ప్రయత్నంలోనే పతకాన్ని



జమున

ఖాయం చేసుకుంది. గత ఏడాది న్యూఢిల్లీ వేదికగా జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో 48 కిలోల విభాగంలో స్వర్ణపతకం గెలుచుకున్న మేరీకోమ్ వరల్డ్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో అత్యధిక పతకాలు సాధించిన పురుషుల లెజెండ్, క్యూబా స్టార్ బాక్సర్ ఫెలిక్స్ సావోన్ (7 పతకాలు) రికార్డును సమం చేసింది. ఇప్పుడు మరో పతకం ఖాయం చేసుకోవడంతో బాక్సింగ్ చరిత్రలోనే అత్యధిక పతకాలు సాధించిన బాక్సర్‌గా మేరీకోమ్ కొత్త అధ్యయాన్ని లిఖించనుంది. అయితే ఈసారి కూడా పసిడి సాధించాలని మేరీ ఆతృతగా ఉంది. స్వర్ణమే లక్ష్యంగా బరిలోకి దిగిన మణిపురి బాక్సర్ మేరీ తన లక్ష్యానికి రెండు పంచ్‌ల దూరంలో నిలిచింది. ఒకొక్క మెట్టు ఎక్కుతూ సెమీస్‌లో ప్రవేశించిన మేరీకోమ్ శనివారం జరిగే సెమీస్ పోరులో టర్కీకి చెందిన రెండో సీడ్ బుసెనాజ్ కాకిరోగ్లుతో తలపడనుంది. 36 ఏళ్ల వయసులోనూ మేరీకోమ్ పంచ్ పవర్ తగ్గలేదు. ఈ ఏడాది గౌహతి వేదికగా జరిగిన ఇండియా ఓపెన్, ఇండోనేషియాలో జరిగిన ప్రెసిడెంట్ కప్ లో బంగారు పతకాలు సాధించింది. గురువారం క్వార్టర్ ఫైనల్లో గెలిచిన అనంతరం మేరీకోమ్ మాట్లాడుతూ.. ప్రపంచ బాక్సింగ్‌లో అత్యధిక పతకాలు సాధించడం సంతోషంగా ఉంది. ఈసారి కూడా పసిడి సాధించాలనే రింగ్‌లో అడుగుపెట్టాను. ప్రస్తుతం నా దృష్టంతా సెమీస్‌పైనే ఉంది అని మేరీకోమ్ తెలిపింది.

#### సెమీస్‌లో మంజు, జమున, లవ్లీనా..

ఇతర క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లలో మంజు రాణి (48 కేజీలు), జమున బోరో (54 కేజీలు), లవ్లీనా (69 కేజీలు) అద్భుతమైన ప్రదర్శనతో విజయాలు సాధించి సెమీస్‌లో



మంజు రాణి

ప్రవేశించడంతో పాటు పతకాలు కూడా ఖాయం చేసుకున్నారు. గురువారం ఇక్కడ జరిగిన 48 కేజీల విభాగంలో మంజు రాణి సంచలన విజయం సాధించింది. నార్త్ కొరియాకు చెందిన టాప్ సీడ్, గత చాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత కిమ్ హ్యాంగ్ మీను 4-1తో చిత్తు చేసిన ఈ హరియాణా యువ బాక్సర్ చిరస్మరణీయ విజయాన్ని అందుకుంది. ఫలితంగా ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో తొలి పతకాన్ని ఖాయం చేసుకుంది. 54 కిలోల విభాగంలో అస్సాం స్టార్ బాక్సర్ జమున బోరో జర్మనీ బాక్సర్ ఉర్సులా గొట్లబ్‌పై విజయం సాధించి సెమీస్‌లో అడుగుపెట్టింది. 69 కిలోల క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో లవ్లీనా 4-1తో మూడోసీడ్ కరొలినా కొజ్వెస్కా (పొలాండ్)ను ఓడించి ఈ మెగా చాంపియన్‌షిప్‌లో రెండో పతకాన్ని ఖాయం చేసుకుంది. గత ఏడాది ఢిల్లీలో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో లవ్లీనా కాంస్య పతకం గెలుచుకుంది.

# స్టీలర్స్‌పై ముంబా గెలుపు



**గ్రేటర్ నొయిడా :** ప్రొ కబడ్డీ సీజన్-7 ముగింపు దశకు చేరుకుంది. ఇప్పటికే ప్లేఆఫ్స్‌కు చేరుకున్న యు ముంబా, హర్యానా స్టీలర్స్ మధ్య గురువారం జరిగిన ఉత్కంఠ పోరులో యు ముంబా 39-33 స్కోరుతో స్టీలర్స్‌పై గెలుపొందింది. విరామ సమయానికి ఇరు జట్లు 15-15తో సమంగా ఉన్నప్పటికీ ద్వితీయార్థంలో ముంబా జట్టు నెమ్మదిగా పుంజుకుని మ్యాచ్ ముగిసే సమయానికి ఆరు పాయింట్ల తేడాతో విజయాన్నందుకుంది. ద్వితీయార్థంలో కొంతసేపు ఆధిక్యం చేతులు మారినా చివరకు ముంబాదే పై చేయి అయింది. ముంబా జట్టులో అజింక్య కాప్రె సూపర్ టెన్‌తో జట్టు విజయానికి తోడ్పడ్డాడు. ఇతర ఆటగాళ్లలో డాన్ జాంగ్ లీ 9, ఫాజల్ అత్రాచలి 8, సందీప్ నర్వాల్ 5 పాయింట్లతో సహకరించారు. స్టీలర్స్ జట్టులో వినయ్ సూపర్ టెన్(11) నమోదు చేయగా, వికాస్ కండోల 6, రవి కుమార్, నవీన్, సునీల్ తలా 4 పాయింట్లు సాధించారు. శుక్రవారం నామమాత్రంగా జరిగే చివరి లీగ్ పోటీలలో దబాంగ్ ఢిల్లీ-యు ముంబా, యుపి యోధా-బెంగళూరు బుల్స్ తలపడనున్నాయి.

# ఫిట్‌నెస్‌పైనే దృష్టి



**చెన్నై:** ఇటీవల జరిగిన వరల్డ్ చాంపియన్‌లో తొలిసారి బంగారు పతకం సాధించిన పీవీ సింధు ఇప్పుడు టోక్యో ఒలింపిక్స్‌పై దృష్టి సారించింది. గత ఒలింపిక్స్‌లో రజతంతో సరిపెట్టుకున్న సింధు 2020 ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించాలన్న పట్టుదలతో ఉంది. ఇందుకు ఫిట్‌నెస్‌పై శ్రద్ధ వహిస్తున్నట్లు తెలిపింది. గురువారం చెన్నైలో జరిగిన ఓ కార్యక్రమంలో సింధు పాల్గొంది. ఈ సందర్భంగా మీడియాతో ముచ్చటిచ్చిన సింధు.. వచ్చే ఏడాది జరగనున్న ఒలింపిక్స్‌లో మెరుగైన ప్రదర్శన చేయడమే నా లక్ష్యమని, అందుకోసం కొద్ది కాలంగా ఫిట్‌నెస్‌పై ఎక్కువగా శ్రద్ధ వహిస్తున్నాన్నది.

# క్వార్టర్స్‌లో లక్ష్యసేన్, రాహుల్

**అల్మేర్ (నెదర్లాండ్స్):** భారత యువ షట్లర్లు లక్ష్యసేన్, రాహుల్ భరద్వాజ్ డచ్ ఓపెన్ బ్యాడ్మింటన్ క్వార్టర్ ఫైనల్లో ప్రవేశించారు. గురువారం ఇక్కడ జరిగిన పురుషుల సింగిల్స్ ప్రీ క్వార్టర్ ఫైనల్లో లక్ష్యసేన్ 21-13, 16-21, 21-10తో గార్ కొల్హో (బ్రెజిల్)పై విజయం సాధించాడు. మరో మ్యాచ్‌లో రాహుల్ 21-17, 24-26, 21-8తో ఆరో సీడ్ విక్టర్ స్వెండ్సన్ (డెన్మార్క్)పై సంచలన విజయం సాధించి క్వార్టర్ ఫైనల్లో దూసుకెళ్లాడు.

# సీడెడ్ల దూకుడు

### క్వార్టర్స్‌లో జకోవిక్, ఫెదరర్ ..షాంఘై మాస్టర్స్



**షాంఘై:** టెన్నిస్ టాప్ సీడ్‌లు నొవాక్ జకోవిక్, రోజర్ ఫెదరర్‌లు షాంఘై మాస్టర్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో ప్రవేశించారు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రీ క్వార్టర్స్‌లో వరల్డ్ నెంబర్‌వన్, సెర్బియా స్టార్ నొవాక్ జకోవిక్ 7-5, 6-3తో 16వ సీడ్ జాన్ ఇస్నర్ (అమెరికా)పై విజయం సాధించాడు. మరో మ్యాచ్‌లో రెండో సీడ్, స్విస్ దిగ్గజం రోజర్ ఫెదరర్ 7-6(9), 6-4తో 13వ సీడ్, బల్గేరియా ఆటగాడు గాఫిన్‌పై చెమటోడ్చి నెగ్గాడు. ఇక్కడ జరిగిన మరో మ్యాచ్‌లో నాలుగో సీడ్ ఆస్ట్రియా ఆటగాడు డొమినిక్ థీమ్ 6-3,6-4తో జార్జియాకు చెందిన 15వ సీడ్ నికొలాస్ బాసిలాష్‌విలిపై విజయం సాధించి క్వార్టర్ ఫైనల్లో అడుగుపెట్టాడు.

# రాణించిన తిలక్‌వర్మ



**బెంగళూరు :** విజయ్ హజారే ట్రోఫీ దేశవాళీ పరిమిత ఓవర్ల టోర్నీలో దాయాదుల ఉత్కంఠ పోరులో హైదరాబాద్ ఏడు పరుగుల తేడాతో ఆంధ్రపై విజయం సాధించింది. వర్షం కారణంగా 20 ఓవర్లకు తగ్గించిన ఈ గ్రూప్-ఎ మ్యాచ్‌లో తొలుత హైదరాబాద్ 7 వికెట్లకు 171 పరుగులు చేయగా, సమాధానంగా ఆంధ్ర 6 వికెట్లకు 164 పరుగులే సాధించింది. హైదరాబాద్ జట్టులో తిలక్‌వర్మ అత్యధికంగా 83 పరుగులు చేయగా, సందీప్ 28 పరుగులతో సహకరించాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా తిలక్‌వర్మ చివరివరకు నిలిచి చివరి బంతికి రనౌటయ్యాడు. ఆంధ్ర బౌలర్ పృథ్వీరాజ్ మూడు వికెట్లు పడగొట్టాడు. అనంతరం ఆంధ్ర జట్టులో కెప్టెన్ రికీభుయ్(58), వన్‌డౌన్ ఆటగాడు ప్రశాంత్‌కుమార్(57) రెండో వికెట్‌కు 116 పరుగులు జోడించి జట్టును పోటీలో నిలిపారు. అయితే సివి మిళింద్ ప్రశాంత్‌కుమార్‌తోపాటు కరణ్ షిండె, తపస్వి వికెట్లు పడగొట్టి ఆంధ్ర జోరుకు కళ్లెం వేశాడు. ఈ విజయంతో హైదరాబాద్‌కు 4 పాయింట్లు దక్కాయి.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.



## మనసు విప్పండి!

### మానసిక ఆరోగ్య ఆవశ్యకత ప్రచారంలో ఆలియా భట్ సోదరి షాహీన్ భట్ కృషి

సెలబ్రిటీలు ఈ మధ్య కాలంలో తమలోని మానసిక అనారోగ్యాలను గురించి మాట్లాడుతున్నారు. ఈ వరుసలో బాలీవుడ్ నటి ఆలియా భట్ సోదరి షాహీన్ భట్ కూడా ఉన్నారు. ఆమె 2016లోనే తాను అనుభవించిన డిప్రెషన్‌పై ఒక పుస్తకం రాశారు. నిన్న గురువారంనాడు అంతర్జాతీయ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా షాహీన్ 'హియర్ కమ్స్ ది సన్' అనే పేరుతో ఒక ఇన్‌స్టాగ్రామ్ పేజిని ప్రారంభించారు. మానసిక అనారోగ్యాలతో బాధపడుతున్నవారు తమ మనసులోని సమస్యలను ఆవేదనలను పంచుకుని వాటి నుండి బయటపడాలంటే... ఇలాంటి వేదికలు అవసరమని షాహీన్ భావిస్తున్నారు. సూర్యుడు వచ్చేశాడు...అనే అర్థంతో మానసిక ఆరోగ్యంకోసం ఆన్‌లైన్ ప్రచారోద్యమాన్ని ప్రారంభించేందుకు ఆమె చేస్తున్న ప్రయత్నం ఇది. హియర్ కమ్స్ ది సన్ అనేది...చాలా సింపుల్ అయిడియా నుండి పుట్టిందని, మనందరికీ ఒకేలాంటి భయాలు ఉంటాయని, మనం ఒంటరిగా లేమని చెప్పడం, అందరం కలిసే బతుకుతున్నామనే ధైర్యాన్ని ఇవ్వడం... ఈ పేరు వెనుక ఉన్న అర్థమని షాహీన్ అంటున్నారు.

తన అక్క చేస్తున్న ఈ కృషిని అభినందించింది ఆలియా. హియర్ కమ్స్ ది సన్ అనేది ఒక ఇన్‌స్టాగ్రామ్ పేజిగానే మొదలైనా ఇది....మానసిక ఆరోగ్యం గురించి మాట్లాడేందుకు, చర్చించేందుకు ఒక సురక్షితమైన వేదిక కావాలని, బాధితులకు ఇక్కడ పరిష్కారం లభించాలని ఆలియా ఆశాభావం వ్యక్తం చేశారు.

# అదనపు అందం!

## డ్రస్ ఏదైనా లాంగ్ జాకెట్‌తో ప్రత్యేక లుక్

పొడవాటి జాకెట్... ఏ డ్రస్‌కైనా అదనపు హంగుగా మారుతుంది. డ్రస్‌కి ఒక ప్రత్యేకమైన రిచ్ లుక్‌ని ఇస్తుంది. పలాజో క్రాప్‌టాప్, చుడీదార్, అనార్కలీ, లాంగ్ ఫ్రాక్, మ్యాక్సీ... ఇలా ఏ డ్రస్‌కి అయినా చక్కగా సరిజోడీగా మారిపోతుంది. లాంగ్ జాకెట్ డ్రస్‌లను క్యాజువల్‌గా అయినా లేదా ఫంక్షన్లలో అయినా ధరించవచ్చు.





మన సినిమాల్లో నాయకత్వ లక్షణాలతో కనిపించే ఆడపాత్రలు చాలా తక్కువ. హీరోపక్కన డాన్సులు చేసి తమ పనైపోయినట్టుగా వెళ్లిపోయే హీరోయిన్ల పాత్రలే ఎక్కువ. సినిమాల ప్రభావం చూసే ప్రేక్షకులపై ఉంటుందనే అభిప్రాయం చాలామందిలో ఉంది. దీనిని బట్టి చూస్తే...నేటి సినిమాల్లో కనిపించే మహిళా పాత్రల ప్రభావం సమాజంలోని మహిళలు యువతులు బాలికలపైఎంతటి నెగెటివ్ ప్రభావాన్ని చూపుతుందో మనం ఊహించవచ్చు. ప్లాన్ ఇంటర్నేషనల్ అండ్ గీనా డేవిస్ ఇన్‌స్టిట్యూట్...అనే సంస్థ ఇదే విషయాన్ని తమ నివేదికలో వెల్లడించింది. సినిమాలు మీడియాల్లో స్టీరియో టైపులో కనిపించే స్త్రీపాత్రల చిత్రణ కారణంగా మహిళలలో యువతుల్లో నాయకత్వ లక్షణాలతో జీవించాలనే స్ఫూర్తికి ఆటంకం కలుగుతోందని ఆ నివేదిక తెలిపింది.

# నాయిక తీరు మారదా?!

- సినిమాల్లో స్త్రీపాత్రల చిత్రణలో వివక్ష
- నాయకత్వ లక్షణాలున్న పాత్రలకూ అసభ్యకరంగా దుస్తులు
- వెల్లడించిన ప్లాన్ ఇంటర్నేషనల్ సంస్థ నివేదిక



మీడియాలో కానీ సినిమాల్లో కానీ... నాయకత్వ లక్షణాలున్న మహిళలను చూపించేటప్పుడు వారిని...శారీరక అందం కోణంలోంచే చూపుతున్నారని, సినిమాల్లో అయితే అలాంటి మహిళలను సైతం అర్ధ నగ్నంగా చూపుతున్న సందర్భాలుంటున్నాయని ఈ నివేదిక పేర్కొంది. ప్లాన్ ఇంటర్నేషనల్ సంస్థ నిర్వహిస్తున్న అంతర్జాతీయ ప్రచారం 'గెట్ గర్ల్స్ ఈక్వల్'లో భాగంగా....గత ఏడాది 20దేశాల్లో విడుదలై అత్యంత ఎక్కువ వసూళ్లు రాబట్టిన 56 సినిమాలపై అధ్యయనం చేసి ఈ నివేదికని విడుదల చేశారు.

నాయకత్వ లక్షణాలతో ఉన్న మహిళలు, యువతులు, శరీరాన్ని బహిర్గతం చేసే దుస్తులను ధరించినట్టుగా, వారిని అర్ధనగ్నంగా, ఒక్కోసారి పూర్తి నగ్నంగా చూపిస్తున్నట్టుగా...ఈ సంస్థ నిర్వహించిన అధ్యయనంలో తేలింది.

ఇరవై దేశాల్లో టాప్ సినిమాలుగా నిలిచిన పది సినిమాల్లో ఒక్క సినిమాకి మాత్రమే మహిళ దర్శకత్వం వహించారు. పది సినిమాల రచనా బృందాల్లో ఒక్క మహిళ మాత్రమే ఉంది. సినిమాల్లో స్త్రీ పురుషుల పాత్రల చిత్రణ చాలా హానికరమైన రీతిలో, అసమానతని వెల్లడించేలా ఉంటోందని ప్లాన్ ఇంటర్నేషనల్ సంస్థ పరిశోధనలో తేలింది. అ ధోరణి బాలికలు యువతుల శక్తిని తక్కువ చేసి చూపడమేనని, జీవితంలో పైకి రావాలనే వారి ఆశలు ఆశయాలపై ఇలాంటి చిత్రణలు చాలా నెగెటివ్ ప్రభావాన్ని చూపుతాయని ప్లాన్ ఇంటర్నేషనల్ సిఇఒ అన్నే బిర్‌గిట్టే అల్‌బ్రిక్ట్‌సెన్ అభిప్రాయపడు తున్నారు. సినిమాల్లో మీడియాలో ఇలాంటి ధోరణులు పోవాలని, మరింతమంది మహిళా నాయకులు వివిధ రంగాల్లో ముందుకు రావాలని, ముఖ్యంగా మీడియాలో మహిళా ప్రతినిధులు పెరగాలని బిర్‌గిట్టే ఆకాంక్షించారు. మగవారికి ఆనందాన్ని ఇవ్వడమే ప్రధాన ఉద్దేశ్యంగా ప్రోగ్రాములు రూపొందటం పైన ఆమె నిరసన వ్యక్తం చేశారు.

# మేకప్ మెరుపుల కోసం!

## భిన్నరకాల బ్రష్‌లు

మేకప్ వేసుకోవాలంటే మేకప్ సామగ్రితో పాటు బ్రష్ కూడా ఉండాల్సిందే. అయితే మొహానికి వేసుకునే మేకప్ సామగ్రి అనేక రకాలుగా ఉన్నట్టుగానే బ్రష్‌లు సైతం చాలా రకాలు ఉన్నాయి. ఒక్కో బ్రష్ ఒక్కో రకమైన పనిని చేస్తుంది. ఎలాంటి మేకప్‌కి ఏ బ్రష్ ఉపయోగపడుతుంది... అనే విషయంలో అవగాహన ఉంటే సరైన బ్రష్‌ని ఎంపిక చేసుకోవటం సులభమవుతుంది. అందుకే ఈ సమాచారం-



### బ్లెండర్ బ్రష్

కళ్లకి వేసే షాడోకి గానీ, చెంపలకు వేసే బ్లష్‌కి గానీ ఈ బ్లెండర్ బ్రష్ అవసరం. బిరుసుగా మందంగా ఉన్న బ్రష్ తాలూకూ వెంట్రుకలు... మొహం పైన మృదువైన ఫినిషింగ్ ఇవ్వటంలో తోడ్పడతాయి. ఐ షాడోకి, మొహంపై అదనపు ఆకర్షణగా వేసుకునే రంగులు, మెరుపులకు ఈ బ్రష్‌ని ఉపయోగించవచ్చు. బ్లెండర్ బ్రష్‌లను భిన్న సైజుల్లో రెండు మూడు వరకు కొనుక్కోవచ్చు.



### ఫౌండేషన్ బ్రష్

ఇది చాలా సాధారణంగా ఎక్కువమంది రోజూ వాడే బ్రష్. చర్మంపైన ఫౌండేషన్‌ని చాలా మృదువుగా అప్లయి చేసుకునేందుకు, ఎలాంటి తేడా లేకుండా చర్మమంతా ఒకే తీరులో కనిపించేలా చేయటంలో ఈ బ్రష్ ఉపయోగపడుతుంది. ఇది మరింత బాగా పనిచేయాలంటే బ్రష్‌ని గోరువెచ్చని నీటిలో ముంచి...అదనంగా ఉన్న నీటిని పిండేయాలి. ఇప్పుడు బ్రష్‌ని వాడితే మొహం మరింత మెరుపు సంతరించుకుంటుంది.



### బ్రాంజర్ బ్రష్

మృదువుగా గుండ్రంగా ఉండే ఈ బ్రష్‌లోని వెంట్రుకలు మందంగా దట్టంగా ఉంటాయి. ఫౌండేషన్, కన్సీలర్ అప్లయి చేశాక మొహానికి మరింత అందాన్ని సొగసుని ఇవ్వడానికి రంగుని కానీ, మెరుపుని కానీ అప్లయి చేయడానికి ఈ బ్రష్‌ని వాడతారు. బ్రాంజర్‌ని వాడటం వలన మొహం మరింత మృదువుగా మెరుస్తూ ఉంటుంది.



### ఫేస్ కాంటూర్ బ్రష్

ఈ బ్రష్‌తో మొహం చిత్రకారుడు గీసిన చిత్రంలా చక్కగా మారుతుంది. మొహంలోని కళ్లు ముక్కు చెంపలు వేటికవి తీరుగా కనిపించేలా సరిహద్దు రేఖలు గీసినట్టుగా చేస్తుంది...కనుక దీనిని కాంటూర్ బ్రష్ అంటారు. దవడ, ముక్కు కొస, బుగ్గలు లాంటి భాగాలు కొట్టొచ్చి నట్టుగా చేయటంలో ఈ బ్రష్ చాలా బాగా పనిచేస్తుంది. ముఖాకృతి తీరు గా మెరిసేలా చేయటంలో ఈ బ్రష్ చాలా బాగా తోడ్పడుతుంది.



### ఫ్యాన్ ఫౌండర్ బ్రష్

పేరుకు తగినట్టుగానే ఇది హ్యాండ్ ఫ్యాన్‌లా ఉంటుంది. దీంతో పౌడర్‌ని చాలా సున్నితంగా మొహం అంతా ఒకేలా కనిపించేలా రాసుకోవచ్చు. మొహం పైని సన్నని గీతలు ముడతలు వంటివి కనిపించకుండా చేయటంలో ఈ బ్రష్ చాలాబాగా పనిచేస్తుంది. మొహంపైన అదనంగా ఉన్న పౌడర్‌ని తొలగించడంలో కూడా ఇది ఉపయోగపడుతుంది.



### కన్సీలర్ బ్రష్

మేకప్ సామగ్రిలో ఇది అత్యవసరం. మొహంపైన మొటిమలు, మచ్చలు, రంగులో ఎక్కువ తక్కువలు, చర్మం పాలిపోవటం లాంటి సమస్యలున్నపుడు వాటిని కనిపించ నీయకుండా చేయటంలో ఇది బాగా పనిచేస్తుంది. ముఖ్యంగా కళ్లకింద నలుపుని కవర్ చేసి మొహం మొత్తం ఒకేరకమైన మెరుపు ఉండేలా చేయటంలో కన్సీలర్ బ్రష్ చక్కగా ఉపయోగపడుతుంది. కన్సీలర్‌లో బ్రష్‌ని ముంచి జాగ్రత్తగా అవసరం ఉన్నచోట అప్లయి చేయాలి.

# దినఫలాలు

**మేష రాశి**
పనుల్లో ఆటంకాలు, ధనవ్యయం, కుటుంబంలో ఒత్తిడులు. ఆధ్యాత్మిక చింతన, అనారోగ్యం, వ్యాపారాల్లో ఇబ్బందులు. ఉద్యోగాల్లో కొద్దిపాటి చికాకులు, నిరుద్యోగులకు నిరుత్సాహం.

**వృషభ రాశి**
మిత్రులతో మాటపట్టింపులు, ఇంటాబయటా చికాకులు. ఆరోగ్యభంగం. వ్యయప్రయాసలు. వ్యాపారాల్లో గందరగోళం, ఉద్యోగాలలో అదనపు బాధ్యతలు, కళాకారులకు ఒత్తిడులు.

**మిథున రాశి**
కొత్త వ్యక్తులతో పరిచయాలు, సంఘంలో ఆదరణ, పనులు సకాలంలో పూర్తి చేస్తారు. ఆహ్వానాలు అందుతాయి, వ్యాపారాలు మరింత లాభిస్తాయి, ఉద్యోగాల్లో మందడుగు వేస్తారు.

**కర్కాటక రాశి**
ఆర్థిక ఇబ్బందులు, రుణయత్నాలు, పనుల్లో కొంత జాప్యం. బంధువులతో వివాదాలు, ఆలోచనలు స్థిరంగా ఉండవు. వ్యాపారాలు కొంత సామాన్యంగా ఉంటాయి, ఉద్యోగాలలో ఒత్తిడులు.

**సింహ రాశి**
దూరపు బంధువుల కలయిక, విందు వినోదాలు చిన్ననాటి మిత్రులతో ఉత్సాహంగా గడుపుతారు. దైవదర్శనాలు, వ్యాపారాల్లో అనుకూల మార్పులు, ఉద్యోగాలు ఆశాజనకంగా ఉంటాయి.

**కన్య రాశి**
రుణాలు చేస్తారు, ఆర్థిక వ్యవహారాలు నిరుత్సాహపరుస్తాయి, శ్రమ పెరుగుతుంది. ముఖ్యమైన పనులు వాయిదా, వ్యాపారాల్లో ఒడిదుడుకులు, ఉద్యోగాలలో అనుకోని మార్పులు, అనారోగ్యం.

**తులా రాశి**
కొత్తపనులకు శ్రీకారం, శుభవార్తలు వింటారు, వాహనయోగం. ఇంటిలో శుభకార్యాలు, వ్యాపార లావాదేవీలు ఉత్సాహంగా సాగుతాయి, ఉద్యోగాలలో ప్రోత్సాహకర వాతావరణం ఉంటుంది.

**వృశ్చిక రాశి**
దూర ప్రాంతాల నుంచి కీలక సమాచారం, నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు అందుతాయి. వ్యవహారాలలో విజయం, ఆస్తి వివాదాల పరిష్కారం, వ్యాపారాలలో అనుకూలం, ఉద్యోగాలలో పదోన్నతులు.

**ధనూ రాశి**
పనులు వాయిదా వేస్తారు, ఆకస్మిక ప్రయాణాలు, ఆరోగ్యభంగం. సోదరులు, మిత్రులతో వివాదాలు, వ్యాపారాలు సాదాసీదాగా ఉంటాయి, ఉద్యోగాలలో ఇబ్బందులు ఎదురుకావచ్చు.

**మకర రాశి**
ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు, ధనవ్యయం, కుటుంబ సభ్యులతో స్వల్ప వివాదాలు. దైవదర్శనాలు, అనుకోని ప్రయాణాలు, వ్యాపారాలు నిరాశపరుస్తాయి, ఆరోగ్యభంగం.

**కుంభ రాశి**
పలుకుబడి పెరుగుతుంది, సన్నిహితుల నుంచి శుభవార్తలు, ఆర్థికాభివృద్ధి ఉంటుంది. ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంటారు. వ్యాపారాలు మరింత విస్తరిస్తాయి. ఉద్యోగాలలో నూతనోత్సాహం.

**మీన రాశి**
ఒకసమాచారం సంతోషం కలిగిస్తుంది, విద్యార్థుల యత్నాలలో పురోగతి. విందువినోదాలు, వస్తులాభాలు. వ్యాపారాలలో ఉత్సాహభరిత వాతావరణం ఉంటుంది. ఉద్యోగాలలో ఇంక్రిమెంట్లు లభిస్తాయి.



శ్రీ గుదిమెళ్ళ యతీంద్ర ప్రవణాచార్య సిద్ధాంతి

# సమన్యాసం...

## చింతన



**ప్రపంచమంతా పరమాత్మ ప్రకాశమేనని అనుభవపూర్వకంగా తెలుసుకోవాలి. పరిమిత చైతన్యంతో కూడి ఉన్న జీవుడూ, అపరిమిత, అనంత అవ్యయ, అచ్యుతానంద చైతన్యంగా పరమాత్మ కలిసి ఈ ప్రపంచంలో ఉంటున్నారన్న స్పృహ, సన్యాస అంటే సమన్యాస విధానంతో బలపడి, మనసు, బుద్ధి, చిత్తం, అహంకారం వంటి స్థితులను దాటి జీవుడు పూర్ణుడౌతాడు. ఇదే నిజమైన అధ్యాత్మ మార్గం. సాధనా రీతి కూడా ఇదే!**

సమన్యాసమే సంన్యాసం. శరీరాన్ని, ఇంద్రియాలను శాశ్వతంగా భావించక, జరుగుతున్న సమస్త కార్యకలాపాలను సమన్వయ రీతిలో ఆత్మోన్ముఖం చేయటమే సన్యాసి చేయవలసినది. ఎండమావుల వెంట పరుగిడుతూ, కడకు ఆశాభంగం చెందే కంటే, ఎండమావులలో నీరుండదన్న నిజాన్ని ముందే గ్రహించగల ఇంద్రియ నిగ్రహాన్ని సాధించుకోవాలి. చరించి, చరించి ఏనాడో నశించే దేహాన్ని గురించిన భావనను దాటి, అనుభవంతో, అనుభూతితో ఆత్మను ఎరిగి, దానితో తాదాత్మ్యం చెందాలి.

ప్రకృతి శక్తిమంతం, సృజనాత్మకం, త్యాగమయం, అది మాతృ సమానం. సమస్త ప్రాణికోటికీ, ఆహార విహారాది అవసరాలు నిరపేక్షంగా వరదానం చేయగల తల్లి! ప్రకృతిని గౌరవిస్తూ, ప్రేమిస్తూ, జీవులు బిడ్డల వలె జీవించగలిగితే, సర్వ ప్రపంచమూ ప్రశాంతి నిలయమౌతుంది. ప్రాణులలో ఉన్నత జన్మ పొందిన మానవుడి కర్తవ్యమిదే!

దీనికై ఆత్మవిద్యను ఆధారం చేసుకోవాలి. ప్రపంచమంతా పరమాత్మ ప్రకాశమేనని అనుభవ పూర్వకంగా తెలుసు కోవాలి. పరిమిత చైతన్యంతో కూడి ఉన్న జీవుడూ, అపరిమిత, అనంత అవ్యయ, అచ్యుతానంద చైతన్యంగా పరమాత్మ కలిసి ఈ ప్రపంచం లో ఉంటున్నారన్న స్పృహ, సన్యాస అంటే సమన్యాస విధానంతో బలపడి, మనసు, బుద్ధి, చిత్తం, అహంకారం వంటి స్థితులను దాటి జీవుడు పూర్ణుడౌతాడు. ఇదే నిజమైన అధ్యాత్మ మార్గం. సాధనా రీతి కూడా ఇదే!

ఈ ఆత్మపథం సత్యపథమే! అదే విజయానికి ఆధారం! అసలు విజయమూ అదే!

అప్పటికే మనో వృత్తులన్నీ ఇంద్రియాల సాలెగూటి నుండీ విడివడి నందున, ఆత్మ ప్రకాశనం అనుభవంలోకి వస్తుంది.

మనసు మలగినందున ప్రాపంచికమైన కోర్కెలు నెమ్మదించి, మోహం నశించి మోహక్షయమౌతుంది. ఇది జన్మ రాహిత్యానికి దారి తీస్తుంది.

ప్రవచనం ఒక వైఖరి మాత్రమే! దాని ద్వారా ఆత్మసాక్షాత్కారం దుర్లభం. మౌనం నుండీ, సంస్థిత స్థితి నుండీ, తీవ్ర అన్వేషణ నుండీ ఆత్మ అనుభవమౌతుంది.

ఈ స్థితిలో శుద్ధ మనసు రూపుదిద్దుకుని, పవిత్ర ప్రకృతులు ఏర్పడి, సమన్యాసంలో ఈ ప్రపంచంలోనే సంచరిస్తున్న సన్యాసులు, ఉపనిషత్ రహస్యాలను ఎరిగి, అటువంటి వేదాంత విజ్ఞానంలో పరిపూర్ణత సాధించిన విజ్ఞానవేత్తలు, జ్ఞానం ప్రకాశిస్తున్న వేళలో, దేహాత్మ భావనను దాటి ఆత్మ స్వరూపులై నిలకడ చెందుతారు. నిజానికి ఆ క్షణాలే వారికి అంతకాలం! 'ఆపై ఈ భూమండలంపై వారి జీవన యాత్ర జీవన్ముక్తి స్థితిలోనే కొనసాగుతుంది. నామ, రూప, భావాదులను దాటి, పరాత్పరమైన ఆత్మ యందు నిష్ఠుడౌతాడు. ఈ స్థితి స్థిరమైనది కనుక పాప, తాప, శాప, శోకాదులను దాటి, పరబ్రహ్మమందు చిత్తాన్ని నిలిపి నిలిపి, చివరకు తానూ పరబ్రహ్మమౌతాడు. ఇదొక అద్వితీయ, రమణీయ భూమిక.

నిరంతరం సత్కర్మలను ఆచరిస్తూ,
వేదోపనిషత్ విద్యలను గౌరవిస్తూ,
సర్వదేవతా భావనలను ఆరాధిస్తూ, సంభావిస్తూ,
విశ్వాసమే శ్వాసగా జీవిస్తూ,
నిష్ఠను ఆచరణ భూమికను చేస్తూ,
అహంకార, మమకారరాహిత్యానికి చిహ్నమైన 'శిరోముండనా'న్ని వహిస్తూ, తలపులను సమసింపచేసుకుని అంటే సన్యాసి వలె జీవిస్తూ, నిఖిల ప్రపంచానికీ ఆదర్శమూర్తిగా అలరారే వ్యక్తులకు 'ఆత్మజ్ఞానం' లేదా బ్రహ్మజ్ఞానం లభించి తీరుతుంది.

'ముండకము' అంటే సన్యాసమని అర్థం!

అనుకుంటున్నంత తేలిక కానిదీ, అయినా అందుకోవలసినదీ బ్రహ్మజ్ఞానం!

ప్రపంచ భావన మలగి,
పరమాత్మ భావన వెలిగేది ఇక్కడే!!

ఇదే **ముండకోపనిషత్** సారం.

**వి.యస్.ఆర్.మూర్తి**
9440603499





గురు అంగద్

# బ్రహ్మ స్వరూప భావన ఆచరణే కీలకం

ఆహారాన్ని ఏవగించుకోరాదని అందుకు రామకృష్ణ పరమహంస, షిరిడిసాయి భక్తుడు కుశాభావ్‌లు వ్యవహరించిన తీరును చూశాం. గురు నానక్ శిష్యుడు లెహనా వ్యవహరించిన తీరు చూద్దాం. లెహనా సిక్కుల గురువైన గురు నానక్ శిష్యుడు. గురువే సర్వమూ అని భావించే వాడాయన. ఆయనకు గురు వాక్కే బ్రహ్మ వాక్కు.. నానక్ ఒకసారి అతనిని **'నీ ఇంటికి పో'** అన్నారు. **'తమ పాద సన్నిధి తప్ప వేరే ఇల్లు లేదు'** అన్నాడు లెహనా. అయితే **'నాతో రా!'** అంటూ లెహనాను తన వెంట తీసుకుపోయాడు. నదీ తీరంలో గుడ్డ కప్పి ఉన్న ఒక శవం వద్దకు తీసికెళ్ళాడు లెహనాను. ఆ శవం నుంచి భరింపరాని దుర్గంధం వస్తోంది. **'దానిని తిను'** అన్నాడు నానక్. లెహనా ఏ మాత్రం సంకోచించలేదు. **'ఎటు నుంచి తినడం మొదలు పెట్టమంటారు?'** అని ప్రశ్నించాడు. **'కాళ్ళ వైపు నుంచి'** అన్నాడు నానక్. **'అలాగే'** అని శవంపై ఉన్న గుడ్డను తీశాడు. అంతే ఆశ్చర్యపోయాడు. అక్కడ శవం బదులు పొడవైన పళ్లెంలో పంచభక్ష్య పరమాన్నాలున్నాయి. ఆ అద్భుత మహిమను చూసిన లెహనా వెంటనే గురువు పాదాలపై పడ్డాడు. అది శవమైనా, పంచభక్ష్య పరమాన్నాలైనా బ్రహ్మమే. జుగుప్స తగదు. సర్వమునూ బ్రహ్మగా చూసే లెహనాను గురు నానక్ తన అనంతరం గురువుగా నిర్ణయించాడు. అతనికి గురు అంగద్ అని పేరుపెట్టాడు. ఇక్కడ ముఖ్య విషయం ఏమిటంటే గురు నానక్ తన కుమారులను కూడా కాదని లెహనాను గురువుగా చేయటం. అన్నిటిలో బ్రహ్మ ముందనే బ్రహ్మ స్వరూప వాదనను ఊహించు కోవచ్చు. కానీ ఆచర ణలో పెట్టాలి కదా! ఆచరిస్తే కదా గురుస్థాయి లభించేది. అందరూ కొద్దో గొప్పో ఆధ్యాత్మికతను అలవరచుకోవాలని సాయిబాబా వంటి సద్గురువులు పరీక్షలు పెడతారు.

**దేని పట్లా జుగుప్స తగదు**

సాయి కూడా బ్రహ్మ భావన పట్ల తన భక్తుల ప్రవర్తనను నిశితంగా పరీక్షించేవారు. బాబా శిష్యులలో నిష్ఠాగరిష్ఠుడైన దాదా కేల్కర్ ఒకరు. సాయి ఒక ఏకాదశి దినాన అతనిని మాంసం కొని తెమ్మన్నారు. గుర్వాజ్ఞ ప్రకారం వెంటనే బయలుదదేరాడు కేల్కర్. సాయి అతనిని పరీక్షించారు. అతడు నెగ్గాడు.

మరోసారి బాబా మాంసపు పులావ్ తయారు చేస్తున్నారు. అప్పుడు అక్కడే ఉన్న కేల్కర్‌ను **'మాంసం ఉడికిందో లేదో చూడుము'** అన్నారు సాయి. సాయి బాబా వంట చేస్తుంటే ఉడకకుండా ఉంటుందా పరీక్షించవసరం లేద నుకున్నాడు కేల్కర్. అందువల్ల **'ఉడికింది'** అన్నాడు. అయితే సాయి వదలలేదు. **'నీవు కంటితో దానిని చూడలేదు. నాలుకతో రుచి చూడలేదు. ఉడికిందని ఎలా చెప్పావు. మూత తీసి చూడుము'** అని కేల్కర్ చేయి పట్టుకుని మరు గుతున్న డేగిసాలో పెట్టారు. ఆశ్చర్యంగా కేల్కర్ చేతికి ఏమీ కాలేదు. మరల సాయే **'నీ చేతిని తీయుము. నీ ఆచారమును పక్కకు పెట్టి తెడ్డుతో తీసి, కొంచెం ప్లేటులో వేసి, ఉడికినది, లేనిది తెలుసుకొనుము'** అన్నారు. ఎన్నడూ మాంసాన్ని తాకని కేల్కర్ మనస్సు ఒక్క క్షణం ఊగిసలాడింది. అయితే సాయి ఆజ్ఞను పాలించటమే కేల్కర్ కర్తవ్యంగా చేసుకున్నాడు. మాంసం అయినా జుగుప్స ఉండకూడదు. అదీ బ్రహ్మయే. సాయి ఆ భావనను తన భక్తులకు కలిగించారు.

**అంతా మనదే అయితే పోయేదేముంది**

అన్నదానం అన్నది భక్తి, కర్మ, జ్ఞాన మార్గాలకు కూడలి వంటిది. హైదరాబాద్‌లోని ఉప్పుగూడాలో భట్‌జీ బాపూ మహరాజ్ అన్న దానం చేస్తుండేవారు. ఒకనాడు వారి అబ్బాయి గోపీనాథ్ జీతం డబ్బు తెచ్చి భద్రపరచకుండా జేబులోనే ఉంచుకున్నాడు. తెల్లవారింది. తీరా చూస్తే డబ్బులేదు. కాగా గోకర్ణం నుంచి వచ్చిన అతిథి ఒకరు చాలా కాలంగా వారి ఇంట్లో భోజనం చేస్తున్నాడు. ఇది జరిగిన రోజే గోకర్ణం అతిథి వెళ్లిపోయాడు. అందరికీ ఆ అతిథిపైనే అనుమానం వచ్చింది. అయితే మహరాజ్ కుమారునితో **'నీ అజాగ్రత్త కారణంగా ఇంటికి వచ్చిన అతిథిని మరికొంత కాలం సేవించే భాగ్యం కోల్పోయాను'** అన్నారు. అంటే డబ్బు విషయంలో జాగ్రత్తగా ఉంటే అతిథి దానిని తీసుకుని వెళ్లిపోక మరికొంతకాలం అక్కడే ఉండేవాడని ఆయన ఉద్దేశం. డబ్బు మనదే. అతిథి మనవాడే. పోయినది ఏముంది. అది భక్తి మార్గానికి పరాకాష్ఠ.

**ముళ్ళపూడి పాండురంగ సాయినాథ్**
**మున్నలూరి బోస్**



## భగవద్గీత

# ఈ జ్ఞానాన్ని ఇతరులకు అందించేవారికన్న ఇష్టులు నాకు లేరు

అధ్యాయం- 18
శ్లోకం- 69

న చ తస్మాన్మనుష్యేషు
కశ్చిన్మే ప్రియకృత్తమః।
భవితా న చ మే తస్మాత్
అన్యః ప్రియతరో భువి ॥

**తాత్పర్యం :**
నాకు అతని కన్నను ప్రియుడైన సేవకుడు మరొక్కడు ఈ ప్రపంచమున లేడు. అతనికి మించిన ప్రియుడైన వాడు వేరొక్కడు ఉండబోడు.

భాష్యం: లేదు.

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత యధాతథము' ఆధారంగా సమర్పిస్తున్నాము.

Google play | iOS iTunes

## గోవు



**ఋషభాం నపి జానామి రాజన్ పూజిత లక్షణాన్**
**ఏషాం మూత్ర ముపాఘ్రాణం అపి వన్ధ్యా ప్రసూయతే**
(విరాటపర్వం 3-12)

విరాటరాజు కొలువులో సహదేవుడు పశువుల సంరక్షకుడై పశువైద్య శాస్త్రాన్ని రచించాడు. ఉత్తమ లక్షణాలు గల ఎద్దుల పంచితమును (మూత్రమును) వాసన చూసినంత మాత్రాన వంధ్యలు (సంతానం లేనివారు) సంతానవంతులవుతారు అని దానిలో రాశాడు.

- లక్ష్మణరేఖ గోపాలకృష్ణ
9493053206

నేటి యువతలో చాలామందిమొదటి ఉద్యోగం నుండే పెద్దమొత్తాల్లో ఆర్జిస్తున్నారు. అయితే ఇప్పుడున్న జీవనశైలిని బట్టి వారి ఖర్చులు సైతం అలాగే ఉంటున్నాయి. మంచి ఇల్లు, కారు, పిల్లలకు అత్యుత్తమ విద్యని అందించడానికి అయ్యే ఖర్చు....ఇవన్నీ కాకుండా వారి జీవనశైలి విలాసవంతంగా ఉంటూ...వస్తున్న రూపాయి...అంతే వేగంగా బయటకు వెళ్లిపోతోంది. అందుకే ఈ కాలంలో యువత...తమ సంపాదనకి తగినట్టుగా ఖర్చుతో పాటు...పొదుపు గురించి కూడా ఆలోచించాలి. అందుకు ఉపయోగపడే మార్గాలు ఇవి-

## కొత్తగా జాబ్ లో జాయిన్ అయ్యారా..



# భలే పొదుపు మార్గాలివి!

ఎంత సంపాదిస్తున్నవారికైనా ఆర్థిక భద్రత అవసరం. అది సంపాదించడం మొదలుపెట్టిన మొదటినెలలోనే చేతికి అందేది కాదు...అది ఒక నిరంతర ప్రక్రియ. ఎంత జీతం వస్తోంది...ఇంటి ఖర్చు బడ్జెట్ ఏమిటి, ఆర్థిక లక్ష్యాలేమిటి, ఇన్వెస్ట్‌మెంట్స్, ఇన్సూరెన్స్...పన్నులు...ఇలాంటివన్నీ దీర్ఘకాలంలో ఆర్థిక భద్రతని ప్రభావితం చేసే అంశాలు.

### బడ్జెట్ తప్పనిసరి...పొదుపు అవసరం

డబ్బు వస్తోంది..ఖర్చు చేస్తున్నాం అన్నట్టుగా ఉంటారు కొందరు అది సరైన పద్ధతి కాదు. సంపాదనకి ఖర్చులకు సమన్వయం కుదిరేలా బడ్జెట్‌ని వేసుకోవటం అవసరం. మొబైల్ యాప్‌పైనా, ఎక్సెల్ షీటయినా, సింపుల్‌గా డైరీలో అయినా ఈ లెక్కలు ఉండితీరాలి. 'నేను ఒక ఎక్సెల్ షీట్ మీద...నా ఖర్చులను గురించి వివరంగా రాస్తాను. నేను సంపాదిస్తున్న దాంట్లో ఎంత శాతం ఎలా పోతుంది...అనేది తెలుసుకుంటాను' అంటున్నారు...ఢిల్లీలో ఒక ప్రయివేటు కంపెనీలో సీనియర్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్న 24 ఏళ్ల యువతి ఒకరు. మూడునాలుగు నెలల పాటు బడ్జెట్ వేసుకుని ఖర్చుపెట్టిన తరువాత మాత్రమే మనకు అత్యవసరాలకు ఎంత ఖర్చుపెడుతున్నాం, అవసరం ఉన్నవాటికి తగినంతగా విచక్షణతో ఎంత ఖర్చు చేస్తున్నాం...విలాసాలకు అనవసరంగా ఎంత ఖర్చు చేస్తున్నాం...అనేది అర్థమవుతుంది..అంటున్నారు ఆర్థిక సలహాదారులు. అనవసరంగా కొంత మొత్తం బయటకు వెళ్లిపోతుందని తెలిసిన వెంటనే తప్పనిసరిగా జీతంలో 10నుండి 20శాతం మొత్తాన్ని బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ ఎమౌంట్‌గా దాచటం మొదలుపెట్టాలని వారు సలహా ఇస్తున్నారు. దీనిని ఒక అలవాటుగా మార్చుకోవటం వలన డబ్బు వృథా కావటం తగ్గి...అది ప్రయోజనకరమైన మార్గాల్లోకి వెళుతుంది.




అయితే ఇలా పొదుపు చేసేటప్పుడు డబ్బుని మరింత పెరిగే మార్గాల్లోకి తీసుకుని వెళ్లాలి. చిన్నమొత్తాల్లో అయినా ఎంత త్వరగా డబ్బుని ఆదాయ వనరుగా సంపద సృష్టిగా మార్చగలిగితే అంతగా దీర్ఘకాలంలో అధిక ప్రయోజనం ఉంటుంది. డబ్బుని దాచటంలో వ్యక్తుల దృక్పథం చాలా ప్రధానంగా పని చేస్తుంది. రోజువారీ ఖర్చుల ద్వారా బయటకు వెళ్లిపోయే రూపాయిలు దీర్ఘకాలంలో సంపదగా ఆర్థిక భద్రతగా మారతాయని గుర్తించాలి.

### ఆర్థిక లక్ష్యాలు ఉండాలి

జీవిత లక్ష్యాల్లాగే ఆర్థిక లక్ష్యాలు సైతం చాలా ముఖ్యమైనవి. ఇల్లు కారు, ఇతర ఆస్తులు, విదేశీ ప్రయాణాలు ...లక్ష్యాలు ఏవైనా ప్రణాళికప్రకారం పొదుపు అవసరం. కొంతమంది ఒకేసారి ఎక్కువ మొత్తాన్ని దాచాలని ప్రయత్నించి గందరగోళానికి గురవుతుంటారు. తమ ఆదాయం ఎంత, ఖర్చు ఎంత, ఎంత వయసులో ఉన్నారు...లాంటివన్నీ పరిగణలోకి తీసుకుని ఆర్థిక లక్ష్యాలను ఎంపిక చేసుకోవాలి. లక్ష్యాలను కూడా తక్కువ కాలం, మీడియం కాలం, సుదీర్ఘకాలం లక్ష్యాలుగా విభజించుకోవాలి. అప్పుడు ఏ లక్ష్యానికి ఎంత ఖర్చువుతుంది, ఎంతకాలం ఎంత మొత్తంలో పొదుపు చేయాలి అనేది స్పష్టంగా అర్థమవుతుంది. ఆర్థిక లక్ష్యాలను ప్లాన్ చేసుకునేటప్పుడు మరొక విషయాన్ని గుర్తుంచుకోవాలి. నాలుగేళ్ల తరువాత ఒక కారుని కొనాలని అనుకున్నపుడు అప్పటికి పెరగబోయే కార్ల ధరలను సైతం పరిగణనలోకి తీసుకోవాలి.

### పెట్టుబడి ఎంపిక

డబ్బునిపెట్టుబడి పెట్టాలనుకున్నపుడు పెట్టుబడుల కాలం, రిటర్నులు, పన్నుల విధానం మొదలైన అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి.

అయితే కొత్తగా ఉద్యోగాల్లో చేరినవారు టాక్స్ ని తప్పించుకునే ఆలోచనలోనే ఉండకుండా లాభదాయకమైన పెట్టుబడులను ఎంపిక చేసుకునిపెట్ట వచ్చు. ఈపిఎఫ్, పిపిఎఫ్, ఎన్‌పిఎస్, లైఫ్ ఇన్సూరెన్స్ వంటివి ఎంపిక చేసుకోవచ్చు.

## ఫిక్స్‌డ్ డిపాజిట్ల మీద ఎనిమిది శాతం వడ్డీ

మంచి భవిష్యత్తు కోసం ప్రతీ వ్యక్తి మంచి నగదు సేవింగ్ రూపంలో వివిధ స్కీంలలో పెట్టుబడులు పెడతారు. ఎక్కువగా ఫిక్స్‌డ్ డిపాజిట్ లేదా టర్మ్ డిపాజిట్‌లో పెట్టుబడులు పెడతారు. ఎక్కువగా ఫిక్స్‌డ్ డిపాజిట్ లేదా టర్మ్ డిపాజిట్‌లలో పెట్టుబడులు పెడతారు. కానీ దృష్టిసారించాల్సిన విషయం ఒకటుంది. ఎఫ్‌డిల కోసం కొన్ని ఆసక్తి కర విషయాలు తెలుసుకుందాం. వీటిని అర్థం చేసుకుందాం.

రిజర్వ్ బ్యాంక్ ద్వారా ఈ సంవత్సరం ఇప్పటివరకు రెపో రేటులో 1.10 శాతం కోత తర్వాత ఎక్కువ బ్యాంకులు తన టర్మ్ డిపాజిట్ మీద వడ్డీలో 0.50 శాతం తక్కువ చేసింది. ఫిక్స్‌డ్ డిపాజిట్ మీద వడ్డీ ధరల్లో మార్పు వచ్చింది. ఎక్కువ శాతం బ్యాంకులు ఒక సంవత్సరం జమా మీద 7.70 శాతం ఎక్కువగా ఇస్తుంది. అదే మరో వైపు సమాచారం ఇచ్చింది. ప్రయివేటు రంగంలో ఐడిఎఫ్‌సి పోస్ట్ బ్యాంక్, ఎయు స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు కొంత సమయం వరకు ఎఫ్‌డి మీద ఇప్పటికి 8శాతం ఎక్కువగా వడ్డీ దొరుకుతుంది.

ఎఫ్‌డి మీద ఎయు స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు ఈ ధరల్లో వడ్డీ ఇస్తుంది.

మీకు తెలియజేయాల్సింది ఒకటుంది. ఎము స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు ఏడు రోజుల నుంచి 15 రోజుల వరకు 5.5శాతం వడ్డీ వస్తుంది. ఒక నెల 16 రోజుల నుంచి మూడు నెలల వరకు జమ చేస్తే బ్యాంకు 6.75శాతం వడ్డీ ఇస్తుంది.




బ్యాంకు మూడు నుంచి ఆరు మాసాల వరకు 6.90 శాతం ఇంట్రెస్ట్ ఇస్తుంది. ఇతర బ్యాంకులు ఎఫ్‌డిల మీద ఇన్‌స్టెంట్ రేట్‌తో పోల్చి చూస్తే ఎక్కువగా ఉంది.

### వృద్ధులకు 0.50 శాతం ఎక్కువగా వడ్డీ

అదే బ్యాంకు ఆరు నెలల నుంచి 12 నెలల వరకు 7.01 శాతం వడ్డీ ఇస్తుంది. ఎయు స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు 12 నుంచి 15 రోజుల సమయంలో 7.77 శాతం వడ్డీ ఇస్తుంది. వడ్డీ ధరలు కోట్ల రూపాయల జమా మీద ఇంటికి సంబంధించిన ఎన్‌ఆర్‌ఐ/ ఎన్‌ఆర్‌ఓ రిటేల్ గ్రాహకుల కోసం ఉంది. వృద్ధులకోసం అయితే 0.50శాతం అధికంగా వడ్డీ ఇస్తున్నారు. ఎయు స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు 15 నెలల నుంచి 18 నెలల వరకు జమా మీద 8.1శాతం, 24 నుంచి 36 నెలల జమా మీద 8శాతం వడ్డీ ఇస్తుంది. అదే ఐదేళ్ల వరకు అయితే మాత్రం వేర్వేరు సమయాల్లో జమా రాశి మీద సగటువ్యక్తికి 7.77

శాతం వడ్డీ దొరుకుతుంది. ఐదేళ్ల వ్యవధిలో మాత్రం టాక్స్ సేవింగ్ స్కీం మీద బ్యాంకు 7.3 శాతం ఇస్తుంది.

# మనీ మేకింగ్ యాప్‌లు




భారతదేశంలో ప్రస్తుతం అనేక మొబైల్ యాప్స్ నడుస్తున్నాయి. గూగుల్ పే, ఫోన్ పే తదితర యాప్స్‌లతో డబ్బు సులభంగా సంపాదించుకోవచ్చు. ఈ యాప్‌ల గురించి, ఈ యాప్‌లను ఎలా వినియోగించుకోవాలో తెలుసుకుందాం.

### గూగుల్ పే యాప్ :

మీరు మీ మొబైల్ యాప్ డివైస్ ఉపయోగం చేసే సమయంలో భారతదేశంలో స్నేహితులు, కుటుంబసభ్యులకు డబ్బులు పంపడానికి గూగుల్ పే చక్కటి సాధనం. మీకు ఇంటర్నెట్ కనెక్షన్, భారతీయ బ్యాంక్ ఖాతా, భారతీయ ఫోన్ నెంబర్ ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఈ యాప్ ద్వారా డబ్బులు పే చేయొచ్చు. స్వీకరించొచ్చు.

పేరు
ఫోన్ నెంబర్
యుపిఐ ఐడి
బ్యాంకు ఖాతా, ఐఎఫ్ఎస్‌సి కోడ్ ద్వారా
దగ్గరలోని ఏదేని వ్యక్తి డబ్బులు పంపించొచ్చు.

మీరు మీ దగ్గరలోని ఏదేని వ్యక్తికి డబ్బులు పంపవచ్చు. గూగుల్ పే ద్వారా డబ్బు పంపడానికి అవకాశం ఉంది. మొబైల్ ఫోన్ ద్వారా దీనిని వినియోగించుకోవచ్చు.

- మీరు ఏదేని వ్యక్తికి డబ్బులు పంపదల్చుకుంటే ఫోన్ నెంబర్ మీద పంపుకోవచ్చు.
- రెండు ఫోన్ నెంబర్లలలో కూడా గూగుల్ పే ఉండాలి.
- స్క్రీన్ మీద పే అనే ఆప్షన్ మీద క్లిక్ చేయాలి. స్వీకరించే వ్యక్తికి పంపించాలి.
- ఎప్పుడేతే కనిపిస్తుందో అప్పుడు ప్రొఫైల్ ఫోటో మీద టైప్ చేయాలి.
- ఒకవేళ మీరు అతని ఫోటో చూడని పక్షంలో హోం స్క్రీన్ మీద వెళ్లిపోవాలి.
- ఎక్కువగా టైప్ చేసి మీరు ఒఆర్ కోడ్ స్క్రీన్ చేయాలి.
- ఒఆర్ కోడ్ వచ్చే సమయంలో స్కాన్ చేయగలగాలి.

**గమనిక:** ఇలా చేయడానికి మీరు గూగుల్ పే ద్వారా తమ కెమెరా ఉపయోగం చేయాలి. భారత్‌లో ఉండే ఎవరికైనా డబ్బులు పంపియ్యవచ్చు

### ఫోన్ పే :

ఒకవేళ మీరు అవసరానికి తన స్నేహితులకు, కుటుంబ సభ్యులకు ఆన్‌లైన్ డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయదల్చుకుంటే బిల్లుల చెల్లింపులు చేయాలి. ఆన్‌లైన్ ఎక్కువగా ఇష్టపడతారు. మీకోసం ఆన్‌లైన్ ద్వారా డబ్బులు సంపాదించుకోదల్చుకుంటే ఫోన్ పే మంచి యాప్. ఈ యాప్ ప్రతి చెల్లింపును సుగమం చేస్తుంది. స్క్రాచ్ కార్డు ప్రదానం చేస్తుంది. మీరు దీని ద్వారా 100 రూపాయల గ్యారంటీ క్యాష్ బ్యాక్ దొరుకుతుంది. దీంతో పాటు టికెట్ బుక్ చేసుకోవచ్చు. మొబైల్ రీచార్జి, డిష్ టీవీ రీచార్జి, ఇతర ఆన్‌లైన్ చెల్లింపులు చేసుకోవచ్చు. టికెట్ లు బుక్ చేసుకోవచ్చు. మొబైల్ రీచార్జి చేసుకోవచ్చు. డిష్ టీవీ రీచార్జి చేయొచ్చు. ఇతర ఆన్‌లైన్ చెల్లింపులు చేసుకోవచ్చు. ఫోన్ పే వాలెట్ మనీ రూపంలో ఉంటుంది.

### కింగ్ టాస్కర్ :

కింగ్ టాస్కర్ కొందరు వ్యక్తులకు మంచి సాధనం. ఆన్‌లైన్ చెల్లింపుల్లో బెస్ట్ అనిచెప్పొచ్చు. మొబైల్ ఫోన్‌ల మీద వేర్వేరుగా పనిచేయడానికి ఇష్టపడతాం. ఈ యాప్ చాలా బాగుంటుంది. మంచి అనుభవాలను మిగులుస్తుంది. గూగుల్ పే స్టోర్‌లో ఈ యాప్ అందుబాటులో ఉంటుంది. ఈ యాప్ ద్వారా మీకు ఇష్టమైన వినోదాన్ని వీక్షించుకోవచ్చు. ఒక అధ్యయనంలో ఈ యాప్‌ను ఎక్కువ మందిఇష్టపడుతున్నారు. ఈ యాప్ గూగుల్ ప్లేస్టోర్‌లో అందుబాటులో ఉంటుంది.

### ఐ పోల్ :

ఐ పోల్ అనేది కస్టమైజ్‌డ్ మార్కెటింగ్ రీసర్చ్ యాప్. మార్కెట్ ఒడిదుడుకులను వివరిస్తుంది. డైరీని రాసుకుంటుంది. ఇది ఆండ్రాయిడ్, ఐఓఎస్‌లలో అందుబాటులో ఉంటుంది.

పండుగ వేళ బిజినెస్ చేయదల్చుకుంటే ఈ బిజినెస్ ఐడియాలను తెలుసుకోవాల్సిందే. పండుగ సీజన్‌ని బిజినెస్ చేయడానికి అనుకూలమైన సీజన్‌గా మార్చుకోవచ్చు. పండుగ సీజన్ అనేది కొన్ని రోజులపాటు కొనసాగుతున్న నేపథ్యంలో ఆ పరిమిత కాలంలోనే ఎక్కువ డబ్బుని సంపాదించడానికి అవకాశం ఉంటుంది. అయితే పండుగ సీజన్ లో వ్యాపారం ద్వారా లాభాలు ఆర్జించాలనుకుంటే చిన్న వ్యాపారాలు అందుకు అనుకూలం. వీటితోనే ఎక్కువ లాభాలను సొంతం చేసుకోవచ్చు.



## దీపావళి సీజన్‌లో..

# ఈ వ్యాపారాలతో లాభాల పంట!

ఫెస్టివల్ సీజన్‌లో చిన్న బిజినెస్‌ని ప్రారంభించి లక్షలాది రూపాయలు సంపాదించుకోవచ్చు. పండుగల్లో దీపావళి మరింత ముఖ్యమైనది. ఈ పండుగ సీజన్‌లో అనేక రకాల వ్యాపారాలు చేయడానికి వీలుంటుంది. ఇందులో లక్షలాది రూపాయలు సంపాదించుకోవచ్చు.

### టపాసుల బిజినెస్

ఫెస్టివ్ టైమ్‌లో టపాసుల బిజినెస్ మంచి లాభాలు తెచ్చిపెడుతుంది. సుప్రీంకోర్టు టపాసుల అమ్మకం పట్ల కొన్ని మార్గదర్శకాలను సూచించింది. చాలా రాష్ట్రాల్లో టపాసుల కొనుగోలు అనుమతి ఉంది. వీటి అమ్మకాలకు రాష్ట్రంలోని పోలీసుల నుండి టెంపరరీ లైసెన్స్ పొందాల్సి ఉంటుంది.

టెంపరరీ లైసెన్స్ తో చైనీస్, భారతీయ కంపెనీల టపాసులు అమ్మడానికి కొనుగోలు చేయడానికి కొన్ని ప్రాంతాల్లో అనుమతులున్నాయి. అతిపెద్ద చప్పుడు వచ్చే బాణా సంచా విషయంలో పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. లైసెన్స్ కొరకు పోలీస్ వెబ్‌సైట్ ద్వారా సమాచారాన్ని తెలుసుకోవచ్చు. ఈ లైసెన్స్ డిస్ట్రిక్ డిప్యూటి కమిషనర్ జారీ చేస్తారు.

దీపావళి రోజు చైనీస్ లైటింగ్ అమ్మకాలు ఎక్కువగా ఉంటుంది. దీపావళి పండుగసీజన్‌లో డెకోరేటివ్ లైటింగ్ ఎక్కువగా అమ్ముడవుతాయి. ఈ వ్యాపారం 10వేల రూపాయల పెట్టుబడి నుంచి ప్రారంభమౌతుంది. రిటైల్ లో ఈ వ్యాపారం చేసేవారికి 25 నుంచి 30శాతం మార్జిన్ దొరుకుతుంది.



### బేకరీ ఉత్పత్తులు....

దీపావళి సమయంలో మిఠాయి, చాక్లెట్, ఫ్రూటీ, కూల్డ్ డ్రింకులు... ఎక్కువగా అమ్ముడుపోతాయి. అలాగే దీపావళికి అనగానే ఎవరికైనా ముందుగా గుర్తొచ్చేది బహుమతులు. ఆత్మీయులు బహుమతులను ఇచ్చిపుచ్చుకునే పండుగ ఇది. ఒక వారం రోజుల ముందునుండీ ఈ వ్యాపారం చేయవచ్చు. పెద్ద షాపుల ముందు ప్రత్యేకంగా గిఫ్ట్ ఐటంలను అమ్ముతుంటారు. తక్కువ కాలంలో లాభాలు సాధించాలంటే ఇది కూడా మంచి మార్గమే. పెద్ద పెద్ద కార్పొరేట్ కంపెనీలు కూడా తమ ఉద్యోగులకు గిఫ్ట్‌లు ఖరీదు చేస్తుంటాయి.

బికనీర్, హల్దీరామ్, ప్రియా గోల్డ్, పెప్సీ, కోకాకోలా, ఫ్రూటీ, చాక్లెట్ కంపెనీలు ఫెస్టివ్ ప్యాక్‌లను తీసుకువస్తాయి. ఈ నేపథ్యంలో గిఫ్ట్ ప్యాక్ లు మరింత ఎక్కువగా అమ్ముడవుతుంటాయి.

### డ్రై ఫ్రూట్స్, అలంకరణ సామగ్రి

దీపావళి అనగానే స్వీట్లతో పాటు డ్రై ఫ్రూట్స్ కూడా గుర్తొస్తాయి. డెకొరేటివ్ డ్రై ఫ్రూట్స్ డబ్బాలను తెచ్చుకుని ఈ డబ్బాల్లో డ్రై ఫ్రూట్స్ నింపి మార్కెట్లో లేదా తమ స్థానిక ప్రాంతంలో అమ్మవచ్చు. పండుగల సమయాల్లో డెకెరేటివ్ డ్రై ఫ్రూట్స్ డబ్బాలు ఎక్కువగా అమ్ముడవుతాయి.

### పూజా సామాగ్రి వ్యాపారం

దీపావళి సమయంలో లక్ష్మీ, గణేష్ ప్రతిమలు ఎక్కువగా అమ్ముడవుతుంటాయి. డెకొరేటివ్ క్యాండిల్స్,

లక్ష్మీమాత పాదాలు, దేవుళ్ల రూపులు రంగోళి, ముస్తాబయిన దీపాలు ఇవన్నీ ఎక్కువగా అమ్ముడవుతాయి. వీటిపై 20 నుంచి 25 శాతం లాభాలు వచ్చే అవకాశం ఉంది. ఈ వ్యాపారంలో 5వేల రూపాయలు పెట్టుబడి పెట్టొచ్చు. దుకాణం పెట్టుకోవడానికి లైసెన్స్ అవసరం కూడా ఉండదు.

### గిఫ్ట్‌ప్యాక్ సామాను విక్రయం

గిఫ్ట్‌ప్యాక్‌లు అమ్మవచ్చు. తయారు చేసుకోవచ్చు. దీపావళిని బహుమతులు ఇచ్చిపుచ్చుకోవటం ఆనవాయితీ కనుక ... ఈ వ్యాపారం మూడు పూవులు ఆరుకాయలుగా సాగుతుంది. డబ్బులు సంపాదించడానికి ఇది చక్కటి మార్గం.

# టాలీవుడ్‌లో కన్నడ భామల జోరు



రష్మికా మందన్న

**తెలుగు తెరపైకి ఒక్కో సమయంలో ఒక్కో ప్రాంతం నుంచి నాయికలు వస్తుంటారు. నిన్నటిదాకా మలయాళ తారల జోరు సాగితే....ఇప్పుడు బెంగళూరు భామలు అందాల విందు చేస్తున్నారు. కన్నడ నాయికలు మన సినిమాల్లో నటించడం కొత్త కాదు...కానీ మధ్యలో వాళ్ల ప్రభావం తగ్గినా...ఇప్పుడు మళ్లీ ఊపందుకుంది. రశ్మిక మండన్న, శ్రద్ధా శ్రీనాథ్, నందితా శ్వేతా, నభా నటేష్ లాంటి నాయికలు విజయవంతమైన చిత్రాలతో తెలుగు తెరపై పేరు తెచ్చుకుంటున్నారు.**

తెలుగు తెరపై సందడి చేస్తున్న కన్నడ భామ నందితా శ్వేతా. ఎక్కడికి పోతావు చిన్నవాడా చిత్రంతో టాలీవుడ్‌లోకి వచ్చింది సుందరి. ప్రేమ కథా చిత్రమ్ 2తో మరో మంచి సినిమాను దక్కించుకుంది. జీవితంలో ఒక్కసారే తలుపు కొట్టే అదృష్టాన్ని ఎదురెళ్లి ఆహ్వానించింది నందితా. తెలుగు, కన్నడ, తమిళ భాషల్లో ప్రతిభ గల తారగా పేరు తెచ్చుకుంటోంది. తన నట ప్రయాణం గురించి తెలుగు సినిమాల తరహా గురించి నందితా మాట్లాడుతూ...ఇటీవల అవకాశాలు పెరగడం వల్ల పగలూ రాత్రీ పనిచేయాల్సి వస్తోంది. నేను మూడు భాషల్లో సినిమాలు చేస్తున్నాను కాబట్టి ప్రేక్షకుల అభిరుచిని బట్టి మారాల్సి వస్తోంది. కొన్ని పాత్రలకు సన్నగా ఉండాలి. మరికొన్ని బొద్దుగా కనిపించాలంటారు. ఈ మార్పు కోసం ప్రయత్నిస్తుంటాను. మూడు భాషల చిత్రాల్లో తేడాలంటే...తమిళంలో ఎక్కువ సహజమైన కథలు చూస్తారు. కన్నడ సొంత పరిశ్రమ కాబట్టి నాకు ఎప్పుడూ ప్రత్యేకం. తెలుగులో వాణిజ్య విలువలున్న చిత్రాలకు ఆదరణ ఎక్కువ. అని తెలిపింది. నందితా అక్షర సినిమాలో నటిస్తోంది.

జెర్సీ చిత్రంతో తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకున్న బెంగళూరు సుందరి శ్రద్ధా శ్రీనాథ్. నాటకరంగం నుంచి చిత్ర పరిశ్రమకు వచ్చిన నాయికల అభియనం ప్రతిభావంతంగా ఉంటుంది. వీళ్లకు పాత్ర పోషణలో ఆత్మవిశ్వాసం, ఎలాంటి సన్నివేశంలోనైనా ప్రేక్షకులను మెప్పించే సామర్థ్యం ఉంటాయి. జెర్సీలో అలాంటి ప్రతిభే చూపించింది శ్రద్ధా శ్రీనాథ్. గతంలో యూటర్న్, ఉర్వి, విక్రమ్ వేద లాంటి చిత్రాలతో ఆకట్టుకుంది. ఇటీవలే నాని సరసన జెర్సీలో సారా పాత్రలో నటించి అలరించింది.

ప్రతి నాయికా అందంగానే ఉంటుంది అందులో గొప్పేం లేదు. కానీ ఓ పాత్రను సహజంగా ప్రేక్షకుల ముందు నిలపాలంటే నటనలో ప్రతిభ చూపించాలి. ఈ అభినయ సామర్థ్యమున్న తారలే సంపూర్ణ నాయికలవుతారు. అలా తొలి చిత్రంతోనే పేరు తెచ్చుకున్న కన్నడ భామ నభా నటేష్. సుధీర్ బాబు సరసన ఆమె నటించిన నన్ను దోచుకుందువటే సినిమా మంచి ఆదరణ పొందింది. ఈ సినిమా ప్రేక్షకులకు నచ్చడమే కాదు..నభా నటన విమర్శకుల ప్రశంసలు పొందింది. కళపై తనకున్న ఆసక్తే తనను వెండితెరకు వచ్చేలా చేసిందని నాటకరంగం తనను నాణ్యమైన నటిగా మార్చిందని చెబుతోంది నభా. ప్రస్తుతం నభా నటేష్ రవితేజ సరసన డిస్కో రాజా చిత్రంలో నటిస్తోంది.

కిరిక్ పార్టీ చిత్రంతో కన్నడ యువతను ఊపేసిన నాయిక సంయుక్త హెగ్డే...తెలుగు రీమేక్ కిరాక్ పార్టీలోనూ నటించి అలరించింది. తెలుగు ప్రేక్షకులకూ దగ్గరైంది. మరో కన్నడ భామ ప్రణీతా సుభాష్ అత్తారింటికి దారేది చిత్రంలో నటించి ఎప్పటికీ గుర్తుండిపోయే తార అయ్యింది. బాపు బొమ్మలా పేరు తెచ్చుకుంది.

ఛలో చిత్రంతో తెలుగు తెరకొచ్చిన కన్నడ ముద్దుగుమ్మ రశ్మికా మండన్న. రెండో సినిమా గీత గోవిందంతో సూపర్‌హిట్ దక్కించుకుంది. ఇక మూడో సినిమా దేవదాస్‌లోనూ తన నటనతో అందంతో ఆకట్టుకుంది. హ్యాట్రిక్ విజయాల తార అయ్యింది. తెలుగులో ఆకర్షణీయ నాయికగా ఎదిగింది. ప్రస్తుతం మహేష్ బాబుతో కలిసి సరిలేరు నీకెవ్వరు చిత్రంలో నటిస్తోంది.



నభా నటేష్



నందితా శ్వేతా



సంయుక్త హెగ్డే

శ్రద్ధా శ్రీనాథ్



సురేందర్ రెడ్డి, తమన్నా, రామ్ చరణ్ , టి.సుబ్బరామిరెడ్డి, మురళీమోహన్, చిరంజీవి దిల్ రాజు, బ్రహ్మాజీ, సాయి మాధవ్, డా.రాజశేఖర్

# సైరా బృందాన్ని సత్కరించిన టి.సుబ్బరామిరెడ్డి

మెగాస్టార్ చిరంజీవి నటించిన సైరా చిత్ర బృందాన్ని కళాబంధు టి.సుబ్బరామిరెడ్డి ఆత్మీయ సత్కారం పేరుతో అభినందించారు. ఈ వేడుకలో పాల్గొన్ని అతిథులు అందరూ చిరంజీవి నటనను కొనియాడారు. సైరా సినిమాను ప్రశంసించారు. భారతీయులు గర్వించదగిన సినిమా అని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ వేడుకలో చిరంజీవి, తమన్నా, దర్శకుడు సురేందర్ రెడ్డి, పరుచూరి, రత్నవేలు, నిర్మాత రామ్ చరణ్, సాయిమాధవ్, శాంత బయోటిక్ ఛైర్మన్ డా.వరప్రసాద్ రెడ్డి, అల్లు అరవింద్, బ్రహ్మాజీ, మురళీమోహన్, డా.రాజశేఖర్, దిల్ రాజు, ఈనాడు ఎం.డి.కిరణ్ దంపతులు, విక్టరీ వెంకటేష్, వరుణ్ తేజ్, క్రిష్, బోనీకపూర్, సురేష్‌బాబు, కేవీపీ, సిఎం.రమేష్, అజారుద్దీన్ తదితరులు హాజరయ్యారు. డా.గురువారెడ్డి ప్రత్యేకంగా తయారుచేయించిన సైరా కేక్‌ను బహూకరించారు.

# వరుణ్‌తేజ్ కొత్త సినిమా షురూ..



ఇటీవలే గద్దలకొండ గణేష్ (వాల్మీకి) చిత్రంతో విజయం అందుకున్న వరుణ్‌తేజ్ హీరోగా మరో కొత్త సినిమా మొదలైంది. అల్లు అరవింద్ సమర్పణలో రూపొందుతున్న ఈ చిత్రానికి కిరణ్ కొర్రపాటి దర్శకత్వం వహిస్తున్నారు. సిద్ధు ముద్ద, అల్లు వెంకటేష్ నిర్మిస్తున్నారు. గురువారం హైదరాబాద్ ఫిలింనగర్ దైవసన్నిధానంలో చిత్రీకరణ ప్రారంభించారు. మహూర్తపు సన్నివేశానికి నాగబాబు క్లాప్ కొట్టారు. కొణిదెల సురేఖ కెమెరా స్విచాన్ చేశారు. అల్లు అరవింద్ గౌరవ దర్శకత్వం వహించారు.

బాక్సింగ్ నేపథ్యంలో చిత్ర కథనం జరుగుతుంది. ఈ సినిమా కోసం ప్రత్యేకంగా అమెరికా వెళ్లి శిక్షణ తీసుకున్నారు వరుణ్ తేజ్. తమన్ సంగీతం, జార్జ్ సి.విలియమ్స్ ఛాయాగ్రహణం అందిస్తున్నారు. డిసెంబర్ నుండి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తారు.

# జార్జ్‌రెడ్డి... ఓ విప్లవోద్యమం



సందీప్ మాధవ్

దశాబ్దాల క్రితం విద్యార్థి విప్లవోద్యమ నాయకుడిగా చరిత్రలో నిలిచిపోయిన పేరు 'జార్జ్‌రెడ్డి'. ఆయన ప్రస్థానం నేటికి ఎన్నో విద్యార్థి ఉద్యమాలకు ఆదర్శంగా నిలుస్తోంది. హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో చదువుతూ... ఉద్యమాల్లో ఎదిగిన నాయకుడు జార్జ్. చిన్న వయసులోనే ప్రత్యర్థుల చేతిలో హతమయ్యారు. నేటితరంలో చాలా మందికి తెలియని వ్యక్తి జార్జ్. అలాంటి ఆయన జీవితం వెండితెరపై ఆవిష్కృతం కానుంది.

ఇంతకు ముందు 'దళం' సినిమాతో ఆకట్టుకున్న జీవన్ రెడ్డీ ఈ చిత్రానికి దర్శకుడు. ఫస్ట్‌లుక్ విడుదలచేశారు. ఇది బయోపిక్ అయినప్పటికీ, కమర్షియల్ అంశాలు ఉన్నాయి. చరిత్ర మరిచిన లీడర్ అనే విషయాన్ని ట్రైలర్‌లో చెప్పారు. దసరా సందర్భంగా విడుదలైన ట్రైలర్‌కు మంచి స్పందన వస్తోంది అని చిత్రబృందం తెలిపింది. నితిన్, సాయిధరమ్, రామ్ గోపాల వర్మ, సురేందర్ రెడ్డి, ఛార్మీ తదితరులు తమ సోషల్ మీడియాలో టీమ్‌కు అభినందనలు తెలిపారు. జార్జ్‌రెడ్డి పాత్రని సందీప్ మాధవ్ పోషిస్తున్నారు. మనోజ్ నందన్, చైతన్య కృష్ణ, శత్రు, వినయ్ వర్మ ఇతర పాత్రధారులు. సత్యదేవ్ కూడా ఓ పాత్ర పోషించారు. ఈ చిత్రానికి సంగీతం సురేష్ బొబ్బిలి, రచన, దర్శకత్వం జీవన్ రెడ్డి.

# బ్యూటిఫుల్ ట్రైలర్‌కు విశేష స్పందన

సంచలన దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ కొత్త చిత్రం బ్యూటిఫుల్. (ట్రిబ్యూట్ టు రంగీలా). నైనా కథానాయికగా, సూరి కథానాయకుడిగా నటిస్తున్నారు. అగస్త్య మంజు దర్శకుడు. లోగడ లక్ష్మీస్ ఎన్టీఆర్ సినిమాకు రామ్‌గోపాల్‌వర్మతో పాటు అగస్త్య మంజు సహ దర్శకత్వం వహించిన సంగతి తెలిసిందే. రామ్ గోపాల్‌వర్మ టైగర్ కంపెనీ ప్రొడక్షన్ పతాకంపై టి.అంజయ్య సమర్పణలో టి.నరేష్ కుమార్, టి.శ్రీధర్ నిర్మిస్తున్నారు. రొమాంటిక్ ప్రేమ కథాంశంతో వైవిధ్య భరితంగా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం ట్రైలర్‌ను బుధవారం ఉదయం విడుదలచేశారు. సోషల్‌మీడియాలో ఇది ట్రెండింగ్‌లో ఉందని చిత్రబృందం తెలిపింది. షూటింగ్ పార్ట్ పూర్తిచేసుకున్న ఈ చిత్రం నిర్మాణానంతర పనుల్లో ఉందని బృందం వెల్లడించింది. ఈ చిత్రానికి పాటలను సిరా శ్రీ అందించగా...సంగీతాన్ని రవి శంకర్ సమకూరుస్తున్నారు. ఈ చిత్రానికి రచన, ఫోటోగ్రఫీ, దర్శకత్వం: అగస్త్య మంజు.



నైనా



# కొత్త చిత్రానికి శ్రీకారం

సుజియ్, మధుప్రియ, నాగేంద్ర సిహెచ్, వెంకట్ తదితరులతో ప్రియాంక ఆర్ట్ క్రియేషన్స్ నిర్మిస్తున్న చిత్రం షూటింగ్ మొదలైంది. తొలి సన్నివేశానికి భానుచందర్ క్లాప్ కొట్టారు. లయన్ సాయి వెంకట్ కెమెరా స్విచాన్ చేశారు. వీరభద్రం చౌదరి గౌరవ దర్శకత్వం వహించారు. డా.పర్వతరెడ్డి, నవీన్ కుమార్‌రెడ్డి, సనారెడ్డి, జనార్ధన్ రెడ్డి నిర్మాతలు. ఛాయాగ్రహణం కిట్టు.

# ఇష్క్ ఈజ్ రిస్క్ పాటలు

రవిచంద్ర, యుగా యుగేష్, సాయిశ్రీ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'ఇష్క్ ఈజ్ రిస్క్'. ఎస్. చంద్రశేఖర్ నిర్మిస్తున్న చిత్రమిది. ఆయన ఇప్పటికే ఈ 2 మనసులు పేరుతో మరో చిత్రం రూపొందిస్తున్నారు. తాజా చిత్రానికి రాజ్‌కింగ్ దర్శకుడు. జీవా, చమ్మక్ చంద్ర, తాగుబోతు రమేష్, నల్ల వేణు, బండ రఘు, మాధవి తదితరులు నటిస్తున్న ఈ చిత్రం పాటల విడుదల వేడుక హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో నిర్మాత ఎస్.చంద్రశేఖర్ మాట్లాడుతూ మా స్నేహితుడు అర్జున్ ఆర్య కన్నడలో మూడు యాక్షన్ సినిమాలు తీశారు. ఆయన మా సినిమాను సపోర్ట్ చేసేందుకు వచ్చారు అని చెప్పారు.

నిర్మాత డిఎస్. రావు మాట్లాడుతూ సినిమా నిర్మాణంలో సహకరించిన అందరికీ థాంక్స్. ఈ చిత్రం మంచి విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది అన్నారు.

అతిథిగా విచ్చేసిన సీనియర్ దర్శకుడు సాగర్ మాట్లాడుతూ ఒక దర్శకుడి ప్రతిభ గుర్తించబడాలి అంటే సరైన నిర్మాత కుదరాలి. అలా కుదురి వస్తున్న చిత్రమిది అని అన్నారు.

దర్శకుడు రాజ్‌కింగ్ మాట్లాడుతూ దర్శకునిగా నా మొదటి చిత్రమిది. వినోదానికి ప్రాధాన్యత ఇస్తూ రూపొందుతున్న ప్రేమకథా చిత్రమిది. మంచి టీమ్‌తో తీస్తున్నాం. తప్పకుండా అందరికీ నచ్చుతుంది అని అన్నారు. ఇంకా రచ్చరవి, రవిచంద్ర, తాగుబోతు రమేష్ తదితరులు మాట్లాడారు.



Vaccum Therapy లింగవర్థక యంత్రం
లింగం చిన్నదని నిరాశ ఎందుకు?
అమెరికా ఏజెన్సీ FDA వారి అభిప్రాయం ప్రకారం Vaccum Therapy లింగవర్ధక యంత్రం మరియు ఔషధాల ద్వారా పురుషుడు తన చిన్న లింగాన్ని 75 రోజులలో 7 నుండి 8 అంగుళాల పొడవు, లావు, గట్టిగా, శక్తివంతంగా మరియు దృఢంగా చేసుకొనవచ్చును. మరియు తన ఇష్టానుసారం శృంగార సమయాన్ని పొడిగించుకోవచ్చును. శీఘ్రస్ఖలనం, నపుంసకత్వం, లింగము వదులుగా ఉండుట, చిన్నగా ఉండుట, సన్నగా ఉండుటను తొలగించుకోవడంకోసం 30 రోజుల ఔషధం.
ఇంటి దగ్గరకే ఔషధం తెప్పించుకోండి
08943212076